



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ప్రాజెక్టులపై నిపుణులతో చర్చించాలి : కూనంనేని

పాలమూరు – రంగారెడ్డికి కేంద్రం అనుమతివ్వాలి

శాసనసభలో తీర్మానం 04

సంపుటి 28, సంచిక: 193 | ఆదివారం | 04-01-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00

బిఆర్ఎస్ హయాంలోనే ఎపికి

# రెట్టింపుగా తరలిన కృష్ణ



- కృష్ణా బేసిన్ పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ మూడేళ్లలో పూర్తిచేస్తాం
- శాసనసభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన
- కృష్ణాజలాలపై స్వల్పకాలిక చర్చలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్

''ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కంటే పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనలోనే ఆంధ్రప్రదేశ్ రెట్టింపు కృష్ణా జలాలను తరలించుకుపోయింది. కృష్ణా బేసిన్ పరిధిలోని పాలమూరు – రంగారెడ్డి, కోయిల్‌సాగర్, భీమా, నెట్టంపాడు, డిండి, ఎస్ఎల్‌బిసి తదితర పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ వచ్చే మూడేళ్లలో పూర్తి చేస్తాం. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును 90 టిఎంసిలతోనే పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టమైన హామీ ఇస్తున్నాం'' అని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ తరువాయి 2లో

పాలమూరు – రంగారెడ్డికి అనుమతులు రాకుంటే

# జూరాల నుంచే నీటిని తరలిస్తాం



అడ్డుకోవడానికి జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, ప్రధాని మోదీ ఎవరొస్తారో చూస్తాం

- ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు రావాల్సిందే
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన
- నాటి సిఎం కెసిఆర్, ఇరిగేషన్ మంత్రిగా హరీశ్‌రావు బాధ్యతలు చేపట్టాకే తెలంగాణకు మరణశాసనం రాశారని ఆగ్రహం
- ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాల్సిందిపోయి అసంపూర్తిగా వదిలేశారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

''పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 45 టిఎంసిలు తొలివిడుత, మరో 45 టిఎంసిల కోసం కేంద్రం నుంచి మలి విడుత అనుమతులు రావాల్సిందే. ప్రాజెక్టుకు అనుమతులు రాకపోతే కర్నాటక నుంచి కృష్ణా జలాలు, బీమా నుంచి మొదటగా జూరాలకు వచ్చే నీటిని వచ్చినవి వచ్చినట్లే తరలిస్తాం. అడ్డుకోవవడానికి జగన్‌మోహన్‌రెడ్డి వస్తారా, చంద్రబాబు నాయుడు వస్తారా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తారా చూస్తాం. 70 టిఎంసిలు తరలిస్తాం'' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. శాసనసభలో శనివారం 'కృష్ణా నదీ జలాల'పై స్వల్పకాలిక చర్చ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'తెలంగాణ నీళ్ల విషయంలో, అభివృద్ధి విషయంలో మేమంతా ఏకాభిప్రాయంతో పని చేస్తాం. తెలంగాణకు రావాల్సిన నీటి హక్కుల కోసం పోరాడుతాం. చచ్చినా తెలంగాణ కోసం చస్తాం. బతికినా తెలంగాణ కోసం బతుకుతాం. ప్రాణం ఉన్నంత వరకు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పని చేస్తాం. తెలంగాణ ప్రజలకు తరువాయి 2లో

పద్మశ్రీ, పద్మభూషణ్ తరహా

## రాష్ట్రంలోనూ అవార్డులివ్వాలి

ప్రభుత్వానికి సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

జాతీయ స్థాయిలో పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డుల ప్రధానం తరహాలో తెలంగాణ ప్రభుత్వం కవులు, కళాకారులు, ఉద్యమకారులకు కీడ్రాకారులకు ప్రత్యేక అవార్డులను అందజేయాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ (పబ్లిక్ సర్వీసుల నియామకముల తరువాయి 2లో

## శాసనసభకు బిఆర్ఎస్ గైర్హాజరు

శాసనసభ సమావేశాలకు పప్రతిపక్ష నాయకులు కె.చంద్రశేఖరరావుతో సహా బిఆర్ఎస్ సభ్యులు గైర్హాజరు అయ్యారు. శనివారం శాసనసభలో కృష్ణా నది జలాలపై స్వల్ప కాలిక చర్చ జరిగింది. బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్ మేరకే ప్రభుత్వం ఈ అంశాన్ని ఎజెండాల్లో చేర్చింది. అయితే ప్రతిపక్ష నాయకులు కె.చంద్రశేఖరరావు తోపాటు బిఆర్ఎస్ సభ్యులందరూ సభకు గైర్హాజరు అయ్యారు. శాసనసభ సమావేశాల రెండవ రోజు శుక్రవారంజరిగిన సభకు హాజరైన బిఆర్ఎస్ సభ్యులు సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ బయటికి వెళ్లిపోయ్యారు. అనంతరం వారు తాము శాసనసభ సమావేశాను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అన్నట్లుగానే శనివారం జరిగిన శాసనసభ సమావేశాలకు బిఆర్ఎస్ సభ్యులేవరూ హాజరు కాలేదు..

## రెండేళ్లుగా కెసిఆర్ సభకు రాకపోవడం విచారకరం : సిఎం

మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావు నదీ జలాల గురించి మాట్లాడితే, ఆయన శాసనసభకు వచ్చి రాష్ట్రానికి ఉపయోగపడే సలహాలు ఇస్తారని భావించానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నదీ జలాలపై కెసిఆర్ మాట్లాడిన వెంటనే అసెంబ్లీలో చర్చకు పెట్టామని, కానీ ఆయన మాత్రం సభకు రాలేదని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, గత పదేళ్లలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం జరిగిందని తెలిపారు. అందుకే అనుభవం కలిగిన నాయకుడిగా కెసిఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు చేస్తారని భావించానని అన్నారు. బయట సభల్లో, కార్యాలయాల్లో మాట్లాడే మాటల కంటే అసెంబ్లీలో మాట్లాడే మాటలకు విలువ ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రాకపోవడం విచారకరమని ఆయన అన్నారు.



ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 25 వరకు

## 'ఎంజి నరేగా బచావో సంగ్రామ్'

- కాంగ్రెస్ ప్రకటన
- 'విబి– జి రామ్ జి' చట్టాన్ని ఉపసంహరించి ఎంజిఎన్ఆర్ఇజిఎ పునరుద్ధరించాలని డిమాండ్
- బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఏదీ కూడా 'జి రామ్ జి' చట్టాన్ని అమలు చేసే స్థితిలో లేదు : కె.సి. వేణుగోపాల్, జైరామ్ రమేష్

**న్యూఢిల్లీ :** 'విబి– జి రామ్ జి' చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఎంజిఎన్ఆర్ఇజిఎను హక్కుల ఆధారిత చట్టంగా పునరుద్ధరించాలని, పని హక్కును, పంచాయతీల అధికారాలను పునఃస్థాపించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10 నుండి ఫిబ్రవరి 25 వరకు దేశ వ్యాప్తంగా 'ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో సంగ్రామ్'ను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. శనివారం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, జైరాం రమేష్ కార్యాచరణను వెల్లడించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో సంగ్రామ్ ఈనెల10న ప్రారంభమై ఫిబ్రవరి 25 వరకు కొనసాగుతుందని ఆయన తరువాయి 12లో

వెనిజులాపై అమెరికా

# దొంగదెబ్బ

- అర్ధరాత్రి బాంబుదాడులు
- అధ్యక్షుడు మదురో దంపతుల నిర్బంధం
- క్షిపణులు, పేలుళ్ళతో దద్దరిల్లిన నాలుగు రాష్ట్రాలు





**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. కొత్త సంవత్సరంలో మూడో రోజు తెల్లారకముందే వెనిజులాపై అమెరికా సైనిక దళం భారీ ఎత్తున దురాక్రమణ దాడులకు పాల్పడింది. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అమెరికా సైన్యం నిర్బంధించింది. వారిని యుద్ధనౌకలో న్యూయార్క్ తీసుకువస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాలో సిఐఎ ఆయనపై ''నార్కో టెర్రరిజం'' కేసు బనాయించి విచారణ జరిపి శిక్ష విధించే అవకాశాలున్నాయి. వెనిజులాలోని నాలుగు కీలక రాష్ట్రాలు, ప్రధాన సైనిక కేంద్ర సమీప ప్రాంతాలు భారీ బాంబు పేలుళ్ళు, క్షిపణి దాడులతో దద్దరిల్లాయి. ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. ఈ పేలుడు ఘటనల్లో ఎవరైనా మరణించారా? అనే విషయం వెంటనే తెలియరాలేదు. వెనిజులాపై భారీ దాడులు చేశామని, నికొలస్ మదురో, ఆయన సతీమణిని తమ సైన్యం అదుపులోకి తీసుకుందని తెల్లారిన తర్వాత ట్రంప్ స్వయంగా పత్రికాగోష్ఠిలో ప్రకటించారు. దాదాపు 30 నిమిషాల వ్యవధిలోనే ఈ బాంబుదాడులు పూర్తయ్యాయి. గగనతలంలో సైనిక కార్యకలాపాలు ఉండటంతో అమెరికా వాణిజ్య విమానాలపై నిషేధం విధిస్తూ ఆ దేశ ఫెడరల్ ఎవియేషన్ ఎడ్మినిస్ట్రేషన్ ముందుగానే ఒక ఉత్తర్వు జారీ చేసింది. ''మదురో, ఆయన భార్యను అమెరికా డెల్టా ఫోర్స్ నిర్బంధించింది, వారిని దేశం నుండి తరలించాం. అమెరికా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తో కలిసి చాలా విజయవంతంగా ఈ ఆపరేషన్ నిర్వహించాం, ధన్యవాదాలు'' అని భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున 2.00 సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టింగ్ తరువాయి 2లో

**వెనిజులాపై అమెరికా జరిపిన దాడులను చైనా, రష్యా, తుర్కియో, ఇరాన్, ఫ్రాన్స్, అర్జంటైనా, స్పెయిన్, ఇండోనేషియా, మెక్సికో, క్యూబా, కొలంబియా, యుకె తదితర దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి.**

వెనిజులాపై అమెరికా దాడులు

## వనరుల దోపిడీకే

- సిపిఐ ఆరోపణ
- ఈ చర్యను ఖండించాలని ప్రగతిశీలశక్తులకు పిలుపు
- ప్రపంచ దేశాలు అమెరికాపై ఒత్తిడి తీసుకురావాలి : వామపక్ష పార్టీలు

**న్యూఢిల్లీ:** వెనిజులాపై అమెరికా దురాక్రమణ చర్యను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. వెనిజులాలో ఉన్న చమురు, ఖనిజ వనరులను దోచుకోవడమే అమెరికా ప్రధానలక్ష్యమని అందుకే ఈ దురాక్రమణకు పాల్పడిందని విమర్శించింది. జాతీయ సార్వభౌమత్వాన్ని, రాజకీయ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి, తమ స్వీయ అభివృద్ధి మార్గాన్ని ఎన్నుకునే హక్కుకోసం పోరాడుతున్న వెనిజులా ప్రజలకు పూర్తి సంఘీభావం ప్రకటించింది. భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాంతి కాముకులైన ప్రజలు, ప్రజాస్వామ్యశక్తులు, ప్రగతిశీల ప్రభుత్వాలు కలిసి అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ చర్యలకు వ్యతిరేకంగా గొంతెత్తి నినదించాలని కోరింది. అమెరికా చర్యలను ఖండించాలని, శాంతి–సార్వభౌమాధికారం, స్వయం నిర్ణయాధికారాలను సంరక్షించుకోవడానికి వీలుగా బొలీవియన్ విప్లవానికి, వెనిజులా ప్రజలకు క్రియాశీల సంఘీభావం ప్రకటించి, వారి పక్షాన నిలబడాలని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం పిలుపు ఇచ్చింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ''బొలీవియన్ రిపబ్లిక్ ఆఫ్ వెనిజులాపై అమెరికా చేసిన నేరపూరిత సైనిక దురాక్రమణ, కఠోర అక్రమ జోక్యాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజధాని కారకస్, వెనిజులాలోని ఇతర ప్రాంతాలలో ఉన్న పౌర,సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులు జరిగాయి. ఈ దాడి ఐక్యరాజ్యసమితి నిబంధనలను, నిర్దేశించిన అంతర్జాతీయ చట్టాలను, ప్రపంచదేశాలన్నీ ఆమోదించిన సార్వభౌమాధికార, ప్రాదేశిక సమగ్రతా సూత్రాలను సమూలంగాఉల్లంఘించడమే, ఒకదేశం అంతర్గత వ్యవహారాల్లో మరోదేశం జోక్యం చేసుకోకూడదనే ఈ అంతర్జాతీయ సూత్రాలను అమెరికా పూర్తిగా ఉల్లంఘించింది. ఈ విధమైన సామ్రాజ్యవాద తరువాయి 2లో

ప్రశ్నించే గొంతుకలై

# కదలి రండి

కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

18న ఖమ్మంలో చారిత్రిక సభ

చర్లలో జాతాను ప్రారంభించిన సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ, సత్తుపల్లిలో బాగం హేమంతరావు



ప్రజాపక్షం/ భద్రాచలం/సత్తుపల్లి

భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే చారిత్రిక సభకు ప్రశ్నించే గొంతుకలై సబ్బండ వర్గాల ప్రజలు కదిలి రావాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఈ సభ ఒక మైలురాయి కానుందని ఆయన తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలో ఐదు రోజుల పాటు జరగనున్న ప్రచార జాతాను శనివారం తరువాయి 12లో



అజ్ఞాతంలో ఉన్నది

## 17 మందే

- డిజిపి శివధర్‌రెడ్డి
- బర్సే దేవా, కంకణాల రాజిరెడ్డితో పాటు 20 మంది మావోయిస్టుల లొంగుబాటు
- అతిపెద్ద ఆయుధ లొంగుబాటు ఇదే
- ఇప్పుడున్న పరిస్థితుల్లో సాయుధ పోరాటం చేయడం సాధ్యం కాదు : దేవా

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి చెందిన మావోయిస్టు పార్టీకి చెందిన 17 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని, వీరు కూడా లొంగిపోతే నూటికి నూరు శాతం మావోయిస్టురహిత రాష్ట్రంగా మారుతుందని డిజిపి శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ తరువాయి 2లో

భారీ ఎన్‌కౌంటర్

14 మంది మావోయిస్టులు మృతి 05



# ప్రపంచం
WORLD NEWS

## బంగ్లాదేశ్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన మరో హిందువు

**ఢాకా :** ఇటీవల పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుసగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో దాడుల్లో మరో హిందువు ప్రాణాలు కోల్పోయాడు. డిసెంబర్ 31 న బంగ్లాదేశ్‌లోని షరియత్‌పూర్ జిల్లా 50 ఏళ్ల ఖోకన్ చంద్రదాస్ సామూహిక దాడి జరిగింది. నిందితులు కత్తులతో ఎటాక్ చేసి.. నిప్పంటించారు. వెంటనే ఆయన్ని ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతో ఈ రోజు (శనివారం) కన్నుమూశాడు. చంద్రదాసు షరియత్‌పూర్‌లో మందుల దుకాణం, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. తీవ్రంగా కత్తిపోట్లు, కాలిన గాయాలతో బాధ పడుతూ మూడు రోజుల చికిత్స తర్వాత దాస్ కన్నుమూశాడని ఢాకాలోని నేషనల్ బర్న్ ఇనిస్టిట్యూట్ డాక్టర్లు ధృవీకరించారు. గత ఏడాది డిసెంబర్ 24 న అమృత్ మండల్ (29) అనే వ్యక్తిపై అల్లరి మూక దాడి చేసి అతి దారుణంగా హత్య చేశారు. డిసెంబర్ 18న హిందూ వ్యక్తి దీపు చంద్రదాస్ ని ఓ గుంపు చిత్ర హింసలకు గురి చేసి చంపారు. మైమెన్‌సింగ్ జిల్లాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న హిందువుపై సహ ఉద్యోగి కాల్చి చంపాడు.

# ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో ట్రంప్ జోక్యం

### యుఎన్‌ఓ, భద్రతామండలికి లిఖిత ఫిర్యాదు

**టెహ్రాన్:** ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడంతో ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐక్యరాజ్యసమిత ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్‌కు, భద్రతామండలికి లిఖితపూర్వకంగా ఫిర్యా దు చేసింది. ఇరాన్‌లో హింస, అంశాతిని రెచ్చగొట్టేవిధంగా ట్రంప్ వ్యాఖ్యలు చేస్తున్నారని, బలప్రయోగంతో బెదిరింపులకు పాల్పడుతున్నాడని, అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. కొన్ని రోజు ల క్రితం కూడా అమెరికా ఇదేవిధంగా ఇరాన్ శాంతియుత అణు కార్యక్రమాలకు భంగం కలిగించిందని, బలప్రయోగం చేసి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌ను బాహాటంగా అమెరికా బెదిరించిందని, పదే పదే ఉద్దేశపూర్వక బెదింపులు, దాడులు, రెచ్చగొట్టే ప్రకటనలతో అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఫిర్యాదు చేసింది. అంతర్జాతీయ ఛార్టర్‌లోని 2 (1) 2 (4) 2 (7) ప్రకారం, 1970 నాటి భద్రతామండలి 2665 (XXV) తీర్మానం ప్రకారం ప్రజలకు మద్దతు ఇస్తున్నామనే వంకపెట్టి రాజకీయ సాకులు, వాక్చాతుర్యం సృష్టించడం ద్వారా ఇలాంటి బెదిరింపులు,బలప్రయోగాలపై నిషేధం ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. 1953వ దశకం నుండీ ఇప్పటివరకూ ఈ విధంగా అనేకసార్లు దేశంలో జోక్యం చేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయని పేర్కొంది. 1953లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన డా.మొహ్మద్ మొస్సాదేగ్ ప్రభుత్వంపై తిరుగుబాటు సహా 1979 నుండీ అనేక ఘటనలు ఉన్నాయని, ఇరాన్‌కు వ్యతిరేకంగా ఎనిమిదేళ్ళపాటు జరిగిన యుద్ధంలో సద్దాంహుస్సేన్ పాలనలో గూఢచారి, సైనిక మద్దతును అమెరికా సమకూర్చిందని, 1988లో పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ 655 ఎయిర్ ఫ్లయిట్‌ను కాల్చివేయడంవల్ల 290 మంది అమాయకులైన పౌరులు మరణించారని, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఇరాన్ అగ్రశ్రేణి కమాండర్ ఖాసిం సోలైమాని పిరికితనంతో హత్యచేశారని, ఇరాన్ శాస్త్రవేత్తలను, సైనిక అధికారులను హత్యచేశారని, 2025 జూన్‌లో దురాక్రమణ చర్యలకు పాల్పడ్డారని, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశారని అమెరికా ఘాతుకాల చరిత్రను ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకువచ్చింది. అందువల్ల ఇలాంటి చల్లవిరుద్ధ హెచ్చరికలవల్ల ఎలాంటి ఘటనలు జరిగినా అమెరికా ప్రభుత్వం బాధ్యత వహించాలని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా హెచ్చరికలకు ఇరాన్ కూడా ప్రతి హెచ్చరికలు జారీ చేయడంతో రెండు దేశాలమధ్యా ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. స్వతంత్ర సార్వభౌమాధికార దేశ అంతర్గత వ్యవహారాల్లో ట్రంప్ జోక్యాన్ని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి తీవ్రంగా ఖండించారు. తమ దేశంలో నిరసన ప్రదర్శనలను ఎలా అదుపు చేయాలో తమ భద్రతా దళాలకు తెలుసునన్నారు. ఎవరైనా జోక్యం చేసుకుంటే తమ సైన్యం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఇరాన్‌లో ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ప్రజలు వారం రోజులుగా వీధుల్లోకి వచ్చిన నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలు అదుపు తప్పడంతో భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకూ తొమ్మిదిమంది మరణించారు. దేశంలోని పలు ప్రాంతాలకు ఈ ప్రదర్శనలు విస్తరించాయి. ఇరాన్‌లో శాంతియుతంగా ప్రదర్శనలు జరుపుతున్నవారిపై కాల్పులు జరిపితే సహించబోమని, వారిని కాపాడేదుకు తాము జోక్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శనివారం మరోసారి హెచ్చరిక చేశారు. దీనిని ఇరాన్ విదేశీ మంత్రి అరాఘ్చి తీవ్రంగా ఖండిస్తూ, ఈ ప్రకటనలు ప్రమాదకరంగా, నిర్లక్ష్యపూరితంగా ఉన్నాయన్నా రు. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి, శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరావానీ కూడా ట్రంప్ వ్యాఖ్యలను, హెచ్చరికలను తీవ్రంగా ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్‌కు, భద్రతా మండలి అధ్యక్షుడు అబుకర్ దహిర్ ఉస్మాన్‌కు లేఖలు రాశారు. ట్రంప్ వ్యాఖ్యలు ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఉల్లంఘనకు ఒక స్పష్టమైన ఉదాహరణ అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇరాన్ సార్వభౌమాధికారానికి, అంతర్జాతీయ నిబంధనలకు ట్రంప్ చర్యలు వ్యతిరేకమని, ఆయన చాలా ప్రమాదకరం గా, నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నాడనీ విమర్శించారు.

## నీటిని తరలిస్తాం (మొదటి పేజీ తరువాయి)

మేలు చేయాలన్నదే నా ఆలోచన. దేవుడి మీద ఆన. నేను ఉన్నంత కాలం తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనీయను' అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర నాయకులతో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కొట్లాడి పాలమూరు రంగారెడ్డిని సాధించుకున్నారని, ఆ సమయంలో మహబూబ్‌నగర్ ఎంపిగా ఉన్న కెసిఆర్ పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు ఇవ్వాలని అడగలేదని, ఏ నైతిక హక్కుతో కెసిఆర్ నేడు మాట్లాడుతున్నారన్నారు. జూరాల నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 70 టీఎంసీల వరద జలాలను మళ్లించి సాగునీటిని అందించేందుకు పాలమూరు ప్రాజెక్టు నిర్మించాలని ఉమ్మడి ఎపి రాష్ట్ర ఆమోదం తెలిపిందన్నారు. జూరాల నుంచి 70 టీఎంసీల వరద జలాలతో పాలమూరు ప్రాజెక్టు సర్వేతో పాటు డీపీఆర్ తయారు చేయాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా వాళ్లకు ఈ జీవో ద్వారా బాధ్యతలు అప్పగించిందన్నారు. జూరాల సోర్స్‌గా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మించాలని ఆనాడు తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్‌ఫోరం కు చెందిన నిపుణులు, ఇంజనీర్లు సూచించారని, 26 రోజుల తర్వాత ఈ ప్రాజెక్టును కెసిఆర్ పథకం ప్రకారం డైవర్ట్ చేశారన్నారు.

జూరాల నుంచి కాకుండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సోర్స్‌ను శ్రీశైలం నుంచి మార్చాలని ఆదేశాలు జారీచేశారన్నారు. ''ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అప్పటి ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో వీలైనన్ని సాగునీటి ప్రాజెక్టులు మంజూరు చేసింది. 2005 నుంచి 2014 నాటికే కృష్ణా బేసిన్‌లో ఎస్‌ఎల్‌బిసి, కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరు – రంగారెడ్డి, డిండి, మక్తల్ – నారాయణపేట, కొడంగల్, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు చేపట్టింది. 2014లో అధికారం చేపట్టిన బిఆర్‌ఎస్ ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాల్సిందిపోయి అసంపూర్తిగా వదిలేసింది. మొత్తం 490 టిఎంసిలు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు కేటాయిస్తే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి సిఎం కెసిఆర్, ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు బాధ్యతలు చేపట్టాక తెలంగాణ ప్రజలకు మరణ శాసనం రాశారు'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాలపై బహిరంగ సభలు కాదు, శాసన సభలోనే చర్చించాలని తాము కెసిఆర్, హరీష్‌రావులను ఆహ్వానించామని, పదేళ్ల కృష్ణా నీటిని ఎపి తరలించుకుపోయేందుకు వారు సహకరించి తెలంగాణకు తీరని అన్యాయం చేశారని, వివరాలతో సభలో చర్చిద్దామంటే సభకు రాకుండా వెళ్లిపోయారని సిఎం విమర్శించారు.

**బిఆర్‌ఎస్ సభ్యులు సభకు వస్తే ఎవరి బట్టలు ఎవరు ఊడదీస్తారో తెలిసేది**

'మీరు శాసనసభ పెట్టండి. మీ బట్టలు ఊడదీస్తాం. తోలు తీస్తాం అని కెసిఆర్ మాట్లాడారు. బిఆర్‌ఎస్ నాయకులు సభలో చర్చలో పాల్గొని ఉంటే ఎవరి బట్టలు ఎవరు ఊడదీస్తారు, ఎవరి తోలు ఎవరు తీస్తారు అనేది తెలంగాణ ప్రజలకు తెలిసేది' అని సిఎం అన్నారు. తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందని, ఇందుకు కాంగ్రెస్ కారణమని కెసిఆర్ విమర్శించారని, గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు ఎలా ఉపయోగపడతాయో, ఈ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై తన అనుభవంతో సూచనలు ఇస్తారని అనుకున్నామన్నారు. అందుకే కృష్ణా జలాలపై ఒక రోజు, గోదావరి జలాలపై ఒక రోజు సభలో చర్చిద్దామని ఆహ్వానించామన్నారు.

శాసనసభకు ఒక పవిత్రత ఉందని, ఈ సభలో జరిగే చర్చలను, విషయాలను, అందులోని వాస్తవాలను ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో నమ్ముతారన్నారు. ఇక్కడ అబద్దానికి ఆస్కారం లేదని, మాటల గారడీలకు స్థానం లేదని, ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలే తప్ప రాజకీయ ప్రయోజనాలకు ఇది వేదిక కాబోదన్నారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ప్రాతినిధ్యానికి ప్రతిరూపం శాసనసభ అన్నారు. సభలో మాట్లాడే ప్రతిమాట రాష్ట్ర ప్రయోజనాలే పరమావదిగా ఉంటుందన్న నమ్మకం ప్రజల్లో ఉంటుందన్నారు.

## వనరుల దోపిడీకే (మొదటి పేజీ తరువాయి)

దుస్సాహసం లాటిన్ అమెరికా, కరీబియన్ శాంతి–స్థిరత్వాలకు తీవ్ర బెదిరింపు, లక్షల మంది వెనిజులా ప్రజల జీవితాలకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. భారత కమ్యూనిస్టుపార్టీ ఈ దురాక్రమణను నిర్ద్వద్వంగా తిరస్కరిస్తున్నది, ఈ చర్య అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ నైజాన్ని మరోసారి బహిర్గతం చేసింది,

అంతర్జాతీయ చట్టాలు, నిబంధలపట్ల అమెరికాకు గౌరవం లేదని, వాటిని ఉల్లంఘిస్తూ ఉంటుదన్న విషయాన్ని మరోసారి రుజువు చేసింది. వెనిజులాలో ఉన్న ముడి చమురు, ఖనిజాలను స్వాధీనం చేసుకుని, ప్రతీఘాత, రాజ్యాధికార శక్తులతో చేతులు కలిపి బలవంతంగా తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఆ దేశ ప్రజలపైన రుద్దాలనే దురుద్దేశ చర్యలు విజయవంతం కావు, ఎందుకంటే చరిత్ర పదే పదే ఈ విషయాన్ని రుజువు చేసింది, ఐక్యరాజ్యసమితి ఛార్టర్ కింద వెనిజులాకు ఉన్న న్యాయబద్ధమైన, చట్టబద్ధమ ఐన స్వీయ రక్షణ హక్కుకు భారత కమ్యూనిస్టుపార్టీ మద్దతు ఇస్తున్నది. అంతర్జాతీయ వేదికపై ఈ అంశాన్ని చర్చకు పెట్టాలన్న వెనిజులా నిర్ణయాన్ని స్వాగతిస్తున్నది'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో తెలియజేసింది.

**ప్రపంచదేశాలు అమెరికాపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాలి**

వెనిజులాపై అమెరికా దాడిని వామపక్షాలు ముక్తకంఠంతో ఖండించాయి. ఆ దేశంలో ఉన్న చమురు, ఇతర ఖనిజ వనరులను దోచుకోవడమే ప్రధానలక్ష్యంగా అమెరికా దాడి చేసిందని సిపిఐ (ఎం) విమర్శించింది. కరీబియన్ జలాల నుండి అమెరికా తన సేనలను ఉపసంహ రించు కోవాలని సిపిఐ(ఎం) ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ కూడా అమెరికా చర్యను ఖండించింది. వలసవాద విధా నాన్ని అమెరికా తిరిగి ప్రవేశపెట్టే ఉద్దేశం తో ఉందని హెచ్చరించింది. ''మదురో ను ఆయన భార్యను నిర్బంధించి ఆ దేశం నుండి మరో చోటకు తీసుకు పోయామని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ప్రకటించడం కేవలం వెనిజులాకు వ్యతిరేకంగా మాత్రమే కాదనీ, లాటిన్ అమెరికా ప్రాంతంలో అన్ని దేశాలకు, ప్రజలకు, తమ స్వయం నిర్ణయాధికారం కోసం పోరాటం చేసే అందరికీ ఈ హెచ్చరిక చేశారని విమర్శించింది. సిపిఐ (ఎంఎల్) విమర్శిస్తూ, ఇరాక్‌పై దాడి సమయంలో ఏవైతే అబద్ధాలను అమెరికా వల్లె వేసిందో, అవే అబద్ధాలను మళ్ళీ చెప్పిందని పేర్కొంది.

## అవార్డులివ్వాలి (మొదటి పేజీ తరువాయి)

(క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరును వేతన స్వరూపమును హేతుబద్ధీకరము చేయు) సవరణకు సంబంధించి రెండు బిల్లులపై శనివారం శాసనసభలో జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. తన కలం, గళం ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేసిన అందెశ్రీ కుమారుడు దత్త సాయికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు తీసుకువచ్చిన ఈ బిల్లును సిపిఐ సంపూర్ణంగా స్వాగతిస్తోందని తెలిపారు. అయితే తెలంగాణ కోసం సర్వస్వం త్యాగం చేసిన ఉద్యమ కారులను కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలు ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా తమ విప్లవత్మాక కవితలు, పాటల ద్వారా ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలింపజేసిన కవులతోపాటు తెలంగాణ ఉద్యమ కారులకు, క్రీడాకారులకు ప్రతిఏటా 4 నుంచి 5 ప్రత్యేక అవార్డులను అందజేసి గౌరవించుకుంటే సముచిత్తంగా ఉంటుందని సూచించారు.

**కాంట్రాక్ట్ వర్కర్స్‌కు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలి**

మాట్లాడుతూ ప్రభుత్వ వివిధ భాగాల్లో పని చేస్తున్న కార్మికులందరి ఉద్యోగాలను దశలవారిగా క్రమబద్ధీకరించడం గాని, సుప్రీం కోర్డు తీర్పు ప్రకారం కనీసం రూ.18,600 వేతనమైనా చెల్లించాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. సభలో తెలంగాణ (పబ్లిక్ సర్వీసులు నియామకం క్రమబద్ధీకరణ , సిబ్బంది తీరను వేతన స్వరూపం హేతు బద్దం రెండవ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో కూనంనేని మాట్లాడుతూ ప్రభుత్వం విభాగాల్లో పని చేస్తున్న 7094 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం అభినందనీయమన్నారు. అయితే అసెంబ్లీ మొదల్కోని సచివాలయం వివిధ ప్రభుత్వ విభాగాల్లో దాదాపు 2.43 లక్షల మంది పని చేస్తున్నారన్నారు. వీరంతా ప్రభుత్వం ఏదో ఒక రూపంలో ఆదుకోవాలని ఎదురు చూస్తున్నారని తెలిపారు. మరోవైపు ఆశా వర్కర్లు, మల్టీపుల్ వర్కర్స్, మధ్యాహ్నం భోజనం కార్మికులు, కోటి పైగా మంది ఉన్నారని వీరందరికి కనీస వేతనం అమలు చేయాలని కోరారు.

## తరలిన కృష్ణ (మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. శాసనసభలో శనివారం 'కృష్ణా నది జలాల'పై స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కృషా నది జలాల వినియోగం, బెసిన్‌లో పెండింగ్ ప్రాజెక్టులు, తెలంగాణ, ఎపి తెలంగాణ మధ్య వివాదాలు, గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన జల వనరుల పరిణామాలు, ట్రిబ్యునళ్ల విచారణ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సాగునీటి రంగంలో చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలను లెక్కలతో సహా మంత్రి వివరించారు. 'తెలంగాణ సాగు నీటి రంగాన్ని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం సర్వ నాశనం చేసింది. కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం ద్వారా తెలంగాణ రైతులకు మరణ శాసనం రాసింది.

గత పదేళ్లలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి రూ.1.80 లక్షల కోట్లను ఖర్చు చేసినా కాళేశ్వరంతో సహా రాష్ట్రంలో 2014 నాటికే పెండింగ్‌లో ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదు. కేవలం రూ.7459 కోట్లు ఖర్చు చేసి ఉంటే పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవి. తద్వారా లక్షలాది ఎకరాలకు సాగు నీరు అంది తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేది' అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. 'పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకపోవడం చారిత్రక తప్పిదం. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును శ్రీశైలంకు తరలించి దక్షిణ తెలంగాణ ప్రాంత ప్రజలకు, ప్రాణహిత – చెవేళ్ల ప్రాజెక్టును మేడిగడ్డకు తరలించి ఉత్తర తెలంగాణ ప్రజలను బిఆర్‌ఎస్ ప్రభుత్వం దగా చేసింది' అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నదీ జలాల అంశాలను పరిష్కరించుకునేందుకు ఎవరితోనైనా మాట్లాడానికి కాంగ్రెస్ ప్రబుత్వం సిద్దంగా ఉందని, ఇదే క్రమంలో తెలంగాణ హక్కుగా చట్టబద్ధంగా రావాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా ఎవరినీ తీసుకుపోనివ్వబోమని, ఇది తమ ప్రభుత్వ స్పష్టమైన వైఖరి అని మంత్రి స్పష్టం చేశారు.

**మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు బిఆర్‌ఎస్ తీరని ద్రోహం**

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపొత్తల ప్రాజెక్టు విషయంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలను దగా చేసిందని, రూ.84 వేల కోట్లు అయ్యే ప్రాజెక్టుకు బిఆర్‌ఎస్ ఖర్చు చేసిందని, కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి గత ప్రభుత్వ హాయంలో కేవలం 33 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారని మంత్రి ఉత్తమ్ కుబార్ రెడ్డి చెప్పారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పరిపాలన అనుమతులతో కూడిన జిఓ 2015లో విడుదల చేయగా ఏడాది తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును జిఓను గత ప్రభుత్వ జారీ చేసిందన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్న 2023 డిసెంబర్ నాటికి కేవలం పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేసిందని, కాల్వల నిర్మాణానికి కనీసం ఒక్క ఎకరం కూడా భూసేకరణ చేయలేకపోయిందని, కేవలం 33 శాతం పనులను మాత్రమే పూర్తి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రూ.7 వేల కోట్లతో 67 లక్షల క్యూబిక్ మీటర్ల మేరకు ఎర్త్ వర్క్, 7 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, 9 కిలో మీటర్ల మేరకు ప్రెషర్ మెయిన్స్ పూర్తి చేశామని మంత్రి వివరించారు. ప్రాజెక్టుకు అవసరమైన 21 అనుమతులకుగాను బిఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం 4 మాత్రమే సాధించగా, కాంగ్రెస్ ప్రభుత్వం 17 అనుమతులను తీసుకు వచ్చిందని తెలిపారు.

**జూరాల నుంచి శ్రీశైలంకు మార్చి అన్యాయం**

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల కేంద్రంగా కేవలం రూ.32 వేల కోట్ల వ్యయంతో 90 టిఎంసిల నీటి సామర్థ్యంతో 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే విధంగా రూపకల్పన చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును శ్రీశైలం కేంద్రంగా మార్చడం ద్వారా తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.84 వేల కోట్లకు పెరగడమే కాకుండా ప్రాజెక్టు నిర్మాణ విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య అనవసరమైన న్యాయపరమైన చిక్కులకు ఆస్కారం ఇచ్చిందన్నారు. అనాడు జూరాల కేంద్రంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించి ఉంటే తెలంగాణ రాష్టానికి మహబూబ్‌నగర్ జిల్లాకు ఎంతో మేలు జరిగేదని మంత్రి పేర్కొన్నారు.

**కృష్ణా బెసిన్‌లో 73 శాతం నీటి వాటా సాధించి తీరుత్తాం :**

ఉమ్మడి రాష్ట్రంలో కేటాయించిన కృష్ణా నది జలాలలో తెలంగాణకు న్యాయ బద్ధంగా దక్కాల్సిన 763 టిఎంసిలు (73 శాతం) వాటాను సాధించి తీరుతామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు కలిపి కేటాయించిన నికర జలాలు 811 టిఎంసిలు కాగా, 65 శాతం ఆధారంగా 49 టిఎంసిలు, సగటు ఆధారంగా 145 మొత్తం 1050 టిఎంసిల నీటి కేటాయింపులు ఉన్నాయని తెలిపారు . తెలంగాణ ప్రాకంతంలో 73 శాతం పరివాహక ప్రాంత ఆధారంగా 555 టిఎంసిలు, గోదావరి నది జలాల మళ్లింపునకు 45 టిఎంసిలు, 65 శాతం ఆధారంగా 43 టిఎంసిలు, సగటు ఆధారంగా 120 టిఎంసిలు మొత్తం 763 టిఎంసిలు (73 శాతం) వాటా తెలంగాణకు రావాల్సి ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి బ్రిజేష్ ట్రిబునల్ ముందు తెలంగాణ రాష్ట్రం తరపున వాదనలు సమర్థవంతంగా వినిపిస్తున్నామని, మరో 6 నెలల్లో నీటి కేటాయింపులు పూర్తయ్యే అవకాశం ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## 17 మందే (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి ఆయన సతీమణి అడ్లూరి ఈశ్వరి అలియాస్ రేమ, మావోయిస్టు పార్టీ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌జిఎ) చీఫ్ బర్సే దేవా అలియాస్ సుక్కతో పాటు మొత్తం 20 మంది మావోయిసులు సోమవారం డిజిపి శివధర్‌రెడ్డి ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో పిఎల్‌జిఎ ఫస్ట్ బెటాలియన్ నుంచి 10 మంది, టిఎస్‌సి నుంచి 3, ఎస్‌ఎస్‌జెడ్‌బి నుంచి 2, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ (దక్షిణ పశ్చిమ బస్తర్ డివిసి) నుంచి 5 మంది ఉన్నారు. వీరి నుంచి 48 మౌంటెడ్ ఎంఎల్‌జి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. తన వద్ద ఉన్న రూ. 20 లక్షలను బార్సె దేవా స్టేట్ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబి)కి అప్పగించారు. లొంగిపోయిన మావోయిస్టులను శనివారం మధ్యాహ్నం డిజిపి కార్యాలయంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఆపరేషన్ కగార్ తర్వాత తెలంగాణలో అతిపెద్ద ఆయుధ లొంగుబాటు ఇదే కావడం విశేషం. ఇందులో హెలిక్యాప్టర్లను నేలకూల్చే ఆయుధం కూడా ఉండడం గమనార్హం. అలాగే డిజిపి శివధర్రెడ్డి నేతృత్వంలో అదిపెద్ద లొంగుబాటుగా చెబుతున్నారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖను కేంద్ర హోంశాఖ ప్రశంసించింది. తన కార్యాలయంలో మావోయిస్టుల లొంగుబాటుకు సంబంధించి అదనపు డిజిపి మహేష్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్‌ఐబి చీఫ్ బి.సుమతి, గ్రేహౌండ్స్ చీఫ్ అనీల్‌కుమార్‌లతో కలిసి డిజిపి శివధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీకి ఇది భారీ ఎదురుదెబ్బ, పిఎల్‌జిఎ బెటాలియన్ పూర్తిగా కొలాప్స్ అయిందన్నారు. పిఎల్‌జిఎ బెటాలియన్ లో అన్ని ర్యాంకులతో కలిపి 400 మందికి పైగా ఉండేవారని, కానీ ఇప్పుడు 66 మంది వరకు మాత్రమే ఉన్నారన్నారు. కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్ లొంగుబాటుతో తెలంగాణ స్టేట్ కమిటీ ఆల్ మోస్ట్ కొలాప్స్ అయిపోయిందని, మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పని చేస్తున్న వారు ఇప్పటివరకు 55 మంది ఉన్నారని భావించామని, కానీ తాజాగా లొంగిపోయిన వారు ఇచ్చిన సమాచారం ప్రకారం ప్రస్తుతం రాష్ట్రం నుంచి నుంచి కేవలం 17 మంది మాత్రమే మావోయిస్టు పార్టీలో ఉన్నారని తెలిపారు. ఇందులో కేంద్ర కమిటీలో నలుగురు, స్టేట్ కమిటీలో ఐదుగురు, డివిజనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ఏరియా కమిటీ మెంబర్లు నలుగురు, పిఎంఎస్ ఒక్కరు మాత్రమే ఉన్నారని తెలిపారు.

**దేవ్‌జీ గురించి సమాచారం తెలియదు:రాజిరెడ్డి**

మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి ఎక్కడ ఉన్నారనే సమాచారం తనకు లేదని తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తన సతీమణి అడ్లూరి ఈశ్వరి అలియాస్ రేమ, పిఎల్‌జిఎ ఫస్ట్ బెటాలియన్ ఆర్మీ చీఫ్ బర్సే దేవా అలియాస్ సుక్కతో కలిసి తెలంగాణ డిజిపి ఎదుట లొంగిపోయిన రాజిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాను అనారోగ్య సమస్యలు, తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు లొంగిపోయానన్నారు.

దేవ్‌జీతో నేను చాలా కాలంగా విడిపోయి ఉన్నామని ఆయన పరిస్థితి పూర్తిగా తనకు తెలియదన్నారు. ప్రస్తుత కాలంలో ఆధునిక టెక్నాలజీ, కమ్యూనికేషన్ వ్యవస్థతో సాయుధ పోరాటం కుదరదని, ఈ రోజుల్లో సాయుధ పోరాటం కష్టంగా మారిందని ఈ సందర్భంగా రాజీరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## వెనిజులాపై దొంగదెబ్బ (మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఐతే వెనిజులా ప్రభుత్వాన్ని ఎవరు బాధ్యత వహించి నడిపిస్తున్నారనే విషయంపై ఇంకా ఒక స్పష్టత రాలేదు. ఒక్క కారకస్‌లోనే ఏడు ప్రాంతాలలో పేలుళ్ళు సంభవించాయి. ప్రధాన సైనిక కార్యాలయం వద్ద పేలుడు భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఇళ్ళ కిటికీలు, అద్దాలు పేలుళ్ళ ధాటికి బద్దలయ్యాయి. చాలా తక్కువ ఎత్తులో ఎయిర్‌క్రాఫ్ట్‌లు కారకస్‌లో సంచరించాయి. సైనిక కేంద్రాలు, పౌర మౌలిక వసతులపై అమెరికా సైన్యం దాడులు చేసిందని వెనిజులా ప్రభుత్వం ఆరోపించింది. ప్రజలు ఇళ్ళు వదలి వీధుల్లోకి వచ్చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. కాగా బిబిసి కథనం ప్రకారం కారకస్‌లో ఒక ప్రత్యక్ష సాక్షి స్పందిస్తూ, ''నా కాళ్ళు వణికిపోతున్నాయి, నా గుండె దడ దడ లాడుతోంది, ఈ మంటలు నేను ఎప్పుడూ చూడలేదు, ఈ దారుణాన్ని తట్టుకోలేను'' అని భయంతో వ్యాఖ్యానించాడు. వెనిజులాలో ఉన్న చమురు, ఖనిజాలు, వనరులన్నీ అమెరికా సొంతమనీ, వాటిని తమకు స్వాధీనం చేయాలని, నికొలస్ మదురో గౌరవప్రదంగా పదవి నుండి వైదొలగి పోవాలని, లేకపోతే తామే బలప్రయోగం చేస్తామని కొద్దివారాలుగా ట్రంప్ ఒత్తిడి చేస్తూ వచ్చారు. ఈ ఒత్తిడులకు మదురో తలవంచలేదు. ఐక్యరాజ్య సమితికి కూడా ఆయన ఫిర్యాదు చేశారు.

చివరకు కొత్త సంవత్సరం మొదటివారంలోనే మదురోను పదవీచ్యుతుణ్ణి చేశారు. వెనిజులాలో ఉన్న ప్రకృతి వనరులను దోచుకోవడంకోసం ట్రంప్, ఒక పథకం ప్రకారం మదురోపై ఆరోపణలు ప్రారంభించారు. మొదటి విడత అధికారంలోకి వచ్చినప్పుడు 2017 లోనే ట్రంప్ సూచనప్రాయంగా, వెనిజులాపై సైనిక దాడులను తోసిపుచ్చలేమని సంకేతాలు ఇచ్చారు. మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారులకు, డ్రగ్స్ ముఠాలకు ఆయన ఆశ్రయం ఇస్తున్నారని, వెనిజులా ముడి చమురు విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని డ్రగ్స్ కార్టెల్స్‌ను పోషించేందుకు ఉపయోగిస్తున్నారని ట్రంప్ ఆరోపణలు ప్రచారంలో పెట్టారు. సెప్టెంబరునెల నుండీ కరీబియన్ జలాల్లో మానవ హక్కులు ఉల్లంఘించి అనేక పడవలపై దాడులు చేస్తూ వచ్చారు. గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ విమానవాహకనౌక సహా 50 వేలుపైగా సైన్యాన్ని వెనిజులా వెలుపల జలాల్లో మోహరించారు. దాదాపు 100 మంది ఈ దాడుల్లో మరణించారు. తర్వాత వెనిజులా నుండి చమురు ఎగుమతులు జరగకుండా అడ్డుకున్నారు. వారి మూడు చమురు నౌకలను అమెరికా సైన్యం తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. తర్వాత వెనిజులాలో డ్రగ్స్ ఎగుమతి రేవుపై సిఐఎ సారథ్యంలో డ్రోన్ల దాడి చేశామని కూడా గతవారం అమెరికా ప్రకటించింది. కొలంబియా కమ్యూనిస్టు పాలకులపై కూడా ట్రంప్ ఇదే విధంగా డ్రగ్స్ ఆరోపణలు చేశారు.

**సజీవంగా ఉన్నారా? లేదా? చెప్పండి**
**వెనిజులా ఉపాధ్యక్షుడు డిమాండ్**

మరోవైపు వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్ ప్రభుత్వ టీవీలో ఒక ప్రకటన చేస్తూ నికొలస్ మదురో, వెనిజులా ఫస్ట్ లేడీ ఫ్లోరెస్‌లను అమెరికా సైన్యం నిర్బంధించిన తర్వాత వారి జాడ తెలియడంలేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ అమెరికా సామ్రాజ్యవాద దాడులుగా ఆమె పేర్కొన్నారు. తమ నాయకుడు ప్రాణాలతో సజీవంగా ఉన్నారో లేదో సాక్ష్యాధారాలతో తమకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. శనివారం తెల్లవారకముందే వెనిజులాపై భారీస్థాయిలో అమెరికా సైన్యం దాడులు ప్రారంభించిందని ఆమె ప్రభుత్వ టీవీలో ప్రకటించారు. ఈ దాడులను ఆమె ఖండించారు. ''మా దేశాధ్యక్షుణ్ణి అమెరికా సైన్యం పట్టుకుంది, వారిని దేశం దాటించారు, వారు ఎక్కడ ఉన్నారో జాడ తెలియడంలేదు, సురక్షితంగా ఉన్నారా? లేదా? చెప్పండి'' అని డిమాండ్ చేశారు. కాగా, దేశ ప్రజలు భయాందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాలని వెనిజులా రక్షణమంత్రి వ్లాదిమిర్ పెడ్రినో లోపెజ్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. ప్రజలు భయపడవద్దని, ఎలాంటి అటవిక చర్యలకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజలందరూ మొక్కవోని దీక్షతో ఒక చెక్కు చెదరని రక్షణ గోడలా నిలబడాలని పిలుపు ఇచ్చారు. ప్రజలు తక్షణం ఇళ్ళు ఖాళీచేసి వీధుల్లోకి రావాలని పిలుపు ఇచ్చారు. తొలుత దాడులు ప్రారంభం కాగానే ఈ చర్యలను వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో తీవ్రంగా ఖండించారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించారు. వెనిజులా అంతర్గత మంత్రి డియోస్డాడో కాబెల్లో మాట్లాడుతూ, ప్రజలు ఆందోళన చెందవద్దనీ, ప్రశాంతంగా ఉండాలని, సైన్యాన్ని, పాలకులను విశ్వసించాలని కోరారు. ఈ అరెస్టుల విషయంపై బాహ్య ప్రపంచమే స్పందించాలన్నారు. దాడులు ప్రారంభం కాగానే సాయుధ వేషధారణలో అనేకమంది పౌర మిలిటరీ సభ్యులు కారకస్ వీదుల్లో ప్రత్యక్షమయ్యారు. కారకస్ నగరంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నగరంలో అనేక ప్రాంతాలలో పొగలు రావడం వీడియో ఫూటేజీలలో కనిపించింది.

**న్యూయార్క్ సదరన్ జిల్లాలో మదురో దంపతులపై విచారణ**

తాజా సమాచారం ప్రకారం మదురో అరెస్టును అమెరికా రిపబ్లికన్ సెనేటర్ మైక్ లీ ధృవీకరించారు. ఆయనను అమెరికా తరలించి క్రిమినల్ ఛార్జెస్‌పై విచారణ జరుపుతారన్నారు. విదేశాంగమంత్రి మార్కో రుబియోతో ఫోన్‌లో మాట్లాడాననీ, ఇక తదుపరి వెనిజులాపై ఎలాంటి సైనిక చర్యలూ తీసుకునే అవకాశం లేదని చెప్పారు.

అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ స్పందిస్తూ, నికొలస్ మదురోను, ఆయన భార్యను పూర్తిగా అమెరికా గడ్డపై అమెరికా కోర్టుల్లోనే విచారణ జరిపి శిక్ష విధిస్తామన్నారు. న్యూయార్క్ సదరన్ జిల్లాలోని కోర్టులో మదురో, ఆయన భార్యను విచారించి శిక్షలు విధిస్తారన్నారు. మదురోపై నార్కో టెర్రరిజం కుట్ర, కొకైన్ దిగుమతి కుట్ర, మెషీన్ గన్స్, ఇతర విధ్వంసకర ఆయుధాలు తన వద్ద ఉంచుకున్నాడన్న ఆరోపణలపై విచారణ జరుగుతుందన్నారు. ఎంతో విశ్వసనీయతతో ధైర్యంతో దాడులు చేసిన సైనిక దళానికి పామ్ బాండీ అభినందనలు తెలియజేశారు.

అమెరికా సైనిక దళం ఈ విధంగా ఒక విదేశంలో గుండె భాగం వంటి ప్రాంతానికి వెళ్ళి దాడి చేసి అధ్యక్షుణ్ణి, ఆయన సతీమణిని అరెస్టు చేయడం గతంలో ఎన్నడూ చూడలేదని, ఇది ఒక అసాధారణమైన సంఘటన అని అంతర్జాతీయ విశ్లేషకులు పేర్కొన్నారు.

**ఐక్యరాజ్యసమితికి కొలంబియా అధ్యక్షుడి వినతి**

దక్షిణ అమెరికాలో పరిస్థితులను చక్కదిద్దాలని, రక్షణ కల్పించాలని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఐక్యరాజ్యసమితికి విజ్ఞప్తి చేశారు. దక్షిణ అమెరికా దాడుల ప్రమాదంలో ఉందని ఆయన పేర్కొన్నారు. బాధ్యతగల ఐక్యరాజ్యసమితి సభ్యదేశంగా ఈ ప్రాంతంలో ఏర్పడిన సమస్య పరిష్కారానికి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతున్నామని పెట్రో పిలుపు ఇచ్చారు. అదేవిధంగా అమెరికన్ స్టేట్స్ ఆర్గనైజేషన్ (ఓఎస్) కూడా తక్షణం సమావేశం నిర్వహించాలని కోరారు. పొరుగున వెనిజులా సరిహద్దుల్లో అమెరికా దాడుల నేపథ్యంలో కొలంబియా సరిహద్దులను ఆయన కట్టుదిట్టం చేశారు. కొలంబియా–వెనిజులా సరిహద్దులో భారీసంఖ్యలో సైన్యాన్ని మోహరించారు. సామూహికంగా వెనిజులా నుండి ప్రజలు వలసలు వచ్చే అవకాశం ఉన్నందువల్ల మానవతాసహాయం చేసేందుకు పెట్రో ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. చిలా అధ్యక్షుడు గాబ్రియేట్ బోరిక్, క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్ కానెల్, ట్రినిడాడ్, టొబాగో ప్రధానమంత్రి కమ్లా పెర్సాద్ బిస్సేసర్ తదితరులు అమెరికా సైనికదళం దాడి చర్యను తీవ్రంగా ఖండించారు. అమెరికా చేసిన ఈ నేరపూరిత చర్యను అంతర్జాతీయ సమాజం తక్షణం ఖండించాలని వారు కోరారు.

**ఈ సాకులు చెల్లవు**
**ఇది సైనిక దురాక్రమణే: రష్యా**

వెనిజులాపై అమెరికా డెల్టాఫోర్స్ దాడులను రష్యా విదేశీమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. దీనిని సైనిక దురాక్రమణగా పేర్కొంది. ఈ ఘటనపై రష్యా తీవ్ర ఆందోళన చెందుతోందని మంత్రిత్వశాఖ ప్రకటించింది. వెనిజులా ప్రజలకు తన సంఘీభావం ప్రకటించింది. వెనిజులా తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి వీలుగా బొలీవిరియన్ నాయకత్వానికి తమ మద్దతు పునరుద్ఘాటిస్తున్నట్లు తెలిపింది. సైనిక దురాక్రమణ చేయడం కోసం వారు చెబుతున్న సాకులు ఎంత మాత్రం సమర్థనీయం కాదని పేర్కొంది. తమ దాడులను సమర్థించుకోవడంకోసం నార్కో టెర్రరిజం అంటూ అమెరికా చెబుతున్న సాకులు ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదని విమర్శించింది. అమెరికా చేసిన దాడుల్లో వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవడంకంటే సైద్ధాంతికపరమైన శత్రుత్వమే ప్రబలంగా కనిపిస్తోందని విమర్శించింది.


పరస్పర నమ్మకం ద్వారా వెనిజులాతో సంబంధాలు వృద్ధి చేసుకోవాలనే ఆలోచన అమెరికాలో కనిపించలేదని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దాడులు ఉద్ధృతం కాకుండా చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి ఒక మార్గాన్ని అన్వేషించడంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. పరస్పర ఆరోపణలు చేసుకోకుండా చర్చల ద్వారా ముందుకు వెళ్ళాలని, ఈ విషయం రష్యా తన పూర్తి మద్దతు ప్రకటిస్తుందని విదేశీమంత్రిత్వశాఖ పేర్కొంది. ఎలాంటి వినాశకరమైన వెలుపలిదేశం జోక్యం లేకుండా వెనిజులా ప్రభుత్వం తన భవిష్యత్తును తానే నిర్దేశించుకునేవిధంగా ఆ దేశానికి పూర్తిహామీ వెంటనే సమకూరాలని కోరింది. లాటిన్ అమెరికా 2014లో తనకుతానుగా ప్రకటించుకున్నట్లుగా ఆ ప్రాంతం ఒక శాంతి మండలంగా కొనసాగాలని ఉద్ఘాటించిం ది.

## అసెంబ్లీ సమావేశాలు



## ప్రాముఖ్యత ఆధారంగా ప్రాజెక్టుల బిల్లుల చెల్లింపులు

అసెంబ్లీలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాగునీటి ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆధారంగా చేసుకుని బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పారు. పెండింగ్ బిల్లుల విషయంలో కాంట్రాక్టర్లదే ఆలస్యం తప్ప ప్రభుత్వం దగ్గర ఎటువంటి ఇబ్బందులు లేవని డిప్యూటీ సిఎం స్పష్టంగా చెప్పారు. శాసనసభలో శనివారం జరిగిన 'కృష్ణా నది జలాల'పై స్వల్పకాలిక చర్చ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడారు. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సహా అన్నింటిపై ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షలు చేశారని, ఎస్ఎల్‌బిసి టన్నెల్‌కు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సీరియస్‌గా పనిచేస్తోందని డిప్యూటీ భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆధారంగా చేసుకుని బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ముఖ్యమంత్రి చెప్పారని ఆయన తెలిపారు. సాగునీటి శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎప్పటికప్పుడు కృష్ణా నది ప్రాజెక్టులపై సమీక్షలు చేస్తున్నారని, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖతో సంప్రదింపులు జరుపుతున్నారని అన్నారు.

## ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన
# తొలగింపు బిల్లుకు శాసనసభ ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువగా ఉండరాదనే నిబంధనను తొలగించడం, వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని 'జైన్ తిరుమలాపూర్' గ్రామం పేరును 'జయన్న తిరుమలాపూర్'గా మార్చే నిర్ణయానికి సంబంధించిన రెండు బిల్లులను శాసనసభ ఆమోదించింది. ఈ మేరకు శనివారం శాసనసభలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రవేశపెట్టిన తెలంగాణ పంచాయతీరాజ్ (సవరణ) చట్టంలోని 21వ సెక్షన్ సవరణ బిల్లును, తెలంగాణ పంచాయతీరాజ్ (రెండవ సవరణ) బిల్లును సభ ఆమోదించింది. ఇద్దరు పిల్లల నియంత్రణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని బిజెపి సూచించింది. చదువుకోని వారికి, పెద్ద కుటుంబాలకు చెందిన వారికి ఇబ్బంది జరుగుతుందని, రాజకీయంగా స్వవలంభన వైపు ఆలోచించుకునే పరిస్థితుల్లో ఇద్దరు పిల్లల నియంత్రణ నిర్ణయం మంచిది కాదని, కానీ ఇద్దరు పిల్లల వరకు మాత్రం తాము మద్దతు ఇస్తున్నామని సిపిఐ తెలిపింది. బిల్లుపై జరిగిన చర్చకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమాధానమిస్తూ రాష్ట్రంలో సంతాన ఉత్పత్తి 1.7 శాతానికి పడిపోయిందని, ఇలాగే ఉంటే ప్రతికూల పరిస్థితులు ఉంటాయని, అందుకే 2.1 శాతానికి జనాభా ఉండాలని తెలిపారు. సంతాన సాఫల్యాన్ని పూర్తిగా పడిపోకుండా పెంచుకునేందుకు వీలుగా, గ్రామాల నుంచి వచ్చిన అభిప్రాయాల మేరకు ఇద్దరు పిల్లల నియంత్రణ అంశాన్ని తొలగిస్తున్నామని వివరించారు. జనాభా తగ్గిపోతే జనరేషన్లు పడిపోతాయని, ఇప్పటికే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు, తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాలపై ఆధిపత్యం పెరుగుతుందన్నారు.

**జనాభాపై నిరంతర అధ్యయనం జరగాలి: కూనంనేని సాంబశివరావు**

ప్రభుత్వం ఎప్పటికప్పుడు జనాభా ఎంత ఉండాలి ?, ఇందులో బాలికలు, బాలురు ఎంత? అనేది నిరంతరం అధ్యయనం చేస్తూ ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను రూపొందించుకోవాలని, ఆ దిశగా ఎవరికి వారు స్వీయ నియంత్రణ పాటించాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. శాసనసభలో శనివారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టంలోని 21వ సెక్షన్ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొంటూ జనాభాను కావాలని తగ్గించొద్దని, అలాగని పెంచుకోవద్దన్నారు. ప్రజలలో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉంటుందని, జనాభా స్వీయ నియంత్రణకు నిరంతరం ఆలోచించాల్సి ఉంటుందన్నారు. చైనాలో కఠినంగా జనాభా నియంత్రణ పాటించారని, ప్రస్తుతం యువకులు లేని దశకు చేరడంతో మళ్లీ పిల్లలు కావాలనే ఆలోచనకు చైనా వచ్చిందని వివరించారు. ఇతర రాష్ట్రాలలో పిల్లలు ఉండాలని చెబుతున్నారని, మరీ ఎక్కువ, తక్కువగా కాకుండా మధ్యమార్గంగా జనాభా ఉండాలన్నారు. భారతదేశానికి జనాభా పెద్ద అడ్వాంటేజ్ అని, భారతదేశం నాలుగవ ఆర్థిక దేశంగా రావడం అంటే జనాభానే కారణమని కూనంనేని వివరించారు.

కాంగ్రెస్ సభ్యులు ఆది నారాయణ మాట్లాడుతూ ఇద్దరు పిల్లల నియంత్రణను స్వాగతించారు.

బిజెపి సభ్యులు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రాజకీయ వెసులుబాటు కోసం ఇద్దరు పిల్లల నియంత్రణను తొలగించడం మంచిది కాదన్నారు. ఇప్పటికే యంగ్ జనరేషన్ ఇద్దరు, కొంద రైతే ఒక్క సంతానంతోనే సరిపెట్టుకుంటున్నారని, ఇలాంటి సమయంలో ఇద్దరు పిల్లల నియంత్రణ తొలగించడం మంచిది కాదని, ఈ నిర్ణయాన్ని పునరాలోచన చేసుకోవాలని కోరారు.

# అర్హులైన ప్రతి పేదవారికీ ఇందిరమ్మ ఇండ్లు

గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, మరో విడతను ఏప్రిల్‌లో మంజూరు చేయనున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శాసనసభలో ఇందిరమ్మ ఇండ్ల అంశంపై శనివారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, పాల్వయి హరీశ్‌బాబు, రాకేష్ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానమిస్తూ పేదవాని ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల కాలంలో ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. తొలి విడతగా మంజూరు చేసిన 4.50 లక్షల ఇండ్లలో సుమారు 3లక్షల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, సుమారు 52 వేల ఇండ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించి అసంపూర్తిగా వదిలేసి, ఆర్థిక సాయం అందించని ఇండ్లకు తమ ప్రభుత్వం రూ.204 కోట్లను విడుదల చేశారని, రాష్ట్రంలోని 133 కాలనీల్లో 36వేల ఇండ్లు మొండిగోడలతో మిగిలిపోయాయని, మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని, ఇందుకు తమ ప్రభుత్వం రూ.744 కోట్లతో పౌర సదుపాయాలు కల్పించామని వివరించారు. కొన్ని రెండు పడగకల గదులను నిర్మించినప్పటికీ ఎవ్వరికీ కేటాయించలేదని, అసంపూర్తి ఇండ్ల కోసం రూ.455 కోట్లను మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వంలోని పెద్దమనిషి హామీ ఇచ్చి వదిలేసిన వాసాలమర్రిలో కూడా తామే ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. 2014లో రాష్ట్రంలో రూ.3లక్షల ఖర్చుతో ఇండ్లను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసి, నిధులు విడుదల చేయలేదని, దీంతో సుమారు 12 వేల ఇండ్లను పునాదుల స్థాయిలోనే వదిలేసిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజాప్రతినిధుల సూచనల అమలు తదితర అంశాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

**కూనంనేని ప్రస్తావించిన 'సింగరేణి'లో ఇండ్ల పట్టాల సమస్య పరిష్కారం**

సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రస్తావించిన సింగరేణి ప్రాంతంలో ఇండ్ల పట్టాల పెండింగ్ సమస్యను కూడా క్యాబినెట్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. జిహెచ్ఎంసి పరిధిలో గృహనిర్మాణానికి స్థలాలను గుర్తించి మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఇండ్ల సమస్యలపై ప్రజాప్రతినిధులతో సమావేశాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎల్1, ఎల్2, ఎల్3 వారీగా గుర్తిస్తామని, రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మందిని గుర్తించామని, గ్రామీణ ప్రాంతాల్లో సిద్ధంగా లభ్యమయ్యే స్థలాలను గుర్తిస్తే వాటిని నిరుపేదలకు ఇండ్ల స్థలాలుగా మంజూరు చేస్తామన్నారు.

**'సంక్రాంతి' తర్వాత ఫామ్ మెకనైజేషన్ ప్రారంభం: మంత్రి తుమ్మల**



రాష్ట్రంలో సంక్రాంతి పండగ తర్వాత ఫామ్ మెకనైజేషన్‌ను ప్రారంభించనున్నట్లు వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. ఇప్పటివరకు వివిధ రూపాల్లో వ్యవసాయ రంగానికి లక్ష రూపాయలను ఖర్చు పెట్టామన్నారు. గత ప్రభుత్వం రద్దయిన క్రాప్‌లోన్స్ తదతర పథకాలను తిరిగి పునరుద్ధరించామని తెలిపారు. శాసనసభలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ పైన జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పటోళ్ల సంజీవరెడ్డి, బాలునాయక్, లక్ష్మి కాంతా రావు, శంకరయ్య తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమాధానమిస్తూ రాష్ట్రంలో 3లక్షల మెట్రిక్ టన్నుల సోయాబిన్ ఉత్పత్తులను మొత్తం కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.

## నియోజకవర్గానికి 3500 ఇండ్ల మంజూరు హర్షణీయం

శాసన మండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల' పథకం అమలులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి, నిరుపేదలకు న్యాయం చేయాలని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో శనివారం ఈ అంశంపై ఆయన ప్రత్యేక ప్రస్తావన చేశారు. లబ్ధిదారుల ఎంపిక, నిధుల విడుదలపై పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఎంపిక ప్రక్రియలో విధిస్తున్న ఆంక్షలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎల్1, ఎల్2, ఎల్3 కేటగిరీల పేరుతో ఆటో లేదా ట్రాక్టర్ ఉన్న వారికి ఇండ్లు నిరాకరించడం సరైందికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోసం ట్రాక్టర్లు ఉండటం సాధారణమని, దానిని సాకుగా చూపి ఇండ్లు ఆపవద్దని ఆయన కోరారు. ఇల్లు 600 చదరపు అడుగులలోపే ఉండాలనే నిబంధనను తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పేదలు తమ వద్ద ఉన్న కొద్దిపాటి సొమ్మును అదనంగా వేసుకుని కాస్త పెద్ద ఇల్లు కట్టుకుందామనే ఆలోచనకు ఈ నిబంధన అడ్డంకిగా మారిందని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇల్లు నిర్మించుకుంటున్న నిరుపేదలకు సకాలంలో బిల్లులు అందడంలేదని నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసినా, జియో ట్యాగింగ్, ఫొటోల అప్‌లోడింగ్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల వల్ల నిధులు ఆగిపోతున్నాయని, దీనివల్ల లబ్ధిదారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పారదర్శకమైన ఎంపికే లక్ష్యం కావాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని ఆయన సూచించారు. కేవలం ఇందిరమ్మ కమిటీల ద్వారా కాకుండా, గ్రామ సభల ద్వారా పారదర్శకంగా అర్హులను గుర్తించాలని కోరారు. గత పదేళ్లుగా ఇండ్లు లేక వేలాది మంది పేదలు ఎదురుచూస్తున్నారని, ప్రస్తుతం నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇండ్లు ఏమాత్రం సరిపోవన్నారు. ప్రభుత్వం మరిన్ని ఇండ్లు మంజూరు చేయడంతో పాటు, చిన్న చిన్న సాంకేతిక అడ్డంకులను తొలగించి పథకాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని సత్యం కోరారు.

## చలో అసెంబ్లీకి బయల్దేరిన ఆటో డ్రైవర్ల అరెస్ట్

హామీలు అమలు చేయాలని నిరసనకారుల డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించింది. వందలాదిమంది ఆటో డ్రైవర్లు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ నుండి పెద్దఎత్తున నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు వెళ్తుండగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆటోడ్రైవర్ల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ ఆటో డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు బలవంతంగా ఆటో డ్రైవర్లను అరెస్ట్ చేసి, వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, జెఎసి నేతలు వేముల మారయ్య (బిఆర్‌టియు), ఎం.ఎ. సలీం (తెలంగాణ జాగృతి), ఇ.ప్రవీణ్ (టియుసిఐ), ఎ.సత్తి రెడ్డి (టిఎడిఎస్), పి.యాదగిరి (టిఎన్‌టియుసి), శివానందం (టిఎఎండియు), ఎండి.బాబా (సిఐటియు)లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమ లు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేయాలని, రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, హైదరాబాద్ నగరంలో అక్రమంగా తిరుగుతున్న ఒలా, ఉబెర్, రాపిడోలను నిషేధించి, వాటి స్థానాల్లో రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక యాప్‌ను తీసుకురావాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.అశోక్, సిహెచ్. జంగయ్య, ఎం.కృష్ణ, ఎం.నరసింహ, శ్రీనివాస్, శ్యామ్ లాల్, మల్లి కార్జున్ (ఎఐటియుసి), లింగం గౌడ్ (టియుసిఐ)లు పాల్గొన్నారు.

# విబి-జి రామ్ జి చట్టం రద్దుకు మండలి తీర్మానం

శాసనమండలిలో రెండు బిల్లుల ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విబి జి రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని శాసనమండలిలో తీర్మానం చేశారు. శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో విబి జిరామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, తెలంగాణ ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లులను రెండు బిల్లులపై సభ్యులు చర్చించి, ఆమోదం తెలిపారు. అయితే ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహా ప్రవేశపెట్టే సమయంలో బిఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి వచ్చి, యూరియాపై చర్చించాలని పట్టుబట్టారు. పెద్ద నినాదాలు చేశారు. బిఆర్ఎస్ సభ్యుల ఆందోళనల మధ్యనే మంత్రి బిల్లును సభలో ప్రవేశపెట్టడం, ఆమోదం పొందడం జరిగిపోయింది. మధ్యాహ్నం తరువాత సమావేశమైన సభలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో కొత్తగా తీసుకొచ్చిన విబి జి రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా మంత్రి దనసరి అనసుయ సీతక్క ప్రవేశపెట్టారు. విబి జి రామ్ జి చట్టాన్ని కాంగ్రెస్, సిపిఐ, ఎంఐఎం వ్యతిరేకించాయి. సభలో చర్చించిన అనంతరం బిల్లును ఆమోదించారు.

**కార్పొరేట్‌ల కోసమే విబి జి రామ్ జి చట్టం : మంత్రి సీతక్క**



బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కార్పొరేట్‌ల కోసమే విబి జి రామ్ జి బిల్లు తీసుకొచ్చారని మంత్రి సీతక్క అన్నారు. ఈ బిల్లు చీఫ్ లేబర్‌ను తయారు చేస్తుందన్నారు. ఫ్యూడల్ వ్యవస్థ మళ్లీ తీసుకొచ్చేందుకు బిల్లు ప్రవేశపెట్టారని విమర్శించారు. రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండా చట్టం చేయడం పెత్తనమే అవుతుందన్నారు. ప్రధాని మోదీ జన్మించిన గుజరాత్‌లోనే మహాత్మాగాంధీ పుట్టారని, గాంధీపై ఎందుకు అంత ద్వేషమని ప్రశ్నించారు. ఆయన పేరుతో ఉన్న పథకాన్ని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. అసెంబ్లీలో సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు కూడా చట్టాన్ని వ్యతిరేకించారని తెలిపారు. అడవులను కార్పొరేట్‌లకు అప్పగించి, విద్వేషయం సృష్టిస్తున్నారని, కార్పొరేట్‌లకు చీఫ్ లేబర్ అందించేందుకే ఈ చట్టం తెచ్చారని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

**ఉపాధి హామీ చట్టంలో మార్పులను వ్యతిరేకించిన సత్యం**

శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రాముఖ్యతను వివరించారు. యూపిఏ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీల మద్దతుతో ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మార్పులను తీవ్రంగా వ్యతిరేకించారు. ఉపాధి హామీ పథకంలో నిధుల వాటా విషయంలో కేంద్రం తీసుకొచ్చిన 60:40 నిష్పత్తి రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపుతోందని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ పథకానికి అవసరమైన నిధులను కేంద్రమే పూర్తిగా భరించేదని, ఇప్పుడు రాష్ట్రాలపై భారం వేయడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని వ్యాఖ్యానించారు. ఈ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా ఆయన స్ఫూర్తిని నీరుగార్చారని విమర్శించారు. గాంధీ పేరును తిరిగి పథకంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉపాధి హామీ చట్టం కింద 266 రకాల పనులు చేపట్టే అవకాశం ఉండేదని, కానీ కొత్త నిబంధనలతో భూముల అభివృద్ధి వంటి శ్రమ ఆధారిత పనులను తొలగించడం వల్ల దళితులు, గిరిజనులు, చిన్న సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల విరామం విధించాలనే నిబంధన భూమి లేని నిరుపేద కూలీలకు అన్యాయం చేస్తుందని, ఉపాధి హామీని ఏడాది పొడవునా కొనసాగించాలని ఆయన కోరారు. కరోనా కాలంలోనూ, కరువు సమయంలోనూ ఈ పథకం గ్రామీణ ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించి వలసలను నిరోధించిందని గుర్తు చేశారు. చివరగా, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఉపాధి హామీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, పాత చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మద్దతు తెలిపారు.

స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వికసిత్ భారత్ రోజగార్, ఆజీవిక మిషన్ (గ్రామీణ) చట్టం2025'పై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. 2005లో అప్పటి యూపిఎ ప్రభుత్వం అన్ని పార్టీలు, ప్రజలతో విస్తృతంగా చర్చించి మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. 2006 నుంచి పథకం అమలు జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో విబి జి రామ్ జి చట్టం బిక్షంగా మారే పరిస్థితులు నెలకొంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, నిరుద్యోగం, వలసలను తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు జీవనాధారం లభించిందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో సుమారు 90 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు చెందినవారే కాగా, మొత్తం కూలీల్లో 62 శాతం మహిళలే అని తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లలేని మహిళలకు గౌరవప్రదమైన ఉపాధి లభించడంతో పాటు ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. కోవిడ్ 19 మహమ్మారి సమయంలో లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన వలస కూలీలకు భరోసాగా నిలిచిందన్నారు.

**ఉపాధి హామీకి గాంధీ పేరు తొలగించడం హేయమైన చర్య: మహేష్ కుమార్ గౌడ్**



ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించడం హేయమైన చర్య అని ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీని, 12 సంవత్సరాలు జైలు జీవితం గడిపిన జవహర్‌లాల్ నెహ్రూను చరిత్ర నుంచి మరిపించే ప్రయత్నం కేంద్రం చేస్తోందన్నారు. తప్పుడు చరిత్రను రాయాలనే ఉద్దేశంతోనే ఉపాధి హామీ చట్టంలో మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశంలో వలసలను నివారించేందుకు అప్పటి ప్రధానమంత్రి, సోనియా గాంధీ తీసుకొచ్చిన గొప్ప చట్టమే ఉపాధి హామీ పథకం అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ చట్టం పేదలకు ఉపాధి హక్కును కల్పించి, కోట్లాది కుటుంబాలకు జీవనోపాధిని అందించిందన్నారు. గత 20 ఏళ్లుగా కోట్ల మందికి ఆకలి తీర్చిన చట్టం అన్నారు. ఇందులో 62 శాతం మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పేదలకు ఆపన్న హస్తంలా నిలిచిన ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఒక్క తెలంగాణలోనే గత ఏడాది 6 కోట్ల పనిదినాలు తగ్గించారని, ఇది పేదలపై కేంద్రం చేస్తున్న దాడిగా అభివర్ణించారు. పేదల పొట్ట కొట్టి కార్పొరేట్ శక్తులను పెంచి పోషించడమే బిజెపి విధానమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు మూడింతలు పెరిగాయని, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినా దేశంలో మాత్రం ఇంధన ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. ఇది చాలదన్నట్లుగా ఉపాధి హామీ నిధుల్లో రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం అన్యాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల ఒక్క తెలంగాణపైనే రూ.1800 కోట్ల అదనపు భారం పడుతుందని మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

**పేర్లతో మార్పు కాదు.. పేదల తలరాత మారాలి : తీన్మార్ మల్లన్న**



పేర్ల మార్పు కాదని, పథకాలతో పేదల తలరాత మారాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా, కేంద్ర ప్రభుత్వం 60:40 నిష్పత్తిలో పథకాన్ని అమలు చేయాలనే చట్టం తేవడం అన్యామన్నారు. ఈ పథకంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలే ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కేంద్రం తెచ్చిన చట్టంతో వారినెత్తిన ఇప్పుడు పిడుగు పడిందన్నారు. కేంద్రం వెంటనే ఈ చట్టాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

**ఉచిత విద్యుత్‌కు రూ.3,593 వేలకోట్లు**

రాష్ట్రంలో గృహజ్యోతి పథకంలో భాగంగా ఉచిత విద్యుత్ సరఫరా లబ్ధిదారుల తరపున ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3,593 వేలకోట్లను చెల్లించిందని డిప్యూటీ సిఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇందిరమ్మ గృహాలు పూర్తయిన తర్వాత అర్హులైనవారికి ఈ పథకం అమలు చేస్తామని, ఈ పథకాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. గృహ జ్యోతి ఉచిత విద్యుత్ సరఫరా పథకం అంశంపైన శాసనసభలో శనివారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు మదుసూదన్, దానం నాగేందర్, నాగరాజు, ఆది శ్రీనివాస్ కవంపల్లి సత్యనారాయణ అడిగిన ప్రశ్నలకు భట్టి విక్రమార్క సమాధానమిస్తూ గృహ జ్యోతి పథకం ద్వారా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 45,995 కుటుంబాలు, అచ్చంపేట నియోజకవర్గంలో 40,555 కుటుంబాలు, మాజీ సిఎం కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో 65,862, సిద్దిపేట నియోజకవర్గంలో 50,398 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని వివరించారు.

# గ్రామీణ వైద్య సేవల బలోపేతానికి ఆసుపత్రుల అనుసంధానం

మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఆసుపత్రుల అనుసంధాన ప్రక్రియను ప్రభుత్వం చేపడుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్ఎంపి, పిఎంపిపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్, మధుసుదనచారి, బండ ప్రకాష్‌లు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ పేదవారి ఆరోగ్య భద్రత ప్రభుత్వ బాధ్యతేనని ఆయన స్పష్టం చేశారు. వైద్య, ఆరోగ్య శాఖమంత్రిగా సేవలందించే అవకాశం రావడం తనకు వరంగా భావిస్తున్నానని మంత్రి దామోదర్ రాజనర్సింహ చెప్పారు. గతంలో ఆర్ఎంపి, పిఎంపిలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. అయితే, అనంతరం ఐఎంఎ తెలంగాణతో పాటు కొందరు డాక్టర్లు శిక్షణ అంశంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించడంతో ఈ విషయం న్యాయస్థానం పరిధిలోకి వెళ్లిందన్నారు. ప్రస్తుతం ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. జిల్లా కేంద్రాల్లో ఆస్పత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంటల వరకు వైద్యులు ఉంటారని, గ్రామీణ ప్రాంతాల్లో రెసిడెంట్ డాక్టర్‌లను నియమించాలన్నారు. ఈ విషయంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కంటి వెలుగు మంచి పథకమని అమలు చేయాలని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

**రాష్ట్రవ్యాప్తంగా 'ఐ కేర్ క్లినిక్స్' ఏర్పాటు :**

ప్రజలకు కంటి వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 'ఐ కేర్ క్లినిక్స్'ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి రాజనర్సింహ శాసనమండలిలో వెల్లడించారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ వంటేరి యాదవ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ప్రారంభించినట్లు చెప్పారు. వాటిలో క్యాన్సర్ స్క్రీనింగ్, డయాగ్నసిస్, కీమోథెరపీ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుత జీవనశైలి, స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో కంటి సమస్యలు అధికమవుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 'కంటి వెలుగు' తరహాలో తాత్కాలిక శిబిరాలకు పరిమితం కాకుండా, శాశ్వత ప్రాతిపదికన వైద్య సేవలు అందించేలా 'ఐ కేర్ క్లినిక్స్'ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కంటి వ్యాధుల తీవ్రతను అధ్యయనం చేయడంతో పాటు, సరైన చికిత్సా విధానాలను సిఫార్సు చేయడానికి ఇప్పటికే ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా ఐ కేర్ సెంటర్ల పనితీరు, విధి విధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**భక్తులు, పర్యాటకులకు అవసరమైన కనీస సౌకర్యాలు : మంత్రి జూపల్లి కృష్ణారావు**

వాడపల్లి ప్రాంతంలోని ఆధ్యాత్మిక, పర్యాటక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు, పర్యాటకులకు అవసరమైన కనీస సౌకర్యాల అభివృద్ధి కోసం ఫీజిబిలిటీ సర్వే ప్రతిపాదించబడిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. నల్లగొండ జిల్లాలోని వాడపల్లి కృష్ణా, మూసీ నదుల సంగమ క్షేత్రం ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా నిలిచిందన్నారు. కార్తీక మాసం సహా ఇతర పండుగల సందర్భంలో శ్రీ వీరనారాయణ స్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తారని తెలిపారు. ఇదే సందర్భంలో నాగార్జున సాగర్ సమీపంలోని బుద్ధవనం ప్రాజెక్ట్‌పై మంత్రి వివరించారు. స్వదేశీ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే విధంగా బుద్ధవనాన్ని ఆధ్యాత్మిక, విద్యా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. బుద్ధవనంలో డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర పర్యాటక శాఖ స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద రూ. 24.84 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయన్నారు. అదనంగా ప్రభుత్వ– ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో బౌద్ధ మఠం, ధ్యాన కేంద్రం, విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. నల్లగొండ జిల్లాలో పర్యాటక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, పుణ్యక్షేత్ర, వారసత్వ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



జనరల్
STATE & REGIONAL NEWS

## సంతకం పెట్టి రెండు నిమిషాల్లో వెళ్లిపోయారు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కృష్ణా జలాలపై దమ్మూ, ధైర్యం ఉంటే అసెంబ్లీలో సమావేశం పెట్టమన్న బిఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీలో సంతకం పెట్టి రెండు నిముషాల తరువాత వెళ్లిపోయారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవ చేశారు. తప్పులు, అవినీతి ఎక్కడ బయటపడుతాయో అని కెసిఆర్ జంకుతున్నారన్నారు. ప్రజలు అందరూ కెసిఆర్ చేతలతో ఆశ్చర్యపోతున్నారన్నారు. అసెంబ్లీలో మాట్లాడానికి సమయం ఇచ్చినా కావాలనే గొడవ చేసి హరీష్ రావు వాకౌట్ చేశారు. బిఆర్ఎస్ భవన్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పెడుతున్నారు? కాంగ్రెస్ అడిగే ప్రశ్నలకు, కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలేక బిఆర్ఎస్ నేతలు తోకముడిచి పారిపోయారన్నారు. అధికారంలో ఉంటేనే కెసిఆర్‌సభకు వస్తారా? అని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇండియన్ కరెన్సీపై ఉన్న మహాత్మా గాంధీ ఫోటో కూడా తొలగిస్తారేమో అని అనుమానాలు వ్యక్త పరిచారు. ఉపాధి హామీ పథకం పేరులో గాంధీ పేరును యధాతథంగా కొనసాగించాలని, గాంధీ కుటుంబపై విష ప్రచారం బిజెపి నేతలు మానుకోవాలని హితవుపలికారు.

# ప్రాజెక్టులపై నిపుణులతో చర్చించాలి

కాలపరిమితితో కూడిన సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

'కృష్ణ నది జలాల' అంశంపైన శాసన సభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో సిపిఐ శాసనసభా పక్షనేత కూనంనేని



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రాజెక్టల అంశంలో నిపుణులతో చర్చించి, కాల పరిమితితో కూడిన సమగ్రమైన ప్రణాళికను రూపొందించాలని, రానున్న మూడేళ్లలో ఎంత వరకు పూర్తి చేస్తారో స్పష్టం చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముందు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టలను, ఐడిసి చెరువులను ముందుగా పూర్తి చేయాలని, భారీ ప్రాజెక్టలను ప్రధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. 'కృష్ణ నది జలాల' అంశంపైన శాసన సభలో శనివారం జరిగిన స్వల్పకాలిక చర్చలో కూనంనేని సాంబశివ రావు మాట్లా దుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005 సంవత్సరంలో జలయజ్ఞంలో భాగంగా తెలంగాణ ప్రాంతంలో (ప్రస్తుత తెలంగాణ రాష్ట్రం) చేపట్టిన ప్రాజెక్టులు ఇప్పటి వరకు పూర్తి కాలేదని, వ్యవస్థలో లోపం ఉన్నదని, అందుకే ప్రాజెక్టలు పూర్తి కావడం లేదని చెప్పారు. నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ పాలకులకు శ్రద్ధ లేకపోవడంతోనే ప్రాజెక్టలు పూర్తి కాలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టలో 45 టిఎంసిలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంతకాలు పెట్టారని బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేపడుతోందని, గత ప్రభుత్వమే 299 టిఎంసిలపై సంతకాలు చేశారన్నారు. సుప్రీం కోర్ట్ తీర్పునకు విరుద్ధంగా ఆల్మాట్టి ఎత్తును పెంచారని విమర్శించారు. నాడు వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి పోతిరెడ్డిపాడును 44వేల క్యూసెక్కుల నీటిని పెంచితే పెద్ద ఎత్తున అలజడి జరిగిందని, అలాంటిది నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఎపి సిఎం జగన్‌మోహన్ రెడ్డి పోతిరెడ్డి పాడు 80వేల క్యూసెక్కులకు పెంచితే నాటి పాలకులు స్పందించలేదని అన్నారు. రాయలసీమ పేరుతో మూడుటిఎంసిల పేరుతో పనులు కూడా జరిగాయని, దీనిపైన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అప్రమత్తంగా ఉంటూ, దృష్టి పెట్టాలని సూచించారు. మిగులు నీళ్ల సముద్రంలోపోతుంటే వాటిని ఆంధ్రప్రదేశ్ తీసుకుంటే తప్పు ఏముందని చెబుతున్నారని, ఒక సారి ప్రాజెక్టలు నిర్మించిన తర్వాత ఎవరు ముందు కట్టుకుంటే వారికే కేటాయింపులు ఉంటాయి కదా అని అన్నారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్ట్ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వానిది తప్పులేదన్నారు. నీటి విషయంలో మరోసారి సెంటిమెంట్‌ను రగిలించి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ చాలెంజ్ చేసిన నేపథ్యంలో శాసనసభకు కెసిఆర్ వస్తే బాగుండేదని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని నిరూపించుకునే అవకాశాన్ని వారు కోల్పోయారని కూనంనేని అన్నారు. ప్రాజెక్ట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

### 'పాలమూరు-రంగారెడ్డి'కి కేంద్రం అనుమతులివ్వాలి

అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు 90 టిఎంసిల నీటికి అన్ని అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని, గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు బనకచర్ల లేదా ఇతర ఏ మార్గాల ద్వారనైనా తరలించేందుకు కేంద్రం ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదని చేసిన తీర్మానాన్ని శాసనసభ శనివారం ఆమోదించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తెలంగాణ రైతాంగం, రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర అనుమతులు అత్యవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది. చర్చ అనంతరం సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు.



అభ్యుదయ సాహిత్య ప్రచురణ, ముద్రణ, పంపిణీలో ప్రముఖ పాత్ర వహిస్తున్న 'నవచేతన విజ్ఞాన సమితి' 11 సంవత్సరాల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకొని 12వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న, ప్రజాపక్షం దినపత్రిక తరపున ఎడిటర్ మక్కెన సుబ్బారావు శుభాకాంక్షలు తెలియజేశారు. పుస్తక పఠనం తగ్గుతున్న ఈ సంధి కాలంలో ఆటుపోట్లను తట్టుకుంటూ ఆశయాలకు నిబద్ధమైన కృషి సాగించడం కష్టతరమైన పనిగా పేర్కొన్నారు. అంకితభావం గల సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నవచేతన విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ ఎస్. మధుకర్, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, ప్రజాపక్షం జనరల్ మేనేజర్ (యాడ్స్) వి.మదన్, నవ చేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి.నారాయణ రెడ్డి, నవచేతన ప్రింటింగ్ ప్రెస్, ప్రజాపక్షం సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమలను విస్తరిస్తాం

శాసనమమండలిలో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐటి పరిశ్రమలను హైదరాబాద్ కేంద్రంగానే కాకుండా జిల్లా కేంద్రాల్లోనూ విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో బిజెపి ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్. రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అడిగిన మలక్‌పేట ఐటి టవర్ ప్రాజెక్టు ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యమున్న విద్యార్థులున్నారని, అందరూ ఉద్యోగాల కోసం హైదరాబాద్ నగరానికి రాకుండా అక్కడే ఉద్యోగాలు చేసుకునేలా పరిశ్రమలను విస్తరిస్తామన్నారు. ఐటి టవర్ ప్రాజెక్టు మళ్లీ టెండర్లు పిలిచే ప్రక్రియను మొదలుపెట్టామని చెప్పారు. నల్లగొండ, ఆదిలాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ఐటి కంపెనీలు వచ్చి మళ్లీ హైదరాబాద్‌కు తరలిపోతున్నాయని, ఇందుకు అక్కడ పనిచేసే ఉద్యోగులు ఎక్కువ జీతం కోసం ఉద్యోగాలు మాని వేరే కంపెనీల్లో చేరుతున్నారని, కంపెనీలు కూడా ముందుకురావడం లేదన్నారు. ఐటి రంగాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేలా మౌలిక వసతులు, అనుమతులు, ప్రోత్సహాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సభకు వివరించారు.

## 15 నిమిషాల సమయం కూడా ఇవ్వలేదు: బిజెపి ఎంఎల్ఎ ఏలేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి మాట్లాడే ముందు తమకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అందుకే సభ నుంచి వాక్‌ఔట్ చేశామని బిజెపి శాసన సభా పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ తరపున 25 ఎంఎల్ఎలు మాట్లాడారు.. బిజెపి నుండి ఓకే సభ్యునికి అది కూడా 15 నిమిషాలు కూడా సమయం ఇవ్వకపోవడం దురదృష్టకరం అని తెలిపారు. బిజెపి నుండి ఇద్దరికీ అవకాశం ఇస్తామని ఇవ్వలేదన్నారు. బిఆర్ఎస్ ఎలాగో లేనే లేదు.. ప్రతిపక్షంగా మాకు అవకాశం ఇవ్వచ్చు కదా..? అని ప్రశ్నించారు. ఎంఐఎం, సిపిఐతో డబ్బా కొట్టించుకున్నారన్నారు. బిజె పికి మాత్రం అవకాశం ఇవ్వలేదు ఇందుకు నిరసనగా మేము సభ నుండి వాక్ ఔట్ చేస్తున్నాం అని తెలిపారు.

## వాకౌట్ చేయడం దుర్మార్గం:


ఎంఎల్ఎ, విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతిపక్ష నాయకులు తప్పులు బయటపడతాయని వాకౌట్ చేయడం దుర్మార్గంమైన చర్య అని ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. రాష్ట్ర సంపదను బిఆర్ఎస్ నేతలు దోచుకొని తోకముడుచుకొని పారిపోయారని ఎద్దేవ చేశారు. మాట్లాడడానికిడిని సమయం ఇవ్వాలి బిఎసి సమావేశంలో అని అడిగి బిఆర్ఎస్ నేతలు తమ తప్పులు బయటపడతాయని వాకౌట్ చేశారన్నారు. మూసి పునర్జీవనం చేద్దామని మంచి నిర్ణయం తీసుకుంటే బిఆర్ఎస్ చర్చకు రాకుండా పారిపోయిందన్నారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చి, నిధులకు తూట్లు పొడుస్తుంటే కేంద్రంతో ఉన్న దోస్తానాతో బిఆర్ఎస్ చర్చలో పాల్గొనలేదని విమర్శించారు. కెసిఆర్ ఫాం హౌస్‌కు పరిమితం అయ్యారు. ఆరు అడుగుల ఆజానుబాహుడు వాకౌట్ చేస్తున్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం కేంద్రం చేస్తున్నదని దుయ్యబట్టారు. కేంద్రం చేస్తున్న నష్టం బిఆర్ఎస్ పార్టీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. దమ్మూ ధైర్యం ఉంటే అసెంబ్లీలో కృష్ణా జలాలపై, పాలమూరు రంగారెడ్డిపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ పథకం నుండి గాంధీ పేరును తొలగించడం అన్యాయం

టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి గాంధీజీ పేరును తొలగించడం అన్యాయం అని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్, ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో శనివారం జరిగిన గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ధర్నాలో ఐఎన్‌యుసి జాతీయ అధ్యక్షులు డా.జి.సంజీవ రెడ్డి, ముఖ్య ఉపాధ్యక్షులు, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వై. నాగన్న గౌడ్, భాస్కర్ రెడ్డి, అదిల్ షరీఫ్, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ నేతలు సిద్ది రాజు, బి.రవి, చల్ల వెంకటేశ్వరులు తదితరులు పాల్గొనగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్ర శేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రూపకర్త అయిన మహాత్మా గాంధీ పేరును తొలగించడం రాజ్యాంగ విలువలకు, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ కార్మికులు, రైతులు, పేదల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల హక్కులు, ఉపాధి భద్రత కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విబిజి రామ్ జి చట్టాన్ని రద్దు చేసేవరకు దేశవ్యాప్తంగా ఐఎన్‌టియుసి పోరాడుతుందని తెలిపారు.

## వెనిజులాపై అమెరికా దాడుల పట్ల సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ ఖండన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ అమెరికా వెనిజులా దేశ సార్వభౌమాధికార నియమాలను ఘోరంగా ఉల్లంఘిస్తూ వైమానిక దురాక్రమణ దాడులకు పాల్పడి దేశ అధ్యక్షుడు నికోలాస్ మధురోతో పాటు ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అత్యంత దుర్మార్గ, చట్టవిరుద్ధ పద్ధతుల్లో అరెస్టు చేయదాన్ని సిపిఐ(ఎంఎల్ )న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆ దేశ ప్రజలచే ప్రజాస్వామ్యంగా ఎన్నికైన దేశాధ్యక్షుడిపై, ఆయన కుటుంబంపై ఇలాంటి బెదిరింపులు, అరెస్టులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు, మానవ హక్కులకు, ఐక్య రాజ్య సమితి నియమ, నిబంధనలకు దేశాల సార్వభౌమత్వాలను ఉల్లంగించడమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం ఒక ప్రకటనలో తెలిపారు.

## అసెంబ్లీ వద్ద కొరాట చెనాక ప్రాజెక్ట్ నిర్వాసితుల ఆందోళన

వారిని అరెస్టు చేయడం దారుణం

బిజెపి ఎంఎల్ఎ పాయల్ శంకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎంను కలిసేందుకు అదిలాబాద్ నుంచి నడుకుంటూ వచ్చిన 'కొరాట చెనాక ప్రాజెక్ట్' నిర్వాసితులను పోలీసులు అరెస్టు చేయడం సమంజసం కాదని బిజెపి ఎంఎల్ఎ పాయల్ శంకర్ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకునేందుకు ఛలో అసెంబ్లీ కార్యాక్రమాన్ని రైతులు, నిర్వాసితులు చేపట్టారు. వీరంతా బషీర్‌బాగ్ నుంచి అసెంబ్లీ వద్దకు ర్యాలీగా వస్తుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. వీరికి పాయల్ శంకర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కొరాటచెనాక ప్రాజెక్ట్ 2015 మొదలుపెట్టారన్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం రైతులు 1200 ఎకరాలు ఇచ్చారని, ఇందులో కేవలం 200 ఎకరాలకు మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని మిగతా 1000 ఎకరాల రైతులకు చెల్లించలేదని అన్నారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పుకునేందుకు వచ్చిన రైతులు, నిర్వాసితులను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి కాంట్రాక్టర్లకు చెందిన కోట్లాది రూపయాల బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం నిర్వాసితులకు మాత్రం మొండి చేయి చూపిందని విమర్శించారు. వడ్డీతో సహా రైతులు, నిర్వాసితులకు వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన రైతులను స్వంతపూచీకత్తుపై పోలీసులు సాయంత్రం విడుదల చేశారు.

## మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే అనేక పోరాటాలు

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే అప్పటి సామాజిక ప్రతిబంధకాలను అధిగమించి అనేక పోరాటాలు చేశారని, మహిళలకు విద్యను అందించాలని బడులు నిర్వహించారని, అలాగే వారి భర్త జ్యోతిబాపూలే తోడుగా అనేక పోరాటాలు చేశారని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ గుర్తు చేశారు. రాష్ట్ర బిసి కమిషన్ కార్యాలయంలో శనివారం రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే 194వ జయంతిని ఘనంగా జరిపారు. బిసి కమిషన్ సభ్యురాలు రంగు బాల లక్ష్మి మాట్లాడుతూ మహిళలను ఉన్నత స్థాయిలో నిలవడానికి కారణం సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ మనోహర్, స్పెషల్ ఆఫీసర్ సునీత, సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## విద్యుత్ బకాయిలు చెల్లించాల్సిందే

సంఘీ పాలిమర్స్‌కు హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంఘీ పాలిమర్స్ విద్యుత్ బకాయి (వడ్డీతో కలిపి) రూ.4.21 కోట్లను చెల్లించాలని హైకోర్టు తీర్పు చెప్పింది. విద్యుత్ బకాయిల నిమిత్తం సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ ఎస్పీడీసీఎల్) ఇచ్చిన డిమాండ్ నోటీసును సమర్థించింది. రూ.4.21 కోట్ల(వడ్డీతో కలిపి) విద్యుత్ చార్జీల చెల్లింపు డిమాండ్ నోటీసులను సంఘీ పాలిమర్స్ అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి గతంలో వెలువరించిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. సంఘీ పాలిమర్స్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. విద్యుత్, నీరు లాంటివి పారిశ్రామిక కార్యకలాపాలకు, దైనందిన జీవితానికి అవసరమైన కీలకమైన, పరిమిత వనరులు అని పేర్కొంది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలో ప్రజా పెట్టుబడి, మౌలిక సదుపాయాలు ఉంటాయని గుర్తు చేసింది. 2002–03 నుంచి 2008–09 వరకు గ్రిడ్ సపోర్ట్ చార్జీలు(జీఎస్సీ), దానిపై సర్చార్జి రూపంలో వడ్డీ విధిస్తూ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ ఎస్పీడీసీఎల్) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు టీఎస్ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్(రెవెన్యూ) లేఖ రాయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో సంఘీ పాలిమర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. 2020 నాటి ఒప్పందంలో పిటిషనర్ చార్జీల చెల్లింపునకు అంగీకరించారన్నారు. ప్రస్తుత డిమాండ్ నోటీసులలో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి ఆధారం కనిపించడం లేదంటూ పిటిషన్ను కొట్టివేశారు. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ సంఘీ పాలీమర్స్ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రధాన కంపెనీ సంఘీ పాలిస్టర్స్ లిక్విడేషన్‌లో ఉందని, ఆ బకాయిలు కూడా పాలిస్టర్స్ కంపెనీవేనని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్దేశాయ్ వాదించారు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తూ సంఘీ పాలిమర్స్‌తోపాటు 16 కంపెనీలపై ప్రతికూల ప్రభావం ఉంటుందన్నారు. సంఘీ ఆలయం, అక్కడే ఉన్న వెయ్యి కుటుంబాలకు సమస్యలు వస్తాయన్నారు. టీజీఎస్పీడీసీఎల్ తరపు న్యాయవాది ఎగ్ శ్రీధర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, 2020లో జరిగిన ఒప్పందం ప్రకారం బకాయిలు సంఘీ పాలిమర్స్ చెల్లించాలని చెప్పారు. వాదనల తర్వాత సంఘీ అప్పీల్‌ను బెంచ్ కొట్టివేసింది.

## మానిటరీ రిలీఫ్‌లో చారిత్రాత్మక మలుపు

1080 మంది బాధితులకు రూ.1003.42 కోట్ల ఆర్థిక భరోసా: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మానిటరీ రిలీఫ్ అంశాన్ని, సామాజిక న్యాయానికి కేంద్రబిందువుగా మార్చిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బాధితులకు సమయానుకూలంగా పరిహారం అందించడమే లక్ష్యంగా పారదర్శకమైన, బాధ్యతాయుతమైన విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. 2025–26, డిసెంబర్ 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1080మంది బాధితులకు రూ.1003.42కోట్లను మంజారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మానిటరీ రిలీఫ్ ఆలస్యం కారణంగా బాధితులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాల మేరకు ప్రతి కేసును టైమ్‌బౌండ్‌గా పరిష్కరించామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్‌సి సంక్షేమం మాటల్లో కాదు.. గణాంకాల్లో కనిపిస్తోందని అని వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం, బాధ్యతాయుత పాలన అనే మౌలిక సూత్రాలతో ముందుకు సాగుతోందన్నారు. ఇకపై అర్హుడైన ప్రతి బాధితుడు మిస్ కాకుండా మానిటరీ రిలీఫ్ పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

**కులాంతర వివాహాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ**

తెలంగాణ రాష్ట్రంలో కుల వ్యవస్థ మూలంగా ఏర్పడిన సామాజిక విభేదాలను తొలగించడమే లక్ష్యంగా, కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం 202526 ఆర్థిక సంవత్సరంలో ప్రోత్సాహక పథకం కింద రూ.2680 లక్షలు కేటాయించగా, రూ.2485.09 లక్షలు ఖర్చు చేయడం ద్వారా 93 శాతం నిధుల వినియోగం సాధించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 994 మంది దంపతులు ప్రత్యక్షంగా లబ్ధి పొందారని వెల్లడించారు. సమానత్వమే లక్ష్యంగా రాబోయే కాలంలో కులాంతర వివాహాల పథకాన్ని మరింత విస్తృతం చేయడం, నిధుల పెంపు, ప్రక్రియ సరళీకరణ, యువతలో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కులరహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## భారతీయ ఆహారంలో చిరుధాన్యాలు కీలక భాగం


హరేకృష్ణ ఫౌండేషన్ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస ప్రభుజీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిరుధాన్యాలు భారతీయ సంప్రదాయ ఆహార సంస్కృతిలో కీలక భాగమే కాకుండా, ఆరోగ్యం, స్థిరత్వం, ఆహార భద్రత వంటి నేటి సవాళ్లను ఎదుర్కోవడానికి అత్యంత అవసరమని హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, అక్షయపాత్ర ఫౌండేషన్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ప్రాంతీయ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస ప్రభుజీ తెలిపారు. పోషకాల భద్రతను బలోపేతం చేయడం, స్థిరమైన ఆహార వ్యవస్థలను ప్రోత్సహించడమే లక్ష్యంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ( హెచ్‌కెఎంసిఎఫ్), (ఐసిఎఆర్) భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆహార సేవలు, సంక్షేమ కార్యక్రమాల్లో హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ఉన్న విశేష అనుభవం, చిరుధాన్యాల పరిశోధన, పోషకాహారం, విలువ జోడింపులో ఐఐఎంఆర్‌కు ఉన్న నైపుణ్యం కలిసి వచ్చి ఆరోగ్యకరమైన, స్థిరమైన ఆహార అలవాట్లకు మార్గం సుగమం చేయనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం (హెచ్‌కెఎంసిఎఫ్) తెలంగాణలో 'ఇందిరమ్మ క్యాంటీన్లు', 'భోజనామృత', ఆంధ్రప్రదేశ్‌లో 'అన్న కాంటీన్లు' వంటి రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్రజా భోజన పథకాల అమలులో భాగస్వామిగా ఉందని, ఈ కార్యక్రమాల ద్వారా ప్రతిరోజూ సుమారు 2.5 లక్షల మందికి భోజనం అందిస్తోందని వెల్లడించారు.


## బిసిలకు రక్షణ చట్టం తేవాలి

బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా బిసిలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో వారికోసం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం తరహాలో బిసిల రక్షణ చట్టం రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో బిసిలున్నప్పటికీ దాడులు, వివక్ష కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా సంచారజాతులకు చెందిన బిసి కులాలు తీవ్ర వెనుకబాటుతో, రక్షణ లేకుండా బాధపడుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవలి కులగణన సర్వే, వెనుకబడిన తరగతుల కమిషన్ పబ్లిక్ హియరింగ్‌లో బిసిలు ఈ రక్షణ చట్టాన్ని గట్టిగా కోరారని గుర్తుచేశారు. బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించి, స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రానున్న మున్సిపల్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, లేనిపక్షంలో తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బిసి నేతలు పగిళ్ల సతీశ్, రాందేవ్ మోదీ, గంగాపురం పద్మ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బిలాల్ మల్లాకు జ్యుడీషియల్ కస్టడీ

**న్యూఢిల్లీ:**ఎర్రకోట పేలుడు కేసులో నిందితుడు డాక్టర్ బిలాల్ నసీర్ మల్లాకు జనవరి 16 వరకు 13 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు ఢిల్లీ కోర్టు శనివారం తెలిపింది. డిసెంబర్ 26న మంజూరు చేసిన 8 రోజుల ఎన్ఐఎ కస్టడీ ముగిసినందున, (ఎన్ఐఎ) శనివారం మల్లాను కఠినమైన భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచింది. మీడియా ప్రతినిధులను విచారణకు అనుమతించలేదు. నిందితుడిని ప్రిన్సిపల్ జిల్లా , సెషన్స్ జడ్జి అంజు బజాజ్ చంద్నా ముందు హాజరుపరిచారు, ఆయన మల్లాను జనవరి 16 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. డిసెంబర్ 9న ఎన్ఐఎ ఢిల్లీలో మల్లాను అరెస్టు చేసి, కుట్రలో కీలక నిందితుడిగా పేర్కొంది. ఎన్ఐఎ దర్యాప్తు ప్రకారం, నవంబర్ 10న ఎర్రకోట వెలుపల పేలి 15 మంది మృతి చెందిన పేలుడు పదార్థాలతో నిండిన i20 కారును నడుపుతున్న ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ ఉన్‌నబికి మల్లా తెలిసి లాజిస్టికల్ మద్దతు అందించాడు. మల్లా ఉగ్రవాద దాడికి సంబంధించిన ఆధారాలను నాశనం చేసాడని కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు డిసెంబర్ 9న ఏజెన్సీ తెలిపింది.

## 'విబి– జి రామ్ జి'ని రద్దు చేయండి

- ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకాన్ని తిరిగి తీసుకురావాలి
- కేంద్రానికి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య డిమాండ్



**బెంగళూరు:** పేదలు, బలహీన వర్గాలు, మహిళలు, చిన్న రైతులకు పని హక్కును కల్పించిన యుపిఎ హయాంలోని ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకాన్ని తి రిగి తీసుకురావాలని, కొత్త 'విబి– జి రామ్ జి' చ ట్టాన్ని రద్దు చేయాలని కర్నాటక ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఈ కొత్త చట్టం జీవనోపాధి హక్కును, పంచాయతీల అధికారాలను హరించివేస్తుందని, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థపై అదనపు భారాన్ని మోపుతుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. శనివారం ఆయన బెంగళూరు లో విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 'విబి– జి రామ్ జి' చట్టాన్ని ఆమోదించిందని, ఇది సమాజంలోని పేద, బలహీన వర్గాలకు, మహిళలకు, చిన్న రైతులకు వారి గ్రామంలోనే పనిని డిమా ండ్ చేసే హక్కును కల్పించిన ఎంజిఎన్ఆర్ఇజిఎను హరించివేసిందని మండిపడ్డారు. ఇప్పుడు కొత్త 'విబి– జి రామ్ జి' చట్టంలో ఏ గ్రామ పంచాయతీలో పని చేపట్టాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుందని సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను ఏకకాలంలో చేపడతాయని సిద్ధరామయ్య చెప్పారు మరియు 'ఈ విషయంలో మేము వెంటనే ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తాము' అని నొక్కి చెప్పారు. వ్యవసాయ చట్టాల విషయంలో చేసినట్లే, 'విబి– జి రామ్ జి' చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజలతో, కార్మికులతో, భావసారూప్యత గల వారందరితో కలిసి పోరాడుతుంది' అని ఆయన అన్నారు. కొత్త చట్టం ప్రభావం గురించి మాట్లాడుతూ 'మోదీ ప్రభుత్వం 'విబి– జి రామ్ జి' చట్టం సమాజంలోని బలహీన వర్గాల, ముఖ్యంగా మహిళలు, పేదలు, చిన్న రైతుల జీవనోపాధి హక్కును హరించివేసిందని, ఇది పంచాయతీల అధికారాలను లాగేసుకుందని, ఎటువంటి సంప్రదింపులు లేకుండా రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారాన్ని కూడా మోపిందని, ప్రజలను కూడా సంప్రదించలేదని ఆయన మండిపడ్డారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) ('విబి– జి రామ్ జి') చట్టాన్ని రద్దు చేసి, యుపిఎ హయాంలోని ఎంజిఎన్ఆర్ఇజిఎను తిరిగి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. 'ప్రజల పని హక్కును పునరుద్ధరించాలని, స్వీయపరిపాలన కోసం పంచాయతీల హక్కులను పునరుద్ధరించాలని కూడా తాము కోరుతున్నాము' అని అన్నారు.

## భారీ ఎన్‌కౌంటర్

- బీజాపూర్ జిల్లాల్లో ఎదురు కాల్పులు
- 14 మంది మావోయిస్టులు మృతి
- కాల్పుల్లో మరణించిన మోస్ట్ వాంటెడ్ నక్సల్స్ అయిన మంగ్టు (డివిసిఎం), హుంగా మడ్కమ్ సుక్మా,
- ఘటనాస్థలిలో పలు ఆయుధాలు స్వాధీనం

**సుక్మా/బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తూపాల మోత మోగింది. బస్తర్ రీజియన్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల్లో నక్సల్స్, భద్రతా బలగాలకు మధ్య శనివారం వేర్వేరుగా భీకర ఎదురు కాల్పులు జరిగాయి. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 14 మంది మావోయిస్టులు మృత్యువాతపడ్డారు. మృతుల్లో మోస్ట్ వాంటెడ్ నక్సల్స్ అయిన మంగ్టు (డివిసిఎం), హుంగా మడ్కమ్‌లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సుక్మాలో జరిగిన ఎదురు కాల్పుల్లో మంగ్టు (డివిసిఎం)తో సహా 12 మంది నక్సలైట్లను భద్రతా బలగాలు మట్టుబెట్టగా, బిజాపూర్ బసగూడలోని గగన్‌పల్లి గ్రామ అడవుల్లో హుంగా మడ్కమ్‌తో సహా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయని కేంద్ర హోం మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారులు తెలిపారు. బిజాపూర్‌లో, ఇద్దరు నక్సలైట్ల మృతదేహాలతో పాటు ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఒక 12బోర్ రైఫిల్‌ను బలగాలు స్వాధీనం చేసుకున్నాయని వారు చెప్పారు. భద్రతా సిబ్బంది బృందం నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపడుతుండగా, సుక్మా జిల్లా దక్షిణ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. బిజాపూర్‌లో రాష్ట్ర పోలీసుల యూనిట్ అయిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ బృందం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఇలాంటి ఆపరేషన్ చేపడుతుండగా, జిల్లా దక్షిణ ప్రాంతంలోని అడవిలో కాల్పులు జరిగాయని మరో అధికారి తెలిపారు. కాల్పులు కొనసాగుతున్నాయని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఆ అధికారి చెప్పారు.



గతేడాది ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలతో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 285 మంది నక్సలైట్లు హతమయ్యారు. బస్తర్ డివిజన్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాలు మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాలలో ఒకటిగా కొనసాగుతున్నాయి. గతంలో దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాదానికి కేంద్రాలుగా పరిగణించబడ్డాయి. 2025 సంవత్సరంలో సుమారు 1,650 మంది లొంగిపోయి ప్రధాన స్రవంతిలో చేరారు. 2026 మార్చి 31 నాటికి భారతదేశం మావోయిస్టు హింస నుండి విముక్తి పొందుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో ప్రకటించారు.

## జల్లికట్టుతో సీజన్ ప్రారంభం

**పుదుక్కోట్టై (తమిళనాడు) :** ఈ జిల్లాలోని తచ్చం కురిచి గ్రామంలో శనివారం రాష్ట్రంలో ఈ ఏడాది తొలి జల్లికట్టు కార్యక్రమంలో 900కు పైగా ఎద్దులు, దాదాపు 300 మంది ఎద్దులను లొంగదీసుకునే క్రీడాకారులు పాల్గొన్నారు. పొంగల్ పండుగలో భాగంగా తమిళనాడులో జల్లికట్టు అనే ఎద్దులను లొంగదీసుకునే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తిరుచిరాపల్లి, దిండిగల్, శివగంగతో సహా సమీప జిల్లాల నుండి వచ్చిన అనేక ఎద్దులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. మంత్రులు ఎస్ రఘుపతి, శివ వి మెయ్యనాథన్, జిల్లా కలెక్టర్ ఎం అరుణ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విజయవంతమైన ఎద్దుల వీరులకు, ఎద్దుల యజమానులకు మోటార్ సైకిళ్లు, సైకిళ్లు, సాంప్రదాయ వంట, నిల్వ పాత్రలు బహుమతులుగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ 'పునిత విన్నెర్పూ అన్నై ఆలయ తిరువిళా' బ్యానర్‌పై ఈ కార్యక్రమం జరుగుతోంది. ఇందులో యూనిఫాం ధరించిన 300 మంది ఎద్దుల వీరులు క్రీడా మైదానంలోకి వడివాసల్ (ప్రవేశ ద్వారాల) నుండి దూసుకొచ్చే ఎద్దులను లొంగదీసుకోవడానికి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక ఎద్దుల వీరుడు జంతువు మూపురాన్ని ఎంతసేపు పట్టుకోగలిగాడనే దానిపై విజేతగా ప్రకటిస్తారు.

## అత్యంత అవసరమైన సమాజాల వైపు...
## న్యాయ చాపాన్ని వంచాలి

- సిజెఐ సూర్యకాంత్ ఉద్బోధ

**పాట్నా:** న్యాయవ్యవస్థలోని 'సానుభూతి' 'న్యాయమైన సమాజాన్ని అన్యాయమైన సమాజం' నుండి వేరుచేస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నొక్కిచెప్పారు. న్యాయం చాపాన్ని 'అత్యంత అవసరమైన సమాజాలవైపు వంచాల్సిన అవసరం' ఎంతైనా ఉందన్నారు. శనివారం ఇక్కడి చాణక్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో సిజెఐ సూర్యకాంత్ ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. యువ న్యాయవాదులు తమ కెరీర్‌ను కొనసాగించడంలో 'తీవ్రత' సూక్ష్మమైన సున్నితత్వాలను తొలగించడానికి దారితీయకూడదని అన్నారు. 'చాలామంది న్యాయవాదులు విజయం సాధించడానికి పనికి, మార్గదర్శకాలకు, అంచనాలకు పూర్తిగా లొంగిపోవాలని నమ్ముతారు. అదే సమయంలో కొంతకాలానికి తీవ్రత అనివార్యం, కానీ అది తుడిచిపెట్టబడకూడదు. చట్టం మీ జీవితంలోని ప్రతి మూలనూ ఆక్రమించినట్లయితే మీరు న్యాయానికి అవసరమైన సానుభూతి, తీర్పును కోల్పోయే ప్రమాదం ఉంది' అని సిజెఐ సూర్యకాంత్ హెచ్చరించారు. మన న్యాయ వ్యవస్థలోని ఈ సానుభూతియే న్యాయమైన సమాజాన్ని అన్యాయమైన సమాజం నుండి వేరు చేస్తుందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ విశ్వవిద్యాలయం నుండి మీరు బయటకు వెళ్లేటప్పుడు చట్టాన్ని భరించగల వారికోసమే కాదు దాని అవసరం ఉన్న ఎవరికోసమైనా గుర్తుంచుకోండి ఉద్బోధించారు. మీ నైపుణ్యాలను ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించడం మీ గంభీరమైన విధి. మీరు చట్టాన్ని నేర్చుకున్నారా? లేదా? అనేది తరచుగా ఉత్పన్నమయ్యేది ప్రశ్నకాదు. దానిని తిరిగి రూపొందించడానికి , దానిని వంచడానికి, న్యాయం అనే చాపాన్ని వంచడానికి కూడా మీరు సిద్ధంగా ఉన్నారా? అనేది కీలక ప్రశ్న'. మీరు వ్యాజ్యం లేదా ప్రజాసేవ, విద్యా రంగం, న్యాయసేవల లేదా మరే ఇతర మార్గాన్ని ఎంచుకున్నాచట్టం తన చట్టబద్ధతను అది రక్షించే వ్యక్తులనుండి తీసుకుంటుందనే ఎప్పుడూ మర్చిపోకండి. వినబడలేని, స్వరంలేని వారికి స్వరం ఇవ్వడానికి మీరు మీ నైపుణ్యాన్ని ఉపయోగించినప్పుడు, నిర్లక్ష్యం చేయబడినవారికి గౌరవాన్ని ఇచ్చినప్పుడు , మీరు మీ సొంత విద్యను మాత్రమే కాకుండా దానికి ఆధారమైన రాజ్యాంగ వాగ్దానాన్ని గౌరవించాలి' అని సిజెఐ సూర్యకాంత్ చెప్పారు. ఈ సందర్భంగా బిహార్ గొప్ప చరిత్రకు ఆయన నివాళులు అర్పిస్తూ తర్కం, న్యాయశాస్త్రానికి సంబంధించిన గొప్ప ఆలోచనాపరుల జన్మస్థలమైన ఈ భూమి నీతి, హేతువు, న్యాయం కలిసే స్థానాన్ని కలిగి ఉందన్నారు. పాట్నా హైకోర్టు ప్రాంగణంలో ఏడు మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేసిన కొన్ని గంటల తర్వాత జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగించిన భారత ప్రధాన న్యాయమూర్తి తన రెండు రోజుల బిహార్ రాజధాని పర్యటనను ముగించారు. వార్షిక రహస్య నివేదికలను ఆన్‌లైన్‌లో దాఖలుచేసే, ప్రాసెస్ చేసే ప్రక్రియను ఆధునికీకరించడానికి రూపొందించబడిన ఇఎసిఆర్ న్యాయ అనే ఒక కొత్త అప్లికేషన్‌ను ఈ సందర్భంగా సిజెఐ సార్యకాంత్ ప్రారంభించారు.



## స్కూల్స్‌లో న్యూస్ పేపర్ తప్పనిసరి

రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం..

**జైపూర్ :** రాజస్థాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అన్ని ప్రభుత్వ పాఠశాల్లలో రోజూ వార్తా పత్రిక చదవడం తప్పనిసరి చేసింది. ప్రభుత్వ సెకండరీ పాఠశాలలు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు కనీసం రెండు వార్తాపత్రికలు తీసుకోవాలని తెలిపింది. అందులో ఒక హిందీ, ఒక ఇంగ్లీష్ పేపర్ల తప్పనిసరిగా సభ్యత్వం ఉండాలని తెలిపింది. విద్యార్థులలో పఠన అలవాట్లను ప్రోత్సహించడానికి, పదజాలాన్ని మెరుగుపరచడానికి, సాధారణ అంశాలపై అవగాహనను పెంపొందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాజస్థాన్ విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం.. విద్యార్థులు ఉదయం అసెంబ్లీలో కనీసం 10 నిమిషాలు వార్తాపత్రికలు చదవాలి. ఈ అలవాటు విద్యార్థులకు సమాజంలో జరిగే ప్రస్తుత వ్యవహారాలను పరిచయం చేయడం, అలానే వార్తలను అర్థం చేసుకునే, వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుంది. రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ఆదేశం ప్రకారం ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాలలు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు కనీసం రెండు వా ర్తాపత్రికలను, అందులోనూ ఒక హిందీ, ఒక ఇంగ్లీష్ పేపర్‌ను తీసుకోవాలని ఆదేశించింది. అలానే ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలు కనీసం రెండు హిందీ వార్తాపత్రికలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపింది. న్యూస్ పేపర్ల కొనుగోలు ఖర్చును రాజస్థాన్ స్కూల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ భరిస్తుంది. పాఠశాల అసెంబ్లీ సమయంలో, ఆంగ్లంలో ఒక జాతీయ స్థాయి వార్తాపత్రిక, హిందీలో ఒకదాన్ని బిగ్గరగా చదవాలి. విద్యార్థులను తరగతుల వారీగా విభజించి, సంపాదకీయాలు, ప్రధాన జాతీయ, అంతర్జాతీయ, క్రీడా వార్తలను చదవడానికి, చర్చించడానికి ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని విద్యాశాఖ ఉత్తర్వులో పేర్కొంది. ఈ కార్యక్రమం విద్యార్థుల సాధారణ జ్ఞానాన్ని, సమాజంపై అవగాహనను మెరుగుపరచడమే కాకుండా, వారిని పోటీ పరీక్షలకు మరింత మెరుగ్గా సిద్ధం చేయడానికి కూడా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. వారం క్రితం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పాఠశాలల్లో వార్తాపత్రికల పఠనాన్ని తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.



## బిజెపిని చూసి ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోలేరు: మోహన్ భగవత్



**భోపాల్:** యూనిఫాం, శారీరక వ్యాయామాలు ఉన్నప్పటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పారామిలటరీ సంస్థ కాదని, బిజెపిని చూసి ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవాలనుకుంటే అది పెద్ద పొరపాటని ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. సమాజాన్ని ఏకం చేయడం, భారత దేశం మరోసారి విదేశీ శక్తుల గుప్పిట్లోకి వెళ్లకుండా అవసరమైన లక్షణాలు, సద్గుణాలను నింపడానికి ఆర్ఎస్ఎస్ పని చేస్తుందని భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలిపారు. 'మేముతాము యూనిఫాం ధరిస్తాం. కవాతులు, కర్రలతో ఎక్సర్‌సైజ్‌లు చేస్తాం. ఇది చూసి మమ్మల్ని ఎవరైనా పారామిలటరీ సంస్థ అనుకుంటే పొరపడినట్టే. సంఘ్ ఒక విలక్షణ సంస్థ. సంఘ్‌ను అర్థం చేసుకోవడం కష్టం' అని భగవత్ అన్నారు. జన్‌సంఘ్, దాని నుంచి వచ్చిన బిజెపికి ఆర్ఎస్ఎస్ మాతృసంస్థనే విస్తృతాభిప్రాయం ఉందని, అయితే అవి సంఘ్‌కు వ్యతిరేకంగా అల్లుకున్న కథనాలేనని అన్నారు. ఎవరైతే సంఘ్ గురించి విశ్వసనీయ వనరుల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారో వారికే సంఘ్ గురించి తెలుస్తుందని అన్నారు. ఇలాంటి అపోహల రీత్యా ఆర్ఎస్ఎస్ పాత్ర, మిషన్ గురించి వివరించాల్సిన అవసరం ఏర్పడిందని సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న భగవత్ తెలిపారు. స్వయం సేవకులకు సంఘ్ తీర్దిదిద్దుతుందని, భారతదేశ పరమ వైభవం కోసం పనిచేసేందుకు విలువలు, ఆలోచన, లక్ష్యాలను పెంపొందిస్తుందని, రిమోట్ ద్వారా నియంత్రించదని భగవత్ వివరించారు. దేశభక్తి వాతావరణాన్ని నిర్మించే కార్మికులను సృష్టించడానికి సంఘ్ తన శాఖల ద్వారా పనిచేస్తుందన్నారు. సంఘ్ అనేది ఒక ప్రతిచర్యగా పుట్టిందనే సాధారణ భావన ఉందని, అయితే అది నిజం కాదని చెప్పారు. సంఘ్ దేనికీ ప్రతిచర్య, వ్యతిరేకం కాదని, సంఘ్ ఎవరితోనూ పోటీ పడటం లేదని అన్నారు. సంఘ్ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని, సంఘ్ ఎప్పుడూ బయట నుంచి వచ్చే నిధులు, విరాళాలపై ఆధారపడదని భగవత్ చెప్పారు. సంఘ్‌ను బాగా అర్థం చేసుకోవాలనుకుంటే సంఘ్ శాఖలకు రావాలని కోరారు. చక్కెర రుచి గురించి తాను రెండు గంటల పాటు వివరించినా ఒక టీ స్పూన్ చక్కర తాగితేనే అర్థమవుతుందని, అదేవిధంగా శాఖలకు వస్తేనే సంఘ్ గురించి అర్థమవుతుందని చెప్పారు.

## ర్యాగింగ్, వేధింపులు

- మనస్తాపంతో చికిత్స పొందుతూ బాలిక మృతి
- ధర్మశాల కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సస్పెన్షన్

**న్యూఢిల్లీ :** సీనియర్ల ర్యాగింగ్, ప్రొఫెసర్ లైంగిక వేధింపుల కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో 19 ఏళ్ల బాలిక తీవ్ర మనస్తాపానికి గురైన ఆసుపత్రిలో చేరగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనలో హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం శనివారం ధర్మశాల ప్రభుత్వ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి రాకేష్ కన్వర్ జారీ చేసిన ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ (భౌగోళిక శాస్త్రం) అశోక్ కుమార్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నా రు. డిపార్ట్‌మెంటల్ విచారణ ఫలితం వెలువడే వరకు అతను తక్షణమే సస్పెన్షన్‌లో ఉంటారు. సస్పెన్షన్‌ను ధృవీకరిస్తూ, విద్యా డైరెక్టర్ అమర్‌జీ త్ శర్మ పిటిఐతో మాట్లాడుతూ, బాధితురాలు 2 024–25 విద్యా సంవత్సరంలో కళాశాలలో బిఎ పార్ట్1 విద్యార్థిని అని తెలిపారు. ఎలక్ట్రానిక్, ప్రి ంట్ మీడియాలో వచ్చిన నివేదికల ప్రకారం, అ శోక్ కుమార్ ప్రమేయాన్ని ప్రాథమికంగా తోసిపుచ్చలేమని, వాస్తవాలను నిర్ధారించడానికి అతనిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. 'కేంద్ర పౌర సేవల (వర్గీకరణ, నియంత్రణ, అప్పీల్) నియమాలు, 1965లోని నియమం 10లోని ఉపనియమం (1) ప్రకారం సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, శ్రీ అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (భౌగోళిక శాస్త్రం) (కళాశాల క్యాడర్), ప్రభుత్వ కళాశాల, ధర్మశాల, జిల్లా కాంగ్రాను డిపార్ట్‌మెంటల్ విచారణ ఫలితం వెలువడే వరకు తక్షణమే సస్పెన్షన్‌లో ఉంచుతున్నాము' అని ఆ ఉత్తర్వు లో పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రధాన కార్యాలయం ఉన్నత విద్యా డైరెక్టరేట్, సిమ్లాలో ఉంటుందని, అతను అధీకృ త అధికారి ముందస్తు అనుమతి లేకుండా ప్ర ధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లకూడదని కూడా ఆదేశించారు. ధర్మశాల ప్రభుత్వ కళాశాల విద్యార్థిని దురదృష్టకర మరణంపై వాస్తవాలను కనుగొనడానికి/ప్రాథమిక విచారణ నిర్వహించడానికి అదనపు డైరెక్టర్ ఉన్నత విద్య హరీష్ కుమార్ నే తృత్వంలో, ధలియారా, బైజ్‌నాథ్, నౌరా ప్ర భుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లను సభ్యులుగా ఒక నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు శ నివారం విద్యా డైరెక్టర్ ఇక్కడ జారీ చేసిన ఒక ఉ త్తర్వులో పేర్కొన్నారు. కళాశాలల ఉపాధ్యాయు లు, విద్యార్థులతో జరిగిన ఆరోపిత వేధింపులు, లైంగిక దాడి, ర్యాగింగ్, కుల సంబంధిత వ్యాఖ్యలకు సంబంధించిన అన్ని కోణాలను కవర్ చేస్తూ కమిటీ మూడు రోజుల్లో సమగ్ర నివేదికను సమర్పిస్తుందని శర్మ తెలిపారు. అయితే, ముందస్తు బెయిల్ పొందిన నిందిత అసిస్టెంట్ ప్రొఫెసర్ మీడియాతో మాట్లాడుతూ, తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. పోలీసుల దర్యాప్తునకు సహకరిస్తానని ఆయన చెప్పారు. తన ఫిర్యాదులో, విద్యార్థి తండ్రి సెప్టెంబర్ 18, 2025న తన కుమార్తెను ముగ్గురు సీనియర్లు కొ ట్టారని, అదే సమయంలో కళాశాల ప్రొఫెసర్ ఆమెతో అసభ్యకరమైన చర్యలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఆ అమ్మాయికి సంబంధించిన ఒక వీడియో బయటపడింది. అందులో ఆమె ప్రొఫెసర్ తన ప్రవర్తనను వ్యతిరేకించినందుకు తనను వేధించాడని, అసభ్యకరమైన చర్యలకు పాల్పడ్డాడని, మానసికంగా వేధించాడని, బెదిరించాడని ఆరోపించింది. ఈ దాడి, వేధింపుల కారణంగా ఆ విద్యార్థిని ఆసుపత్రిలో చేర్చారు. ఈ సంఘటనల తరువాత, తన కుమార్తె తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురైందని, దానివల్ల ఆమె ఆరోగ్యం వేగంగా క్షీణించిందని, చికిత్స పొందుతూ డిసెంబర్ 26న మరణించిందని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు.



## డ్రగ్స్ కేసులోఎపి ఎమ్మెల్యే కుమారుడు
## నానక్‌రాంగూడలో 'ఈగల్ టీం' దాడులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డ్రగ్స్ కేసులో ఎపి చెందిన ఎంఎల్ఎ కుమారుడు అరెస్ట్ కావడం సంచలనం సృష్టిస్తోంది. కడప జిల్లా జమ్మలమడుగు బిజెపి ఎంఎల్ఎ ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డిని శనివారం తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్, నానక్‌రాంగూడ ప్రాంతంలో డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న సమాచారంతో తెలంగాణ పోలీసుల ప్రత్యేక విభాగమైన 'ఈగల్ టీం', నార్సింగి పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుధీర్ రెడ్డితో పాటు మరో వ్యక్తి డ్రగ్స్ తీసుకుంటుండగా పట్టుబడ్డారు. వెంటనే వారికి అక్కడికక్కడే డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలు చేయగా, పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేసి, డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించారు. సుధీర్ రెడ్డి తండ్రి ఆదినారాయణ రెడ్డి ప్రస్తుతం బిజెపి ఎంఎల్ఎగా ఉన్నారు. గతం లో ఆయన టిడిపి ప్రభుత్వంలో మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. సుధీర్‌రెడ్డికి డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే, గతంలో కూడా సుధీర్‌రెడ్డి డ్రగ్స్ తీసుకుంటూ రెండు సార్లు పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం.

## 10 నిమిషాల్లో డెలివరీ వల్ల రైడర్లకు పని ఒత్తిడి లేదు: గోయల్

**న్యూఢిల్లీ:** 'గిగ్ నమూనా' వల్ల సంబంధిత కార్మికులకు (రైడర్స్) ఎలాంటి పని ఒత్తిడీ ఉండదని, పైగా పనివిధానంలో పూర్తిస్వేచ్ఛ, పట్టువిడుపుల విధానం ఉంటుందని, వారి సంక్షేమ ప్రయోజనాలు కూడా ఎంతో బాగుంటాయని 'ఎటర్నల్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సిఇఓ దీపిందర్ గోయల్ అన్నారు. 10 నిమిషాల్లో డెలివరీ అంటూ ఈ సేవలు పొందేవారికి తాను ఇచ్చిన హామీవల్ల గిగ్ రైడర్లు ఎంలాంటి పని ఒత్తిడికీ గురికాబోరని, పైగా వారికి మంచి చెల్లింపులు ఉంటాయన అన్నారు. వారి పని పరిస్థితులు కూడా బాగా మెరుగుపడతాయన్నారు. తమ పని పరిస్థితులను మెరుగుపరచాలని, మంచి వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఇటీవల గిగ్ వర్కర్లు నిరసన ప్రదర్శనలు చేసిన నేపథ్యంలో జోమాటో, బ్లింకిట్ బ్యాపారాల యజమాని, ఎటర్నల్ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ పైవిధంగా స్పందించారు. భారతదేశంలో ప్రస్తుత అంచనాల ప్రకారం 1.27 కోట్ల మంది గిగ్ వర్కర్లు ఉన్నారు. ఈ కార్మికుల సంఖ్య 2029–30 సంవత్సరాల నాటికి 2.35 కోట్లకు పెరుగుతుందని నీతీ ఆయోగ్ కు చెందిన ప్రభుత్వ బుద్ధిజీవుల విభాగం అంచనావేసింది. ''2025లో జొమాటో, బ్లింకిట్‌లు డెలివరీ భాగస్వాముల బీమా కవరేజీ కోసం రూ.100 కోట్లు పైగా ఖర్చు చేసింది, దీనివల్ల రైడర్లకు టిప్స్‌ను మినహాయిస్తే, సగటున ఒక గంట సమయంలో చేసే చెల్లింపు (ఇపిహెచ్) 2025లో సగటున రూ.102లు లభించాయి. అంతకుముందు 2024లో ఈ చెల్లింపు కేవలం రూ.92లు మాత్రమే ఉండేది, ఈ చెల్లింపులు ఏటికేడాది 10.9 శాతం వంతున పెరుగుతోంది'' అని గోయల్ ఎక్స్ వేదికగా తెలియజేశారు. పది నిమిషాల్లో డెలివరీ చేస్తామంటూ చేసిన తమ వాగ్దానంవల్ల గిగ్ రైడర్లకు ఎలాంటి ఒత్తిడి ఉండదంటూ అదేలాగో ఆయన వివరించారు. పని కాలమాన పరిస్థితుల్లో పట్టు విడుపులు ఉంటాయని, సంక్షేమ ప్రయోజనాలు కూడా ఒక విశ్వసనీయమైన వనరుగా ఎంతో బాగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఐతే ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా ఇంటర్నెట్ యూజర్ల నుండి మిశ్రమ స్పందన మాత్రమే వచ్చింది. రైడర్లు డ్రైవింగ్ విషయంలో చాలా దూకుడుగా ఉంటున్నారని అనేకమంది ఇంటర్నెట్ యూజర్లు ఆరోపించారు. 10 నిమిషాల్లో డెలివరీ అనే విధానంవల్ల రైడర్లు తరచు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని యూజర్ల నుండి విమర్శలు వచ్చాయి. గిగ్ –ప్లాట్‌ఫాం సర్వీసెస్ వర్కర్స్ యూనియన్ (జిప్స్వ్యు) గతనెలలో అనేక సమస్యలు ప్రస్తావిస్తూ కేంద్ర కార్మిక,ఉపాధి శాఖామంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాసింది. అనేక సమస్యలను ఈ లేఖలో మంత్రి దృష్టికి జిప్స్వ్యు తీసుకువచ్చింది. తక్షణం 10–20 నిమిషాలలోపు డెలివరీ సేవలు అందించాలనే నిబంధనను తక్షణం తొలగించాలని యూనియన్ కేంద్రమంత్రిని లిఖిత పూర్వకంగా కోరింది.కార్మికుల భద్రతే ప్రధానాంశంగా తీసుకుని ఈ మార్పు చేయాలని కోరింది. భారతదేశంలో స్వల్పకాలిక కాంట్రాక్టుల ఆధారిత ఆర్థిక వ్యవస్థకు తక్కువ నియంత్రణలు ఉండాలని, ప్రభుత్వ పెత్తనం ఎక్కువగా ఉండకూడదని, దీని వల్ల ఇంకా ఎంతోమంది ఈ సంఘటిత రంగంలోకి వస్తారని గోయల్ వాదిస్తున్నారు. డెలివరీ భాగస్వాములకు మరీ అంత పనిభారం లేదని, గత ఏడాదిలో ఈ భాగస్వాములు జొమాటోలో సగటున 38 పని దినాలు చేశారన్నారు. ఏడు గంటలు నిర్దేశిత పనిగంటలకు బదులుగా ఈ గిగ్ నమూనా ఎంతో ప్రయోజనకరమన్నారు. కేవలం 2.3 శాతం డెలివరీ భాగస్వాములు మాత్రమే 250 రోజులపాటు గత ఏడాదిలో పనిచేశారని గోయల్ చెప్పారు. పూర్తిస్థాయిలో పిఎఫ్‌లు, ఇతర వేతనాలు హామీలు గిగ్ నమూనాకు నిర్మించడం కుదరదన్నారు.

## పురోగతి లేని ఆయిల్ పామ్ కంపెనీ
## ఫ్యాక్టరీల జోన్లు రద్దు

**వాటిని ఆయిల్ ఫెడ్ కంపెనీకి కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి కోసం కేటాయించిన ఫ్యాక్టరీ జోన్లలో ఒప్పంద నిబంధనల ప్రకారం పురోగతి సాధించని కంపెనీలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించినట్లు వ్యవసాయశాఖ తెలిపింది. తెలంగాణ ఆయిల్ పామ్ (ఉత్పత్తి, ప్రాసెసింగ్ నియంత్రణ) చట్టం, 1993, నిబంధనలు 2008 ప్రకారం పురోగతి లేని ఆయిల్ పామ్ కంపెనీలకు కేటాయించిన ఫ్యాక్టరీ జోన్లను తగ్గిస్తూ, ఆయా ప్రాంతాలను తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.రైతుల సంక్షేమమే ప్రభుత్వ విధానమని, ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలిక, స్థిరమైన ఆదాయం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కంపెనీలు ప్రణాళిక ప్రకారం పని చేసి, రైతుల నమ్మకాన్ని పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 2.82 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 98,976 ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చిందన్నారు. 53,709 మంది రైతులకు రూ.297.88 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిందని మంత్రి పేర్కొన్నారు.

## దర్యాప్తు పూర్తికి కోర్టులు విధించే కాలపరిమితి
## మినహాయింపు నియమం కాదు


'సుప్రీం' స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** దర్యాప్తు సంస్థలు దర్యాప్తును పూర్తిచేయడానికి కోర్టులు 'ప్రతిచర్యాత్మకంగా' సమయాలను విధిస్తాయని, మితి మీరిన జాప్యం పక్షపాతానికి కారణమయ్యే 'మినహాయింపు నియమం' కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. నకిలీ పత్రాలు సృష్టించి ఆయుధ లైసెన్స్ కొనుగోలు కేసులో నిందితులకు బలవంతపు చర్యల నుంచి రక్షణ కల్పించి, దర్యాప్తు పూర్తి చేయడానికి ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులకు 90 రోజుల గడువు ఇచ్చిన అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను పరిశీలిస్తూ శనివారం న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, ఎన్.కె.సింగ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. మొత్తం మీద సమయపాలనలు రోగనిరోధకంగా కాకుండా ప్రతిచర్యాత్మకంగా విధించబడతాయని సుప్రీంకోర్టు మునుపటి నిర్ణయాలను విశ్లేషిస్తూ ధర్మాసనం పేర్కొంది. కాలపరిమితి దర్యాప్తును నిర్దేశించడం ప్రమాణం కంటే మినహాయింపుగా ఉండాలని కోర్టులు స్థిరంగా గుర్తించాయని బెంచ్ తెలిపింది. ఈ రాజ్యాంగ నేపథ్యంలోనే, తగిన కేసులలో ఆలస్యం ఏర్పడటం వల్ల పక్షపాతం ఏర్పడటం ప్రారంభమైన చోట కోర్టులు జోక్యం చేసుకుంటాయని హైకోర్టు ఆదేశాన్ని పక్కనపెడుతూ అత్యున్నత న్యాయస్థానం స్పష్టీకరించింది.దర్యాప్తు అధికారులు కార్యనిర్వాహకులు ప్రారంభం నుంచి అనుసరించాల్సిన సమయపాలనను కోర్టు నిర్ణయించదని, అది స్పష్టంగా దర్యాప్తు అధికారులను తప్పుపట్టడమే అవుతుందని ధర్మాసనం తెలిపింది.





## లీవ్ అడిగితే... కొత్త ట్విస్టు



ఏదో ఒక కారణం చెప్పి సెలవు తీసుకోవడం ఉద్యోగులకు కొత్తకాదు. కానీ, ఒక బాస్ స్పందించిన తీరుమాత్రం కొత్తగా ఉంది. 'మా బాస్ లైవ్ లొకేషన్ అడుగుతున్నాడు' అంటూ రెడిట్‌లో ఒక ఉద్యోగి చేసిన పోస్టు క్షణాల్లో వైరల్ అయ్యింది. దేశంలో పని సంస్కృతిపై మరోసారి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. సిక్ లీవ్ ఆమోదించాలంటే లైవ్ లొకేషన్ పంపడం అవసరమా? అన్నది ఇప్పటి హాట్ టాపిక్. 'నిన్న తీవ్రమైన తలనొప్పితో సెలవు పెట్టాను. ఈ రోజూ ఇంకా నొప్పి తగ్గకపోవడంతో మరో రోజు లీవ్ కోరాను. బాస్ హెచ్ఆర్‌ని అడగమన్నాడు. హెచ్ఆర్ వాలిడ్ డాక్యుమెంట్ కోరింది. అదే విషయాన్ని బాస్‌కు చెప్తే, లైవ్ లొకేషన్ పంపు అన్నాడు' అంటూ సదరు ఉద్యోగి రెడిట్ పోస్టులో వాపోయాడు. హెచ్ఆర్ నుంచి వచ్చిన ఆదేశం అంటూ లైవ్ లొకేషన్‌ను బాస్ అడడం ఎలావున్నా.. అసలు తలనొప్పికి 'వాలిడ్ డాక్యుమెంట్ ఏమిటి అని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిని గోప్యతా సూత్రాల కు విరుద్ధమని కొందరు అంటే... జిపిఎస్ లొకేషన్‌ను ఏ విధంగా మార్చాలో యూట్యూబ్ వీడియోలు చూసి నేర్చుకోమంటూ మరికొందరు ఉచిత సలహాలు కూడా ఇస్తున్నారు. మొత్తంమీద లైవ్ లొకేషన్ ఆలోచన వచ్చిన ఆ బాస్ మేధస్సును మెచ్చుకోవాల్సిందే!

## 6-7 అంటే ఏమిటి?



ఇది ఆషామాషీ ప్రశ్న కాదు. ఎందుకంటే, 'డిక్షనరీ.కామ్' అత్యధిక శాతంమంది వెతికిన పదంగా '67'ను పేర్కొంది. ఏటా ఒక్కో పదం ఇచ్చే 'డిక్షనరీ.కామ్'లో ఈసారి 'సిక్స్ సెవెన్' అంటూ పదాలను అంకెల రూపంలో ఇవ్వడంతో దాని అర్థం తెలుసుకోవడానికి నెటిజన్లు అదే వెబ్‌సైట్‌ను తెగ వెతికేస్తున్నారు. సమాజాన్ని, ప్రపంచ ఘటనలను ప్రతిబింబించే పదానికే ఈ గౌరవం ఇస్తామని చెప్పే 'డిక్షనరీ.కామ్' ఈసారి మాత్రం పిల్లల అల్లరి, టీచర్ల టెన్షన్, పెద్దల అయోమయం అన్నింటినీ కలిపి చూపించే నంబర్‌ని ఎంచుకుందని కొందరు అంటున్నారు. అమెరికాలో తరచు విద్యార్థులు ఈ 6 7 అనడం పరిపాటి. అక్కడి ఓ మిడిల్ స్కూల్ టీచర్, కమెడియన్ ఫిలిప్ లిండ్సే చెప్పినట్టు, అక్కడ ఒక విద్యార్థి 67 అనని సందర్భమే లేదు. కాగా, ఫిలడెల్ఫియా రాపర్ స్క్రిల్లా గత ఏడాది విడుదల చేసిన 'డూట్ డూట్' 67 పాట వైరల్ కావడంతో ఈ 'సిక్స్ సెవెన్' మరింత పాపులర్ అయింది. దీనికి తోడు 'టిక్‌టాక్'లో బాస్కెట్‌బాల్ స్టార్ ఆటగాడు లామెలో వీడియోలు జత కలిశాయి. అతని ఎత్తు 6 అడుగుల 7 అంగుళాలు కావడమే ఇందుకు కారణం. ఏదిఏమైనా 'డిక్షనరీ.కామ్' ప్రకారం, 67 గురించి సెర్చ్‌లు ఆరు రెట్లు పెరిగాయి. విచిత్రంగా, 67 అంటే, 'అర్థం లేనిది' లేదా 'నిర్వచించలేనిది' అని అర్థమని 'డిక్షనరీ. కామ్' పేర్కొంది. అర్థం లేదనే విషయాన్ని చెప్పడానికి అర్థంలేని పదంకోసం, అర్థం లేకుండా నెటిజన్లు వెతికేయడంలో అర్థం ఏమిటో?

## అతి మంచిది కాదు..



వంటల ఘుమఘుమలు ఆహ్లాదకరంగానే ఉన్నా, ఒక్కోసారి వెగటు కలిగిస్తుంది. అమెరికాలోని మాసెచూసెట్స్ రాష్ట్రం, హావెర్‌హిల్ పట్టణవాసుల పరిస్థితే ఇందుకు నిదర్శనం. ఆ చిన్న పట్టణం, తాజాగా ఏర్పాటైన డంకిన్ డోనట్స్ ఫ్యాక్టరీ కారణంగా ఊహించని సమస్యను ఎదుర్కొంటోంది. ఆ ఫ్యాక్టరీ రోజుకు సుమారు 10 లక్షల డోనట్స్ తయారు చేస్తుండటంతో, అక్కడి నుంచి వెలువడుతున్న వేపిన పిండివాసన పట్టణమంతా వ్యాపించి ప్రజలను ఇబ్బంది పెడుతోంది. ఈ వాసన మొదట్లో కొందరికి ఆకర్షణీయంగా అనిపించినా, ఇప్పుడు అది భారీగా, చిరాకు కలిగించే స్థాయికి చేరిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో గాలితో కలిసి ఈ వాసన ఇళ్లలోకి చొచ్చుకుపోతోంది. కిటికీలు మూసుకున్నా, ఎయిర్ కండిషనర్లు వాడినా, డోనట్స్ వాసన తగ్గడం లేదని స్థానికులు వాపోతున్నారు. పట్టణం పరిమాణం చిన్నదిగా ఉండటం వల్ల, ఇంత పెద్ద ఉత్పత్తి కేంద్రం నుంచి వచ్చే వాసనను పర్యావరణ భారంగా ప్రజలు భావిస్తున్నారు. కొందరు ఇది తలనొప్పులు, వికారం వంటి సమస్యలకు కారణమవుతోందని అంటున్నారు. స్థానిక పాలక సంస్థల వద్దకు ఫిర్యాదులు పెరిగాయి. డంకిన్ సంస్థ మాత్రం, తాము అన్ని పర్యావరణ నిబంధనలను పాటిస్తున్నామని, వాసన నియంత్రణ కోసం ఫిల్టర్లు, వెంటిలేషన్ వ్యవస్థలను మెరుగుపరుస్తున్నామని తెలిపింది. అయినప్పటికీ, ప్రజల దైనందిన జీవితం మీద ఈ డోనట్ వాసన ప్రభావం పడుతుండటంతో, పరిశ్రమలు– సమాజం మధ్య సమతుల్యతపై చర్చ మొదలైంది. సారాంశంగా, ఉద్యోగాలు, ఆర్థిక లాభాలు తీసుకొచ్చిన ఈ ఫ్యాక్టరీ, అదే సమయంలో ఒక చిన్న పట్టణాన్ని అనవసరమైన వాసన సమస్యతో ముంచెత్తింది. ఇది ఆధునిక పరిశ్రమల వల్ల ఎదురయ్యే కొత్త తరహా పర్యావరణ సమస్యలకు ఉదాహరణగా నిలుస్తోంది.

## పబ్లిక్ డొమైన్‌లోకి క్లాసిక్ పాత్రలు..



అమెరికా కాపీరైట్ చట్టంలో ఉన్న 95 ఏళ్ల గరిష్ట పరిమితి పూర్తవడంతో, ఈ ఏడాది నెల ఒకటో తేదీ నుంచే కొన్ని ప్రసిద్ధ కార్టూన్, కామిక్, సాహిత్య సృష్టులు పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి. అంటే, ఇకపై అనుమతి లేకుండా, రాయల్టీ చెల్లించకుండా వీటిని సృష్టికర్తలు ఉపయోగించుకోవచ్చు, కొత్త కథ లు, సినిమాలు, కళాఖండాలుగా మలచుకోవచ్చు. ఈ జాబితాలో ముఖ్యంగా బెట్టీ బూప్, బ్లాండీ పాత్రలు చేరాయి. వీటితో పాటు ఇప్పటికే పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చిన మిక్కీ మౌస్, విన్నీ ద ఫూహ్ సరసన ఇవి నిలిచాయి. బెట్టీ బూప్ తొలిసారి 1930లో విడుదలైన 'డిజ్జీ డిషెస్'అనే షార్ట్ ఫిల్మ్‌లో కనిపించింది. ఆశ్చర్యం ఏమిటంటే, ఈ పాత్ర మొదట మనిషి కాదు... కుక్క రూపంలో (పూడిల్ చెవులు, ముక్కుతో) ఆవిర్భవించింది. తర్వాతికాలంలో అదే రూపం మనిషి ఫ్లాపర్ స్టైల్‌గా మారింది. ఇప్పటి నుంచి ఆ ప్రారంభ బెట్టి బూప్ రూపాన్ని సినిమాలు, కథలు వంటి సృజనాత్మక పనుల్లో స్వేచ్ఛగా వాడుకోవచ్చు. అయితే, బెట్టి బూప్ ట్రేడ్‌మార్క్ ఇంకా కొనసాగుతోంది, కాబట్టి టీషర్టులు వంటి వాణిజ్య వినియోగాల విషయంలో పరిమితులు ఉంటాయి. కాగా, 1930లో ప్రారంభమైన 'చిక్ యంగ్' కామిక్ స్ట్రిప్‌లోని బ్లాండీ బూపడూప్ కూడా పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చింది. మొదట ఆమె జీవితం కేంద్రంగా సాగిన ఈ స్ట్రిప్, తరువాత ఆమె భర్త డాగ్‌వుడ్ చుట్టూ తిరిగే కుటుంబ హాస్యంగా మారింది. 'స్టీమ్ బోట్ విల్లీ' తర్వాత మిక్కీ మౌస్‌కు సంబంధించిన మరో తొమ్మిది ప్రారంభ కార్టూన్లు కూడా ఇప్పుడు పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి. అలాగే, మిక్కీ కుక్క ప్లూటో కూడా, ఆ పేరు రోవర్‌గా ఉన్న కాలంనాటి వీడియోలను ఇప్పుడు స్వేచ్ఛగా వాడుకునే స్థితిలోకి వచ్చింది.

## స్టార్‌లింక్ ఉపగ్రహాల కక్ష్య తగ్గింపు...



స్పేస్‌ఎక్స్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ తమ ఉపగ్రహ సమూహాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సుమారు 550 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో ఉన్న అన్ని స్టార్‌లింక్ ఉపగ్రహాలను ఈ సంవత్సరంలో 480 కిలోమీటర్లకు తగ్గిస్తారు. అంతరిక్ష భద్రతను పెంచడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశ్యం. 500 కిలోమీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉపగ్రహాలు, అంతరిక్ష శకలాల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల, ఢీకొన్న ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని స్టార్‌లింక్ భావిస్తున్నది. గత నెల స్టార్‌లింక్‌కు చెందిన ఒక ఉపగ్రహం అంతరిక్షంలో సాంకేతిక లోపానికి గురైంది. ఫలితంగా రోదశిలో దాని శకలాలు చెల్లాచెదురయ్యాయి. సుమారు418 కిలోమీటర్ల ఎత్తులో ఆ ఉపగ్రహంతో సంబంధం పూర్తిగా తెగిపోవడంతో, ఇది అరుదైన కైనెటిక్ ప్రమాదంగా స్పేస్‌ఎక్స్ గుర్తించింది. ఆ ఉపగ్రహం అకస్మాత్తుగా నాలుగు కిలోమీటర్లు దిగజారడం, అంతర్గత పేలుడు జరిగి ఉండవచ్చని ప్రాథమిక అంచనా. ఇటీవలి కాలంలో ఇంటర్నెట్, కమ్యూనికేషన్, భూమి పరిశీలన వంటి సేవల కోసం వేల సంఖ్యలో ఉపగ్రహాలు కక్ష్యలోకి పంపిస్తున్నారు. దీనితో భూమి చుట్టూ ఉపగ్రహాల సంఖ్య వేగంగా పెరిగింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున కక్షను మార్చుకోవాలని స్టార్‌లింక్ నిర్ణయించింది.

— బిఎస్ఎస్ మైత్రేయి

## ట్రంప్ బందిపోటు దాడి

ప్రజాపక్షం 04-01-2026, ఆదివారం

తప్పుడు ఆరోపణలతో, ఆయిలు ఓడల దిగ్బంధంతో మూడు మాసాలుగా వెనిజులా వామపక్ష ప్రభుత్వంపై కుట్రలు అమలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారం అర్థరాత్రి (అమెరికా కాలమానం ప్రకారం) వెనిజులా రాజధాని కారకాస్‌పై బాంబు ప్రేలుళ్లు జరిపించి, అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను బంధించి అజ్ఞాత ప్రదేశానికి తరలించిన ఘటన అంతర్జాతీయ న్యాయసూత్రాలకు, ఐరాస ఛార్టర్‌కు విరుద్ధమైన 'సామ్రాజ్యవాద దురాక్రమణ చర్య. ఈ బందిపోటుతనంపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలి, ప్రధాన కార్యదర్శి, లాటిన్ అమెరికన్ అండ్ కరేబియన్ రాజ్యాల కమ్యూనిటీ, అలీనోద్యమం స్పందించాలి. అమెరికా జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయాలి.

వెనిజులాపై ట్రంప్ దండయాత్ర 2003లో ఇరాక్‌పై జార్జి డబ్ల్యు బుష్ దురాక్రమణ చర్యను పోలి ఉంది. అధ్యక్షులిద్దరూ బూటకపు ఆరోపణలను ఆశ్రయించారు. ఆ దేశాలలోని ఆయిలు సంపదను కొల్లగొట్టే వ్యూహంతో తమకు వ్యతిరేకమైన ప్రభుత్వాలను బలప్రయోగంతో మార్చివేసే దుర్మార్గపు చర్యకు పాల్పడ్డారు. ఇరాక్ సామూహిక జనసంహారక ఆయుధాలు అభివృద్ధి చేస్తున్నదన్న అమెరికా ఆరోపణను ఐరాస అణుశక్తి సంస్థ నిపుణుల బృందం తనిఖీలు చేసి నిరాకరించినా, అధ్యక్షుడు బుష్ దురాక్రమణ యుద్ధానికి పాల్పడి అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను మట్టుపెట్టాడు. ఆ తర్వాత ఇరాక్ సుదీర్ఘ కాలం కల్లోల పరిస్థితుల్లో మునిగిపోయింది. ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్–ప్రపంచంలో యుద్ధాలను తానే ముగింపజేస్తున్నానని, ప్రపంచ శాంతి బహుమతికి తానే అర్హుడనని డంబాచార ప్రకటనలతో ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని దగా చేస్తున్నాడు. వెనిజులాపై ఆకస్మికంగా బాంబులువేసి, అధ్యక్షుణ్ణి బందీగా తీసుకెళ్లటం అతడి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసింది. మూడు మాసాలుగా వెనిజులాపై వేధింపు చర్యలకు ఒడిగట్టిన ట్రంప్‌తో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు మదురో ప్రతిపాదించిన మరునాడే సైనిక దాడికి పాల్పడ్డాడు. వెనిజులా నుంచి అమెరికాకు పెద్ద ఎత్తున మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ జరుగుతోందని, ఆ స్మగ్లింగ్ ముఠాలతో మదురోకు సంబంధం ఉందన్నది ట్రంప్ ప్రధాన ఆరోపణ. దాన్ని మదురో ఖండించారు. ఐరాస, అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకుని దర్యాప్తును కోరితే తన ఎత్తుగడ పారదని ట్రంప్ భావించి ఉండవచ్చు. వారం క్రితమే ఒక ఓడరేవుపై శాంపిల్‌గా సిఐఎ దాడులు చేసింది. ఇప్పుడు ఏకంగా రాజధాని, మరి కొన్ని కీలక ప్రదేశాలపై ట్రంప్ బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు.

ట్రంప్‌కు వెనిజులాపై ఎందుకీ కక్ష? రెండుదశాబ్దాలకు పూర్వం వెనిజులా వామపక్ష ప్రభుత్వాధినేత హుగో ఛావెజ్ తమ భూభాగం నుంచి అమెరికన్ ఆయిల్ గుత్తాధిపతులను తరిమి కొట్టటాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదులు సహించలేదు. వెనిజులా జాతీయం చేసిన నూనె క్షేత్రాలు తమ ఆస్తిలా భావిస్తున్న ట్రంప్ వాటిని తిరిగి ఇచ్చేయాలంటున్నారు. లాటిన్ అమెరికాలో వామపక్ష శక్తుల ప్రభావం కొంత తగ్గిన ఈ సమయాన్ని అనువుగా ఉపయోగించుకుని ప్రభుత్వం మార్పు వ్యూహం అమలు చేస్తున్నాడు.

ఇక్కడ ప్రత్యేకించి గమనించాల్సింది ఇటీవల వైట్‌హౌస్ విడుదల చేసిన జాతీయ భద్రతా వ్యూహం డాక్యుమెంట్. పశ్చిమార్ధగోళంపై అమెరికా ఆధిపత్యం పునఃస్థాపితం చేయాలన్న మన్రో సిద్ధాంతాన్ని అమలు జరపాలని అది కోరింది. లాటిన్ అమెరికా దేశాల ఎన్నికల్లో ట్రంప్ జోక్యం చేసుకోవటం ఇందులో భాగమే. అలాగే ఇతర ఖండాల్లో అవినీతి ఆరోపణలతో న్యాయస్థానం శిక్షించిన తన మితవాద మిత్రుల పక్షాన కూడా ఆయన జోక్యం చేసుకుంటున్నాడు. కొరకరాని కొయ్యగా ఉన్న వెనిజులాపై సైనికంగానే దాడి చేశాడు. అమెరికాతో స్నేహంగాలేని లాటిన్ అమెరికా దేశాల్లో ప్రభుత్వాలను మార్చివేయటం విధానంగా చేబట్టిన ట్రంప్ వెనిజులాపై తొలి దెబ్బతీశాడు.

బలప్రయోగంతో దేశాల సార్వభౌమత్వాన్ని హరించే, ఐరాస ప్రణాళికను బరితెగించి ఉల్లంఘించే ఆటవిక పద్ధతులకు అమెరికన్ సామ్రాజ్యవాదం ఒడిగడితే ఇక అంతర్జాతీయ న్యాయచట్టాలెందుకు? ప్రపంచంలోని ప్రగతిశీల శక్తులన్నీ ఈ దురాక్రమణ కృత్యాన్ని ఖండించాలి. అంగీకృత సూత్రాల ప్రకారం ప్రపంచ వ్యవస్థ పనిచేయకపోతే అరాచకం రాజ్యమేలుతుంది.

### ప్రభుత్వ బుకాయింపులను బైటపెట్టిన

# ఆరావళి నిర్వచన మార్పు

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

2014 నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వివిధ చట్టాల కింద ఎన్ని నిర్వచనాలను మార్చింది, ఎవరి ప్రయోజనంకోసం అలా చేసింది? ఆరావళి పర్వతాల కేసు మరోసారి మనల్ని ఆలోచించేలా చేసింది. ఎందుకంటే పర్యావరణానికి, ప్రకృతికి నష్టం కలిగించి, మైనింగ్ లాబీలకు లాభం చేకూర్చేలా నిర్వచనాలను మార్చారు. ఇది దేశవ్యాప్త నిరసనలకు దారితీసింది. ఆరావళి పర్వతాలకు సంబంధించి సవరించిన నిర్వచ నం చుట్టూ ముసురుకున్న ఆందోళనలపై సుమోటో కేసు ప్రారంభమైంది. దేశంలో సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా అనేక చట్టాలలో నిర్వచనాల మార్పుల చుట్టూ మనం అనేక వివాదాలను చూశాం. ప్రస్తుత ఆరావళి పర్వతాల కేసులో ప్రభుత్వ బుకాయింపును ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైన విషయాన్ని మనకు గుర్తు చేస్తుంది.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్, జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ ఎ.జి. మసిహ్‌లతో కూడిన ధర్మాసనం 2025 డిసెంబర్ 29న సుమోటో కేసును విచారిస్తూ, ఆరావళి కొండల నిర్వచన మార్పుకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాన్ని నిలిపివేసింది. నిపుణుల కమిటీ నివేదికను, కోర్టు ఆదేశాలను అమలు చేయడానికి ముందు మరింత స్పష్టత అవసరమని పేర్కొంది. కొత్తగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి, కేసును 2026 జనవరి 21కు వాయిదా వేసింది.

ఆరావళి కొండల నిర్వచనంలో మార్పులు నియంత్రణ లేని మైనింగ్‌కు దారితీసి అటు పర్యావరణ, ఇటు జీవావరణ నష్టానికి దారితీయవచ్చనే దేశవ్యాప్త నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో ఈ సుమోటో కేసు ప్రారంభమైంది. కమిటీ సిఫార్సులు, కోర్టు ఆదేశాలను నిలిపివేయడం అవసరమని తాము భావిస్తున్నామని, కమిటీ ఏర్పాటు చేసే వరకు స్టే అమలులో ఉంటుందని ధర్మాసనం పేర్కొంది.

అనేక ఆందోళనలను ప్రస్తావిస్తూ, గతంలో నిపుణుల కమిటీ నివేదిక, కోర్టు పరిశీలనలను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని కోర్టు పేర్కొంది. దానిని అమలు చేయడానికి ముందు, కచ్చితమైన మార్గదర్శకత్వం అందించడానికి నిష్పాక్షిక, స్వతంత్ర నిపుణుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని నొక్కి చెప్పింది. ఆరావళి కొండలు, పర్వత శ్రేణుల నిర్వచనం ఒక నిర్మాణాత్మక వైరుధ్యాన్ని సృష్టించిందా, అది పరోక్షంగా ఆరావళియేతర ప్రాంతాల పరిధిని విస్తరించిందా, తద్వారా అనియంత్రిత మైనింగ్ కొనసాగడానికి వీలు కల్పించిందా అనే విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. ధర్మాసనం చేసిన పరిశీలనల ప్రకారం, పరిశీలించాల్సిన ఇతర నిర్దిష్ట ఆందోళనలలో కొండల మధ్య 500 మీటర్ల తేడాలో నియంత్రిత మైనింగ్ అనుమతి ఇవ్వబడుతుందా, 12,081 కొండలలో కేవలం 1,048 కొండలు మాత్రమే 100 మీటర్ల ఎత్తు పరిమితిని చేరుకుంటున్నాయనే ఆందోళన సరైనదేనా, లేదా జియలాజికల్ పరిశోధన అవసరమా అనేవి ఉన్నాయి.

ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్‌లలో విస్తరించి ఆరావళి కొండలు, ఆరావళి శ్రేణుల నిర్వచనానికి సంబంధించిన సమస్య తలెత్తింది. ఎందుకంటే పర్యావరణానికి నష్టం కలిగించేలా చట్టబద్ధమైన మైనింగ్‌కు అనుమతించే విభిన్న నిర్వచనాలు ఉన్నాయి. 2025 నవంబర్‌లో మాత్రమే, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సు చేసిన కార్యాచరణ నిర్వచనాన్ని సుప్రీం కోర్టు అంగీకరించింది.

నిర్దేశిత జిల్లాల్లోని ఆరావళి కొండలను స్థానిక భూభాగం నుండి కనీసం 100 మీటర్ల ఎత్తు కలిగిన, వాటికి అనుకొని ఉండే లోయలు, అనుసంధానంగా ఉన్న భూ స్వరూపాలతోఉండాలని నిపుణుల కమిటీ నిర్వచించింది. ఆరావళి శ్రేణి నిర్వచనం ప్రకారం, రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండలు ఒకదానికొకటి 500 మీటర్ల దూరం లోపు ఉన్నప్పుడు అది ఏర్పడుతుంది. ప్రభుత్వ నిర్వచనాలపై అప్పట్లో కూడా నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మైనింగ్ లాబీలకు ప్రయోజనం చేకూర్చడానికి ప్రభుత్వం నిర్వచనాన్ని మార్చిందని ఆరోపించారు. ఇది కేవలం నిర్వచనాల మార్పుకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వివిధ చట్టాల కింద నిర్వచనాలను మారుస్తూనే ఉంది. భారతదేశ సాధారణ ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేసే అనేక చట్టాలను మార్చింది. తద్వారా వివిధ రాజకీయ, ఆర్థిక వర్గాలకు, లాబీలకు ప్రయోజనం చేకూర్చింది.

కోవిడ్–19 సంక్షోభ సమయంలో, ఆ తర్వాత, కొన్ని పెద్ద వ్యాపార సంస్థలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఇ) పరిధిలోకి తీసుకురావడం ద్వారా వాటికి ప్రయోజనం చేకూర్చడానికి ఎంఎస్ఎంఇల నిర్వచనాన్ని అనేక మార్లు మార్చారు. 2020కి ముందు ఉన్న నిజమైన ఎంఎస్ఎంఇలు నష్టపోయాయి. ఆర్థిక, ఇతర ప్రయోజనాలు పెద్ద సంస్థలకు అందించబడ్డాయి. ఆ సమయంలో, తయారీ రంగంలో రూ.10 కోట్ల లోపు పెట్టుబడి, సేవారంగంలో రూ.5 కోట్లలోపు పెట్టుబడి ఉన్న సంస్థలను ఎంఎస్ఎంఇలుగా పరిగణించేవారు. 2025 ఏప్రిల్ 1 నుండి రూ.125 కోట్ల లోపు పెట్టుబడితో రూ.500 కోట్ల వరకు టర్నోవర్ కలిగిన సంస్థల వరకు ఎగువ పరిమితిని పెంచారు. ఈ నిర్వచనాల మార్పుతో ఎవరు ప్రయోజనం పొందారనేది ఇప్పుడేమి రహస్యం కాదు.

నిర్వచనంలో అత్యంత వివాదాస్పదమైన మరో మార్పు, ఉద్యోగం చేస్తున్నది ఎవరు, నిరుద్యోగులు ఎవరు అనే అంశానికి సంబంధించింది. జీతం లేకుండా ఇంట్లోచేసే పనిని ఉద్యోగంగా నిర్వచించింది. అలాగే వారంలో కనీసం ఒక గంట పాటు జీతం ఉన్న పని పొందిన వారిని కూడా ఆ పరిధిలోకి తీసుకువచ్చింది. నిరాశతో, ఉపాధి కోసం వెతకడం మానేసిన వారిని నిరుద్యోగులుగా లెక్కించరు. మార్కెట్‌లో తక్కువ ఉద్యోగాలే అందుబాటులో ఉన్నాయనేది వాస్తవం.

అత్యంత ముఖ్యమైన, చర్చనీయాంశాలుగా మారిన మార్పులు కొత్త క్రిమినల్ లా కోడ్‌లు, జన్ విశ్వాస్ చట్టం సవరణలు, ఐటి/ ఆన్‌లైన్ కంటెంట్ నిర్వచనాలు, డజన్ల కొద్దీ చట్టాల రద్దు, చట్టాలు సవరణల పన్ను, కార్మిక, పర్యావరణ చట్టాలలో నియంత్రణ పునర్నిర్వచనాలు.

భారతదేశ క్రిమినల్ చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సిఆర్‌పిసి),ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను వరుసగా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్),భారతీయ సాక్ష్య అధినియమ్ (బిఎస్ఎ)లతో మార్చారు. ఇవి 2024 జూలై 1నుండి అమల్లోకి వచ్చాయి. ఈ కొత్త చట్టాలు దేశద్రోహం, ఉగ్రవాదం, బెయిల్ నిబంధనలు మొదలైన నేరాల నిర్వచనాలను మార్చాయి. ఇది న్యాయ నిపుణులు, ప్రతిపక్ష పార్టీల మధ్య వివాదానికి దారితీసింది. ఇవి ప్రాథమిక న్యాయ పరిభాషను కూడా మార్చేసి, నేరాలను నిర్వచించే, విచారించే విధానాన్ని మార్చాయి.

జన్ విశ్వాస్ (సవరణ) చట్టం– 2023 ప్రకారం, కేంద్ర ప్రభుత్వం సుమారు 42 వేర్వేరు చట్టాలలో డజన్‌ల కొద్దీ ఉన్న నిర్వచనాలను సవరించి, చిన్న నేరాలను నేరాల జాబితా నుండి తొలగించి, శిక్షాస్మృతికి సంబంధించిన నిర్వచనాలను మార్చింది. ముఖ్యంగా కార్పొరేట్, పర్యావరణ, వినియోగదారుల చట్టాలలో ఈ మార్పులు చేసింది. ఇది అనేక నిబంధనలకు క్రిమినల్ శిక్షల స్థానంలో సివిల్ లేదా నగదు జరిమానాలను ప్రవేశపెట్టింది.

ఐటి, మీడియా చట్టాలలో కూడా అనేక నిర్వచనాలు మార్చివేయబడ్డాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం– 2000, అనుబంధ నిబంధనలకు చేసిన సవరణలు ఆన్‌లైన్‌లో 'తప్పుడు సమాచారం' లేదా 'చట్టవిరుద్ధమైన కంటెంట్'గా పరిగణించబడే వాటి నిర్వచనాలను విస్తృతం చేశాయి. ఇది న్యాయపరమైన, భావ స్వాతంత్ర్య విమర్శలకు దారితీసింది. ఇది న్యాయపరమైన వ్యాఖ్యానాలు, అమలును ప్రభావితం చేసే వివాదాస్పద నిర్వచన మార్పులకు మరో ఉదాహరణ.

పౌరసత్వ (సవరణ) చట్టం (సిఎఎ)–2019, విదేశీయుల (సవరణ) ఉత్తర్వులు (2015, 2016), చట్టవిరుద్ధ కార్యకలాపాల (నిరోధన) చట్టం (ఉపా) సవరణలు–2019, జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ, సంబంధిత చట్టాల కింద కూడా అనేక నిర్వచనాలు మార్చబడ్డాయి.

2015, 2016, 2017, 2019,ఆ తర్వాత 2025 వరకు అనేక రద్దులు, సవరణ చట్టాల కింద కూడా నిర్వచనాలు మార్చబడ్డాయి. తాజా రద్దు మహాత్మాగాంధీ నరేగా 2025, దీని స్థానంలో విబి జి రామ్ జి చట్టం వచ్చింది. ఇది గ్రామీణ ప్రజలు పని కోసం డిమాండ్ చేసే హక్కును తొలగించింది.

జిఎస్‌టి, పన్నులకు సంబంధించిన అనేక పదాలు, పన్ను శ్లాబులు, మినహాయింపులు, కార్మిక, పర్యావరణ చట్టాల పరిమితులు, విద్య, ఆరోగ్యం, సంక్షేమం, పౌరసత్వం వంటి ఇతర రంగాలకు సంబంధించిన అనేక అంశాలు మార్చబడ్డాయి. వీటిని ఇక్కడ పూర్తిగా పేర్కొనలేము. చిన్నపాటి సవరణలు, రద్దులను పరిగణనలోకి తీసుకుంటే, ఇటీవల నోటిఫై చేయబడిన నాలుగు కార్మిక కోడ్లతో సహా, నిర్వచనాల మార్పుల సంఖ్య వేలల్లో ఉంటుంది. 2014 నుండి భారతదేశం నిర్వచనాలలో అనేక మార్పుల తరంగాలను చూసింది. ఇవి ప్రజల్లో చర్చకు, న్యాయ సమీక్షకు లేదా రాజకీయ వివాదాలకు దారితీశాయి.

అందుకే నిర్వచనాలలో మార్పుల ప్రభావం సామాన్య ప్రజల జీవితాలపై ఎలా ఉంటుందో సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. పేర్లు, నిర్వచనాలను మార్చే తన విధానంపై ప్రభుత్వ బుకాయింపును బట్టబయలు చేయడానికి సమయం ఆసన్నమైంది.

# ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు ఏమైంది?

**రాజధాని సందడి – బొమ్మగాని కిరణ్‌కుమార్**

శాసనసభ శీతాకాల సమావేశాలలో ప్రధానప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి వ్యవహరించిన తీరు అందరిని ఆశ్చర్యపరుస్తోంది. స్వంత పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం అయోమయంలో పడిపోయారు. కృష్ణానదీ జలాలపై శాసనసభలో జరిగిన చర్చలో పాల్గొనకుండానే ఒక రోజు ముందు ఆ పార్టీ శీతాకాల శాసనసభ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడం అందరినీ విస్మయపరిచింది. తమకు గట్టి పట్టున్న తెలంగాణ నీటి జలాలపై శాసనసభలో జరిగిన చర్చలో బిఆర్ఎస్ ప్రాతినిధ్యమే లేకపోవడం ఒక విధంగా ఆత్మహత్యా సదృశ్యమేనని పరిశీలకులు భావిస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన హుషారులో బిఆర్ఎస్ అధినేత, శాసనసభ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చాలా కాలం తరువాత శాసనసభాపక్షం, పార్టీ రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని, తాను రంగంలో దిగి తోలు తీస్తానని, తెలంగాణకు కృష్ణా జలాలపై జరుగుతున్న అన్యాయంపై ప్రజలను చైతన్యపరుస్తానని ఆయన చేసిన ప్రకటన అందరిలో ఆసక్తిరేపింది. గులాబీ పార్టీ కార్యకర్తల జోష్‌కైతే హద్దే లేదు. ఇక ప్రభుత్వాన్ని తమ నాయకుడు నీళ్ళు తాపిస్తారంటూ హడావుడి చేశారు.

వెన్వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ సమావేశాలు పెడతానని, సభకు వచ్చి కెసిఆర్ తన అభిప్రాయాన్ని చెప్పాలని, ఎవరు నిందించకుండా చూడడం తన బాధ్యత అని సవాలు చేశారు. మొత్తానికి శీతాకాల సమావేశాల తొలిరోజు కెసిఆర్ హాజరవడమే అంతకు రెండు మూడు రోజుల నుంచి వార్తగా నిలిచింది. కానీ, ఆయన వచ్చినంత సేపు శాసనసభలో లేరు. ఆయన సభకు వచ్చిన సమయంలో సిఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా ఆయన సీటు వద్దకు వెళ్ళి నమస్కారం, కరచాలనం చేసారు.

ఒక సత్సంప్రదాయం పునరుద్ధరణ జరుగుతుందేమోననే ఆశలు అందరిలో చిగురించాయి. కానీ, ప్రతిపక్ష నాయకుడిగా రెండేళ్ళలో రెండవసారి శాసనసభకు వచ్చిన ఆయన పది నిమిషాల లోపే సభ నుంచి వెళ్ళిపోయారు.

శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న సమయంలోనే బైట బిఆర్ ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావుకు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మధ్య నిత్య ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో తీవ్ర సవాళ్ళ సమరం జరిగింది. సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామనే సంకేతాలు ప్రభుత్వం నుంచి వెలువడ్డాయి. అదే సమయంలో, రెండేళ్ళ తరువాత బిఆర్ఎస్ శాసనసభా పక్షానికి డిప్యూటీ లీడర్లలను నియమించారు కెసిఆర్. హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు ఉప నేతలు అయ్యారు.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై బిఆర్ఎస్ తరుపున హరీశ్ రావు ప్రభుత్వాన్ని కౌంటర్ చేస్తారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు వెల్లడించారు. బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హోదాలో తొలిసారి ప్రభుత్వాన్ని ఢీ కొట్టే అవకాశం హరీశ్ రావుకు వచ్చిందని, ఆయన అనుభవంతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడతారని బిఆర్ ఎస్ శ్రేణులు ఉత్సాహంగా ఎదురు చూశారు.

అకస్మాత్తుగా ఏమి జరిగిందో ఏమో గాని, సరిగ్గా కృష్ణా ప్రాజెక్టులపై చర్చకు సరిగ్గా ఒకరోజు ముందే స్పీకర్ వ్యవహార తీరుకు నిరసనగా శీతాకాల సమావేశాలను బహిష్కరిస్తున్నామంటూ హరీశ్‌రావే ప్రకటించడం అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. ఆ తరువాత తమకు కూడా సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌కు లేఖ రాయడం, అందుకు అవకాశం లేకుంటే తెలంగాణ భవన్‌లో పిపిటి ద్వారా ప్రభుత్వాన్ని ఎండగడతామని బిఆర్ఎస్ ఎన్ని కారణాలు చెప్పినా అతక లేదు.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఒక సందర్భంలో కాంగ్రెస్ సహా తెలంగాణ ప్రాంత ఎంపిలందరూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఆలస్యానికి కినక వహించి పార్లమెంటు సమావేశాలను బహిష్కరించారు. మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపి సర్వే సత్యనారాయణ మాత్రం తనకు సోనియాగాంధీ తెలంగాణ ఇస్తుందనే నమ్మకం ఉందని, పార్లమెంటుకు హాజరవుతానని ప్రకటించడంతో ఆయనపై అనేకమంది విరుచుకుపడ్డారు. కానీ, ఆ సభలోనే తెలంగాణ అంశంపై చర్చకు వచ్చినప్పుడు తెలంగాణ తరుపున సభలో ఏకైక ఎంపిగా సర్వే సత్యనారాయణ బలంగా ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను వినిపించడం ద్వారా తెలంగాణ వాదుల మన్ననలు అందుకున్నారు. అది చట్టసభలకు ఉన్న గొప్పతనం. ఇక్కడ బిఆర్ఎస్ మాత్రం పాలమూరు రంగారెడ్డి విషయంలో తన వాదనను వినిపించే అవకాశాన్ని కోల్పోయింది. తద్వారా సభలో దాదాపు అన్ని పక్షాల విమర్శలను ఎదుర్కోవడమే కాకుండా, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కుపెట్టిన ఆరోపణలను పరోక్షంగా అంగీకరించినట్లే అయింది. పదేళ్ళు ఆ ప్రాజెక్టు విషయంలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యంపై అధికార పక్షం సభలో ఎండగట్టింది.

ప్రజాస్వామ్యంలో శాసనసభే చర్చలు, ప్రభుత్వాలను ఎండగట్టేందుకు అత్యున్నత వేదిక. అలాంటి వేదిక ద్వారా తమ వాదనను ప్రజలకు వినిపించే అవకాశాన్ని పాతికేళ్ళ అనుభవం ఉన్న బిఆర్ఎస్ వదులుకోవడం విస్మయకరం. ఎందుకంటే తెలంగాణ ఉద్యమ సమయంలో శాసనసభలో తక్కువ సభ్యులు ఉన్నప్పటికీ టిఆర్ఎస్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎత్తిపడుతూ ప్రజల అభిమానాన్ని చూరగొంది. పైగా స్వయంగా కెసిఆర్ కుమార్తె, బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన ఆయన కుమార్తె, ఎంఎల్‌సి కవిత సైతం కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి చర్చించాలని చేసిన అభ్యర్థన ప్రజల్లోకి వెళ్ళింది. ఇవేమీ పట్టించుకోకుండా, నేడు ప్రతిపక్షంలో ఉండి శాసనసభలో చర్చించే అవకాశాన్ని స్వయంగా వదులుకోవడం వెనుక మతలబు ఏమిటోననే చర్చ సాగుతోంది.

దీని వెనుక బిఆర్ఎస్ అంతర్గత రాజకీయాలు కూడా ఉన్నాయనే వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి.

## విగ్రహ ప్రతిష్టాపనకు రూ.4 లక్షలు అందజేసిన ముదిరాజ్ సంఘం

**ప్రజాపక్షం/మక్తల్:** చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కోసం రూ.4 లక్షలు ముదిరాజ్ సంఘం ద్వారా శివాజీ, యువజన సంఘానికి అందజేశారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహ ప్రతిష్టాపన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా చిట్యాల గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తమ వంతుగా రూ.4 లక్షల నగదును శనివారం శివాజీ యూత్ సభ్యులకు సంఘం సభ్యులు మాజీ సర్పంచు బి.నర్సిములు, ఉల్లా లక్ష్మణ్, మాజీ ఎంపిటిసి రామలింగప్ప, అందజేశారు. విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే మరికొంత ఆర్థిక సాయం అందిస్తామని ముదిరాజ్ సంఘం సభ్యులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు కావాలి పెద్దరాములు, ముదుమాల్ లింగప్ప, దుకాణం తమలప్ప, పంది రామలింగప్ప, సింహాద్రి, పుల్లారి శ్రీనివాసులు, పుల్లారి వెంకటేశ్, నాగేష్, బి.వెంకటేశ్, సి.దత్తు, వాకిటి నరసింహులు, గొర్రె కండ్ల వెంకటయ్య పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఎంపి, ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలపరిధిలోని ఎర్రవెల్లి గ్రామం ముంపునకు గురికాకుండా చూడాలని శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎర్రవెల్లి భూనిర్వాసితులు కలిశారు. ఎంపి మల్లురవితో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఎర్రవెల్లి గ్రామం ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

## ఓటరులిస్టులో భారీగా అవకతవకలు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాలిటిలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన ఓటరులిస్టు ముసాయిదాలో భారీగా అవకతవకలు జరిగాయని పూర్తిగా తప్పులతడకలా ఉందని స్థానిక బిజెపి నాయకులు ఆరోపించారు. శనివారం కల్వకుర్తి బిజెపిపట్టణ అధ్యక్షులుగన్నోజు బాబిదేవ్ ఆధ్వర్యంలో ఆర్‌డిఓ కార్యాలయంలో బిజెపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విడుదలచేసిన ఓటరులిస్టు ముసాయిదాలో ఒకవార్డులో 10వార్డులకు సంబంధించిన ఓట్లను బలవంతంగా కలిపారని కల్వకుర్తి పట్టణంలోని ప్రతివార్డులో పట్టణానికి చెందిన అన్నివార్డుల ఓటర్లను కొన్నికలిపారని ఆరోపించారు. అధికారపార్టీ నాయకులు దగ్గర ఉండి తమ నాయకులకు అనుకూలంగా ఓటరులిస్టులను తయారుచేశారని దీనికి కొంతమంది అధికారులు వంత పాడారని ఓటరులిస్టు ముసాయిదాను పూర్తిగా తొలగించి ఏవార్డులోని ఓటర్లను ఆవార్డులోనే ఉండేలాచూడాలని, కొందరు బిఎల్‌ఓలు అధికారపార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని అలాంటివారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ నర్సింహ్మా, జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్‌రెడ్డి, జిల్లాకౌన్సిల్‌మెంబర్ బృంగి వివేకానంద, సీనియర్ నాయకులు నీరుకంటి రాఘవేంద్రగౌడ్, పెద్దారి విజయ్, మాజీమార్కెట్ కమిటిడైరెక్టర్ గుండోజు గంగాధర్, శ్రీకాంత్, నరేష్ గౌడ్, పట్టణ ఉపాధ్యక్షులు అభిలాష్‌గౌడ్, పట్టణ కోశాధికారి లక్ష్మి నర్సింహ్మా, సాయి, వంశీ పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోరాటంతోనే జీతాలు



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** పోరాటంతోనే స్వీపర్లకు 9 నెలల పెండింగ్ జీతాలు జనవరి 1న ప్రభుత్వం ఇచ్చిందని ఎఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష అన్నారు. శనివారం వనపర్తి సిపిఐ ఆఫీసులో జిల్లా ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల సమావేశం ఖయ్యూం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మోష మాట్లాడుతూ రాష్ట్రంలో స్వీపర్లు మాత్రమే నెలకు కేవలం రూ.5200 అతి తక్కువ వేతనం ఏ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగికి లేదన్నారు. ఇచ్చే ఆ తక్కువ వేతనం కూడా ప్రతి నెల ఇవ్వకుండా సుప్రీంకోర్టు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని స్పష్టమైన తీర్పు ఉన్న, ప్రభుత్వాలు అమలు చేయడం లేదని వెంటనే స్వీపర్లకు అమలు చేయాలని డిమాండు చేశారు. నెలకు రూ.5,200 వేతనం ఇస్తున్నారని ఇంత తక్కువ వేతనం రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేదన్నారు. ఇచ్చే 5200 కూడా ప్రతినెల ఇవ్వకుండా 7,8 నెలలకు ఒకసారి ఇస్తున్నారని ప్రతి నెల బతికేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనం ఇస్తారని స్వీపర్లకు ప్రతి నెల 5వ తేదీలోగా జీతాలను చెల్లించాలని డిమాండు చేశారు. స్వీపర్ల ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే అన్ని వసతులు కల్పించాలన్నారు. 30,40 ఏళ్ల నుంచి చాలీ చాలని వేతనానికే పనిచేస్తూ రెగ్యులర్ అవుతుందని ఆశలతో ఉన్నారన్నారు. ఉద్యోగ భద్రత కోసం జీతాల పెంపు కోసం పోరాటానికి సిద్ధం కావాలన్నారు. గోపాల్ గౌడ్ , శోభారాణి, రమేష్, అభిమాన్యు, మన్నెమ్మ, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం అమ్మకాలు.. సీజ్



మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మీ రెడ్డి

**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ పోలీసు స్టేషన్ పరిధిలో దాసారిపల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారి పక్కన గల శ్రీ సాయి బాలాజీ దాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న మక్తల్ టౌన్ నేతాజీ నగర్‌కి చెందిన తంబెళ్ల రాజశేఖర్ అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి, అతని వద్ద నుంచి 6 కింగ్‌ఫిషర్ బీర్ బాటిళ్లను పట్టుకుని సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయించినా నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని ఆయన కోరారు.

## నారాయణపేట చేనేత చీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డికె అరుణ



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట్ చేనేత చీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, మరింత నైపుణ్యంలో తక్కువ సమయంలో ఎక్కువ చీరలను నేసి వ్యాపారం పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బిజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో నారాయణపేట్ చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకంలో భాగంగా 72 మంది చేనేత అధునాతన యంత్రాలు, పరికరాలు జక్కడ్స్, ఫ్రేమ్ లూన్, వైడింగ్ మిషన్, ఫిర్కం, డబ్బా, ఫిట్ లను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ నారాయణపేట్ లో నేసిన చేనేత చీరలకు మహారాష్ట్రలో డిమాండ్ ఎక్కువగా ఉందని, ఎక్కువ ఆదాయం పెంచుకోవాలన్నారు. నారాయణపేట్ చేనేత చీరలు మంచి క్వాలిటీతో ఉత్పత్తి అవుతున్నాయనీ ఎగుమతి చేయగలిగితే నేతన్నలు లాభం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, ఆర్డీవో రామచందర్ నాయక్, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు బాబు, సహాయ అభివృద్ధి అధికారి విజయ్ కుమార్ హెచ్‌డబ్ల్యూసిఎస్ కోటకొండ అధ్యక్షులు పగుడాకులు శ్రీనివాసులు, చిన్న జట్రాం చేనేత అధ్యక్షులు ఆంజనేయులు గాంధీ నగర్ సొసైటీ అధ్యక్షుడు బత్తుల సతీష్, క్లస్టర్ అధ్యక్షులు శ్రీనివాస్ నవిలే విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగువర్గాల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే కృషి



జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను శనివారం నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన సమావేశమందిరంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి డిఇఓ రమేష్‌కుమార్ ఇతర జిల్లా అధికారులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ అట్టడుగువర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహానీయురాలు సావిత్రిబాయిపూలే అన్నారు. జిల్లాలోని 15మంది ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైనవారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాలనాయకులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అధికారుల సమన్వయంతో పంచాయతీ ఎన్నికలు విజయవంతం :** అధికారుల సమన్వయంతోనే గ్రామపంచాయతీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మూడుదశల్లో నిర్వహించిన 2వసాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, విజయవంతం చేయడంలో ప్రతి అధికారి కృషి ఎనలేనిదని అన్నారు. శనివారం పట్టణంలోని ఓప్రైవేట్ ఫంక్షన్‌హాలులో గ్రామపంచాయతీ ఎన్నికల విజయోత్సవ అభినందన సభను జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న అన్నిశాఖల అధికారులు, అన్నిస్థాయిల అధికారులను సిబ్బందిని అభినందించారు.

## ఏడు అంశాలపై వైజ్ఞానిక ప్రదర్శన

డిఈఓ ప్రవీణ్ కుమార్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో అభివృద్ధి చెందిన స్వయం సమృద్ధి భారతదేశ కొరకు సాంకేతిక రంగాలైన సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ గణితం అంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ సైన్స్ అధికారి షంషీర్ అహ్మద్ తెలిపారు. జనవరి 5న జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ పల్లి లో ఉన్న ఫాతిమా విద్యాలయంలో ఇన్‌స్పైర్, బాల్ వైజ్ఞానిక ప్రదర్శిని 2025–2026 జరుగుతుందని వారు తెలిపారు. ప్రధాన అంశంతో పాటు ఏడు ఉప అంశాల పై ప్రదర్శనలు ఉంటాయని డీఈఓ తెలిపారు. సుస్థిర వ్యవసాయం వ్యర్థ పదార్థాల నిర్వహణ ప్రత్యామ్నాయ ప్లాస్టిక్ హరిత శక్తి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు వినోదపరితమైన గణిత నమూనాలు ఆరోగ్యం పరిశుభ్రత నీటి సంరక్షణ నిర్వహణ వంటి అంశాలపై ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రయోగాలను ప్రదర్శిస్తారని డీఈఓ డిఎస్ఓ తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలు ఈ ప్రదర్శనలో తమ ప్రదర్శనలు ఉంచవచ్చని తెలిపారు. డైట్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు టీచర్స్ ఎగ్జిబిట్స్ కింద తమ ప్రదర్శనలు ఉంచవచ్చని ప్రతి పాఠశాల నుంచి కనీసం రెండుకు తగ్గకుండా ప్రదర్శనలో ఉంచాలని సూచించారు. జనవరి 7,8,9 తేదీలలో కామారెడ్డిలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి పంపించబడతాయని జిల్లా సైన్స్ అధికారి తెలిపారు.ఒకేరోజు ప్రదర్శన ఎంపిక ఉంటుందని నిర్ణీత సమయానికి ఉపాధ్యాయులు వైజ్ఞానిక ప్రదర్శనకి రావాలని డిఎస్ఓ తెలిపారు.

## శతాబ్ది ఉత్సవాలకు సిఎం రాక



**ప్రజాపక్షం/జడ్చర్ల:** ఫిబ్రవరి 3వ తేదీన జడ్చర్ల మున్సిపాలిటీ బాదేపల్లి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనడానికి సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఖరారు అయ్యింది. ఈ సందర్భంగా శతాబ్ది ఉత్సవాల కమిటీ సభ్యులు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హైస్కూల్‌లో ఒక నెలలో చేపట్టాల్సిన పనుల వివరాలు కలెక్టర్ దృష్టికి తెగా పంచాయితీరాజ్ ఈఈని పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి సహకారంతో ఏర్పాట్లు ఊపందుకున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. కలెక్టర్ ను కలిసిన వారిలో శతాబ్ది ఉత్సవాల కమిటీ అధ్యక్షులు రవి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల కృష్ణ, ఉపాధ్యక్షులు పెద్ది బాలకృష్ణ, రమణాచారి, జయప్రకాష్, యంఈఓ మంజుల, ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, టీచర్లు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక నిల్వలు సీజ్

**ప్రజాపక్షం/పెబ్బేరు:** మండల పరిధిలోని అయ్యవారిపల్లి, బూడిదపాడు గ్రామం మధ్యలో అక్రమ ఇసుక నెలలు ఉన్నాయని విశ్వసనీయమైన సమాచారం మేరకు రెవెన్యూ పోలీసు యంత్రాంగం దాడి చేసి 50 ట్రిప్పుల ఇసుక నిల్వలను సీజ్ చేశారు. ఇటీవల కాలంలో ఇసుకకు విపరీతమైన కొరత నెలకొన్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో అక్రమ నిల్వలు పెరిగిపోయాయి. ఇసుక అక్రమ రవాణా దారులు అధిక ధరలకు ఇసుకను అమ్ముకుని అక్రమ అర్జన సాగిస్తున్నారు. దీంతో రెవెన్యూ పోలీసు యంత్రాంగాలు విస్తృతంగా దాడులు నిర్వహించి అక్రమ ఇసుక నిల్వలను సీజ్ చేసి జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం బహిరంగ వేలం వేస్తున్నారు. ఈ దాడిలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాఘవేంద్రరావు, ఆయా గ్రామ పరిపాలన అధికారులు, పెబ్బేరు రెండవ ఎస్సై చివ్వేల దివ్య, ఏఎస్ఐ శ్రీనివాసులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## కామ్రేడ్ నాగన్న స్ఫూర్తితో ప్రజల కోసం పోరాడాలి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** సిపిఐ వనపర్తి పట్టణ మాజీ కార్యదర్శి కామ్రేడ్ బొలెమోని నాగన్న స్ఫూర్తితో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. వనపర్తి భగత్ సింగ్ నగర్‌లో మరణించిన సిపిఐ మాజీ పట్టణ కార్యదర్శి బొలెమోని నాగన్న భౌతిక కాయంపై సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా నేతలు కళావతమ్మ, పృథ్వీనాథం, చిన్నకురుమన్న, జయమ్మ, వంశీ, ఎర్రన్న, తదితరులు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. నాగన్న అమర్‌హై, జోహార్ కామ్రేడ్ నాగన్న, నాగన్న ఆశయాలు సాధిస్తామని నినాదాలు చేశారు. వనపర్తిలో పార్టీ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడే అన్నారు. అనంతరం జరిగిన ప్రదర్శనలు పార్టీ నేతలు పాల్గొన్నారు. పార్టీ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, గోపాలకృష్ణ, ఎర్రకురుమన్న, జ్యోతి, వంశీ, శిరీష, కొండన్న, రాంబాబు, ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పొట్ట కొట్టొద్దు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని బొల్లంపల్లి చెరువునీటిని ఖాళీ చేయొద్దని పుట్టరాజేష్‌కుమార్ శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. బర్కత్‌పల్లినుంచి గానుగట్టుతండాకు వెళ్లే రహదారిలో నూతనంగా చేపడుతున్న వంతెన నిర్మాణానికి బొల్లంపల్లి చెరువులో ఉన్న నీటిని గుర్తు తెలియని వ్యక్తులు నీటిని తొలగించారని, చెరువు నీటిని తొలగించడం దుర్మార్గమైన చర్య అని, రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నీటిని ఖాళీచేసి రైతుల ఉసురు పోసుకోవద్దని మండిపడ్డారు. కొత్తచెరువు నీటిని ఖాళీ చేయడంవల్ల కొన్ని వందల ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, కనీసం మూడునెలల తర్వాత నీటిని ఖాళీచేస్తే పంటలకు, భూగర్భజలాలకు, రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చెరువు నీటిని తొలగించే విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను అందరిని కలుపుకొని ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమలో మాజీసర్పంచ్ ఉప్పు అపర్ణ తిరుమలరావు, మాజీ ఉపసర్పంచ్ రాజునాయక్, నాయకులు జగదీశ్వర్, గోవర్దన్, గ్రామరైతులు పాల్గొన్నారు.

## సైన్స్‌ఫెయిర్‌లో కీర్తనకు ప్రథమ స్థానం



**ప్రజాపక్షం/ఉట్కూర్:** నారాయణపేట్ జిల్లా బిజాపూర్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో చిన్న పొర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కీర్తన తన ప్రతిభను చాటుకుంది. ఆర్డునో ఆధారిత త్రిమితీయ ఆకారాలు అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టుతో పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయి మొదటి స్థానం సాధించింది. కీర్తన ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రశంసలు పొందింది. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన శక్తిని పెంపొందించేలా ఈ ప్రాజెక్టు ఉండటంతో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కీర్తనను అభినందిస్తూ, ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు.

## మహిళా సాధికారతను సాధిద్దాం









సావిత్రిబాయి పూలే వర్ధంతి సభలో పలువురు వ్యాఖ్య

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు భారత జాతీయ మహిళా సమాఖ్య ఎనలేని కృషి చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐ డబ్ల్యు కార్యదర్శి ఎం.ఇందిరాచ ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కమిటీ సభ్యులు మాధవి, ధన లక్ష్మి, మంజుల, మౌనిక, చెన్నమ్మ, సత్యమ్మ, ఎం. జ్యోతి, కె. చెన్నమ్మ, అవంతిక, కావేరి, బబ్బి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జడ్చర్ల:** మహిళలను చైతన్యవంతులను చేయడమే నా లక్ష్యమని స్త్రీలు చదువుకోవాలి. ఎదగాలి. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని స్త్రీల అభ్యుదయం కోసం కృషి చేసిన తీరును వారు అందించిన సేవలను స్మరించుకుంటూ సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయురాలి విగ్రహానికి పూలమాలలే వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపాలిటీ చైర్మన్ కోనేటీ పుష్పలత, నర్సింలు, కౌన్సిలర్ చైతన్య చౌహన్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మీనాజోద్దీన్, చాగంటి రఘు, తుంగ రఘు, వజీర్ రంగయ్య, అర్షద్, ఇంతియాజ్, పాల్గొని నివాళులర్పించారు.

**ప్రజాపక్షం/నారాయణపేట:** నారాయణపేట జిల్లా కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు స్ఫూర్తి డిగ్రీ కళాశాల లో బిసి జాగృతి సేన ఉపాధ్యక్షులు వెంకటేశ్ యాదవ్ , నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య, ఉద్యమకారుడు కృష్ణ, మద్దూరు మండల అధ్యక్షులు వెంకటయ్య, రాము, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మక్తల్:** అజ్ఞాన అంధకారాన్ని చీల్చి బడుగుల జీవితాల్లో అక్షరజ్యోతిని వెలిగించిన ఆదర్శ మూర్తి... సమాజ సంకెళ్లను తెంచి స్త్రీ విద్యకు శాశ్వత బాట వేసిన అపర సరస్వతి సావిత్రిబాయి పూలే అని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని తన నివాసంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చిట్టెం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, బిఆర్ఎస్ మక్తల్ పట్టణ అధ్యక్షులు చిన్నహన్మంతు, నాయకులు పసుల విష్ణువర్దన్ రెడ్డి, అన్వర్ హుస్సేన్, మన్నాన్, నేతాజీ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, మొగులప్ప, జె.సాగర్, ఎలిగండ్ల బాలప్ప, చందాపూర్ అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అడ్డాకుల:** అడ్డాకుల మండల వనరుల కేంద్రంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులుగా మండల విద్యాధికారి వి.ప్రకాష్, గ్రామసర్పంచ్ దశరథ రెడ్డి, ఉపసర్పంచు సాయి సాగర్ కాంప్లెక్స్ హెచ్ఎం జి.జ్యోతి కందూర్ కాంప్లెక్స్ హెచ్ఎం మురళీధర్ రావు, జిహెచ్ఎంలు ఫయాజుద్దీన్ ఎఫ్ఎసిహెచ్ఎం రాజలక్ష్మి , యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, టీటీయు జిల్లా అధ్యక్షులు జుర్రు నారాయణ యాదవ్, బిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌శంకర్, పిఆర్‌టియు మండల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, టాపస్ మండల అధ్యక్షులు రమేష్ గౌడ్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు చెన్నయ్య, టిటియు మండల బాధ్యులు ఆంజనేయులు, సుమన్, భాస్కర్, మండల స్ట్రాంగ్ టీచర్ దండు రాఘవ తదితర ఉపాధ్యాయులందరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 60 మంది మహిళ ఉపాధ్యాయులకు సన్మానించారు.

**ప్రజాపక్షం/నర్వ:** నర్వ మండల పరిధిలోని రాయికోడ్ సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహ నిర్మాణ కమిటి ఆధ్వర్యంలో గ్రామంలోని సావిత్రిబాయి జ్యోతిరావు పూలే విగ్రహాలకు అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షులు మల్లన్ కోటి శంకర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు యం.మల్లేష్ పాల్గొన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాళ్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. నర్వ మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ప్రైవేటు పాఠశాలల్లో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు మ్యతరీ గోపాల్, రాయికోడ్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినిలు, గ్రామ పెద్దలు, కేవన్ స్వామి, ఖజామైనోద్దీన్, జబ్బార్, బుడ్డ ఎల్లప్ప, వార్డు సభ్యులు, గడ్డమీది శ్రీను, అజయ్, రాము, నరసింహ, పుల్లరి ఆనంద్, ఎద్దుల అంజి, కే.సురేందర్ గౌడ్, రంగప్ప, గుడ్డి నర్సింలు, వెంకటయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మాగనూర్ :** మండల పరిధిలోని నేరడగం గ్రామంలో మహాత్మా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దాసరి వెంకటమ్మ సావిత్రి బాయి పటానికి పూలమాల వేసారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి రాజా, వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మాగనూర్ :** మహిళా విద్య, సామాజిక సమానత్వం, బహుజనుల హక్కుల కోసం నిరంతరం కృషి చేసి అందరికీ ఆదర్శ ప్రాయమైన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా మాగనూర్ మండలంలోని ఎమ్మార్పీ కార్యాలయంలో నిర్వహించారు. మండల విద్యాధికారి మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో టీఆర్టీయూ టిఎస్ మాగనూర్ మండల శాఖ వారు శాలువాతో సన్మాంచి, మెమెంటోను అందజేశారు. పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మురళీధర్ రెడ్డి, మాగనూరు మండల పిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు బలరాం, తిమ్మన్న, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రశాంత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్య, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, సంజన, అనిత, శాంతి లక్ష్మి , నీరజ, శశిరేఖ, ప్రశాంతి, భవ్య శ్రీ, అరుణ, హరి ప్రియ, సోనీ, సౌజన్య, రాజేశ్వరి, శిరీష, వెంకటలక్ష్మి , మమత,అనిత, హుస్సే సాబ్, వంశీ, వెంకటేష్, వినోద్, రవి లక్పతి నాయక్, తుల్జా నాయక్, రమేష్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వంగూర్ :** భారతదేశంలో మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను మండలకేంద్రంతోపాటు మండలపరిధిలోని చింతపల్లి, ఎల్లమ్మ, రంగాపూర్ తదితర గ్రామాలలో శనివారం ప్రభుత్వ పాఠశాలలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సర్పంచ్ క్యామ మల్లయ్య సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతపల్లి పాఠశాల హెచ్ఎం చిన్నయ్య, నాగభూషణం, రాజేష్‌గౌడ్, రంగాపూర్ ఉపసర్పంచ్ రామస్వామి, వార్డుమెంబర్లు ఉదయ్‌కుమార్, లక్ష్మ య్య, రంగాపూరం పాఠశాల ఉపాధ్యాయులు జంగ య్య, మల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అచ్చంపేట :** మహనీయురాలు సావిత్రిబాయిపూలే జయంతి ఉత్సవాలను శనివారం అచ్చంపేట నియోజకవర్గంలో గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. పట్టణంలో జ్యోతిబాపూలే అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్‌విగ్రహం వద్ద నివాళులర్పించారు. లింగాల, బల్మూర్, అమ్రాబాద్, పదర పట్టణాలలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహం ముందు దళితసంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దళితసంఘాల నాయకులు జంగిలి నిరంజన్, ముదిగొండ రమేష్, రామాంజనేయులు, జంగిల్‌ప్రవీణ్, పెద్దయ్య, మంగళగిరి సత్యం, నాగయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** భారత ఆధునిక సాంఘీక విప్లవకారిణి, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతిని వీపనగండ్ల, బొల్లారం, గోపాల్‌దిన్నె గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సర్పంచు మీసాల పర్వతమ్మ, తాసిల్దార్ వరలక్ష్మి, ఎస్సై కే.రాణి, ఎంఈఓ నరసింహ పాఠశాల సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. బొల్లారంలో గ్రామ సర్పంచు గొంది సుదర్శన్ రెడ్డి, గోపాల్ దిన్నెలో గ్రామ సర్పంచు దొడ్ల కవిత సావిత్రి బాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపసర్పంచులు బాలపీర్, శ్రీనివాస్ గౌడ్, పోగుల వెంకటయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మల్లయ్య మరణం సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన గుండు మల్లయ్య మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర అన్నారు. శనివారం మల్లయ్య పార్థివ దేహంపై సిపిఐ జెండాను కప్పి నివాళులర్పించి మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి పార్టీ ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా క్రమశిక్షణ కలిగిన వ్యక్తి మల్లయ్య అని అన్నారు. పిఏసిఎస్ సుద్దాల వైస్ చైర్మన్‌గా, గ్రామ పంచాయతీ వర్డు రోగా ఎనలేని కృషి చేశారని అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు శ్రీను, స్వామి, చంద్రయ్య, కొమురయ్య, జోసెఫ్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి వారధి పత్రికలే

మోటకొండూర్ ఎస్సై డి.అశోక్



**ప్రజాపక్షం/మోటకొండూరు :** ప్రజలకు ప్రభుత్వానికి వారధి పత్రికలేనని, నిజాన్ని నిర్భయంగా రాయడంలో విలేకరుల పాత్ర చాలా గొప్పదని మోటకొండూర్ ఎస్సై డి.అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న కుళ్ళు కుతంత్రాలను వెలికి తీయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఓలపై సబ్ కలెక్టర్ అసంతృప్తి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై జరుగుతున్న సమావేశానికి బీఎల్‌వోలు రాకపోవడం పట్ల సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కాన్ఫరెన్స్ ఓపెన్ హాలులో జరిగిన మిర్యాలగూడ పట్టణం, మండలం బూత్ స్థాయి అధికారుల రెండో రోజు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా పేపర్ వర్క్ పూర్తి చేయనిది అవగాహన రాదని, హాజరు కావాలని సంబందిత అధికారులు పిలిపించాలని కోరారు. పేపర్ వర్క్ తరువాత ఇంటింటికి తిరిగి జాబితాలో ఉన్న లేని వారిని గుర్తించి చేర్పులు మార్పులు చేయాలన్నారు. మిర్యాలగూడ మండలం, పట్టణ పరిధిలో 60శాతం ఉందని అన్నారు. అన్ని మండలాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు. మిర్యాలగూడ పట్టణం, మండలంలో మ్యాపింగ్ వేగవంతం చేయాలన్నారు. అన్ని మండలాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. బీఎల్‌వోలు అయిన అంగన్‌వాడి టీచర్లు బాధ్యతగా పనిచేయాలని సీడీపీవో రేఖల మమత అన్నారు. సమావేశంలో కార్యాలయ పరిపాలన అధికారి, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, గణాంక అధికారి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కార్మికుల విముక్తికి సిపిఐ పోరాటాలు



**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్):** ఖమ్మం జిల్లాలో ఈనెల 18నజరిగే సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.కనగల్ మండల కేంద్రంలో బహిరంగ సభ కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ కాన్పూర్ లో డిసెంబర్ 25,1925సంవత్సరంలో ఆవిర్భావించి పేద ప్రజల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించారాని అన్నారు. ఎన్ని నిర్బంధాలు చేసిన జైలలో పెట్టిన అలుపెరగకుండా కార్మిక విద్యార్థి యువజన రైతు మహిళా ప్రజా సంఘాల నిర్మించి వ్యక్తచాకిరి విముక్తి కొరకు కార్మికులు కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు సిపిఐ నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, సహాయ కార్యదర్శి దోటి పండరి, నాయకులు జోగు సురేందర్, కట్ట యాదయ్య, రామ కోటి, జోగు ప్రభాకర్ ఉన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. శనివారం ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం కోసం ఆటో కార్మికులు తరలి వెళ్తుండగా హుజూర్‌నగర్ లో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లడం జరిగింది. వారికి సంఘీభావంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గతంలో ఉన్న గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ఐదు లక్షలకు కొనసాగించాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ఆటో కార్మికులు వీధిన పడ్డారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆటో మీటర్ చార్జీలు పెంచుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మాకు అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు నెలకు 15వేలు ఇస్తానన్న సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఎస్‌కె రఫీ, బైరు సతీష్, చింతకాయల గోపి, పులిపాటి నాగేశ్వరరావు, సైదులు, ముల్కలపల్లి వినోద్, వెంకన్న, శివాజీ, కళింగ, వెంకటయ్య, సిహెచ్ వెంకట్రావ్, పందిరి వెంకన్న పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్‌ఎస్‌పి కాల్వకు మరమ్మతులు చేపట్టాలి

ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రజా సమస్యలపైనే జాగృతి జనం బాట అని ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం ఆమె జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ అనిరెడ్డి రాజేంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా స్వాగతించి ఆలయంలో సన్మానించారు. అనంతరం ఆమె స్థానిక కెజిబివి పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలెబోయిన కిరణ్ కుమార్ కవితకు గత పది సంవత్సరాల నుండి పాఠశాలలో విద్యార్థులు వర్షాకాలంలో ఇబ్బందులకు లోన్‌అవుతూ జ్వరాల బారిన పడుతున్నారని అధికారులు ఒకట్రెండు సెలవులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని తెలుపుగా అధికారులు పాఠశాలకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని ఆమె డిమాండ్ చేశారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీతారాంపురం గ్రామం వద్ద గల ఎస్‌ఆర్‌ఎస్‌పి కాల్వను పరిశీలించారు. పూర్తిగా చెట్ల మయమైందని అధికారులు నీటిని విడుదల చేయకముందే పూర్తి మరమ్మత్తును చేపట్టి రైతులకు నీటిని అందించాలన్నారు. ఆమె వెంట జాగృతి రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, అంజిరెడ్డి, చిరంజీవి, వెంకట్, మధు, రమణ, యాదగిరి పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సును కాంక్షిస్తున్న 'ప్రజాపక్షం'

పత్రికా స్వేచ్ఛకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

క్యాలెండర్ ఆవిష్కరణలో భువనగిరి ఎంపి చామల



**ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి :** 'ప్రతి అక్షరం.. ప్రజల పక్షం' అనే నినాదంతో, ప్రజా సమస్యలే ఇతివృత్తంగా వస్తున్న ప్రజాపక్షం తెలుగు దినపత్రిక అనతి కాలంలోనే మీడియా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాపక్షం పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ను క్యాంపు కార్యాలయంలో చామల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పత్రికా రంగంలో వస్తున్న మార్పులను, ప్రజాపక్షం పోషిస్తున్న పాత్రను కొనియాడారు. ప్రజా గొంతుక: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాపక్షం ముందు వరుసలో ఉందన్నారు. కేవలం వార్తలకే పరిమితం కాకుండా, సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ పత్రిక పనిచేస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.'ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన పత్రికా స్వేచ్ఛకు ఎలాంటి భంగం వాటిల్లకుండా మా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన జర్నలిజాన్ని అందించడం సవాలుతో కూడుకున్న పని అని, ప్రజాపక్షం ఆ విలువలను కాపాడుతూ దూసుకుపోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ దుడుక రామకృష్ణ, భువనగిరి రిపోర్టర్ బొబ్బిలి ఉమామహేశ్వర్, భువనగిరి రూరల్ రిపోర్టర్ కనుక బాలకృష్ణ, పోచంపల్లి రిపోర్టర్ దేవరకొండ ఆశోక్, తుర్కపల్లి రిపోర్టర్ కొలనుపాక కొండల్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర నకిలీ బంగారం దొంగల ముఠా అరెస్ట్

రూ.1.5లక్షల నగదు,6 సెల్ ఫోన్స్, అర కేజీ నకిలీ బంగారం స్వాధీనం

నల్లగొండ డిఎస్‌పి కె.శివరాంరెడ్డి



**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** నకిలీ బంగారం ముఠాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాంరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్ టౌన్ పరిధిలోని నెహ్రూ గంజ్ ప్రాంతంలోని వినాయక కిరాణా షాపు వద్దకు ఇద్దరు వ్యక్తులు కిరాణా సామాను తీసుకొని,షాప్ యజమానితో పరిచయం చేసుకొని, మాటలు కలిపి పాత బంగారం తక్కువ ధరకు రూ.15 లక్షల విలువైన బంగారం కేవలం రూ.5లక్షలకు ఇస్తామని నమ్మించి,బ్యాంకు వద్దకు తీసుకెళ్లి రూ.5 లక్షలు డ్రా చేయించి మోసం చేసి నకిలీ బంగారం అంటగట్టిన విషయంలో కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు.వన్ టౌన్, సీసీఎస్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఈనెల 2న ప్రకాశం బజార్ లో నమ్మదగిన సమాచారం మేరకు పట్టుబడి చేసి విచారించగా రాజస్థాన్‌కు చెందిన నేరస్తులు నల్లగొండ పట్టణంలో ప్లాస్టిక్ వస్తువుల అమ్మకం పేరుతో కతాలగూడెం శివారులో గుడిసెలు వేసుకొని వారి కుటుంబ సభ్యులతో ఉంటూ, అమాయక ప్రజలను నకిలీ బంగారం పేరుతో మాయమాటలు చెప్పి డబ్బులు సంపాదించాలనే పథకం వేశారని తెలిపారు.ఏ1రమేశ్,ఏ2 పురన్ కుమార్‌లు పరారీలో ఉన్నారు.ఏ 3 రాజా రామ్,ఏ 4 మహేంద్ర కుమార్,ఏ 5మానా రామ్,ఏ6 సురేశ్ కుమార్,ఏ7 దేవా రాజ్ లు గత నెల రోజుల క్రితం వారి వద్ద నుండి1.5 లక్షల నగదు,5సెల్ ఫోన్ లు,అర కేజీ నకిలీ బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ప్రస్తుత కాలంలో కొందరు అపరిచిత వ్యక్తులు కేటుగాళ్ళు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని నకిలీ బంగారం పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని ఇటువంటి మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కేసులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి,సీసీఎస్ ఎస్ఐ విజయ్ కుమార్,వన్ టౌన్ ఎస్సైలు లచ్చిరెడ్డి,వెంకట నారాయణ,సిబ్బంది విష్ణు, రబ్బానీ,అంజయ్య,సిసిఎస్ సిబ్బంది వహీద్,దస్తగిరి,మహేశ్,నాగరాణి తదితరులను అభినందించారు.

# మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపాలిటీలలో వార్డుల వారీగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాను పునః పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం మినీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్, ఎస్పీ ఆకాంక్షశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, పోలీస్, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో ఏలాంటి తప్పులు లేకుండా నూటికి నూరు శాతం పారదర్శకంగా ఉండాలని, అందువల్ల ఈ నెల 1న మున్సిపల్ వార్డుల వారిగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాను మున్సిపల్ కమిషనర్లు, బిఎల్‌ఓలు, వార్డ్ ఆఫీసర్లు పునః పరిశీలన చేయాలని చెప్పారు. ప్రస్తుతం ప్రచురించిన ఓటరు జాబితా ఈసీఐ ఆదేశాల మేరకు తయారు చేయాలన్నారు. ఆయా వార్డుల వారిగా రూపొందించిన ఓటరు జాబితాలో ఓటర్ల వివరాలు ఇంటి నెంబర్ల ప్రకారం ఉన్నాయో లేదో చూడాలన్నారు. ఒక వార్డులోని కుటుంబ సభ్యులు అదే వార్డులో ఉండేలా చూడాలని, ఒక వార్డులో నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ ఓటర్లు లేకుండా చూడాలని, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గుర్తించిన రిటర్నింగ్ అధికారులు చురుకుగా, పూర్తి అవగాహనతో ఉండేవారిని ఎంపిక చేయాలని అన్నారు. ప్రస్తుతమున్న ఓటరు జాబితాలో ఎట్టి పరిస్థితులలో సవరణకు అవకాశం లేదన్న విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని ఆయన వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని, అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని, జనవరి 10వ తేదీన తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, సదుపాయాలను పరిశీలించాలని అన్నారు. అవసరమైన చోట కనీస సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ర్యాంపు వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఎలక్షన్ పోలీస్ అధికారులు శాంతి భద్రతల విషయంలో షెడ్యూల్ వెలువడిన నాటి నుండి, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ యస్.పి లక్ష్మి నారాయణ, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## సావిత్రిబాయి పూలే ఆశయాలతోనే మహిళల అభివృద్ధి

జాతీయ మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే ఆశయాలతోనే మహిళల అభివృద్ధి జరుగుతుందని జాతీయ మహిళ సమాఖ్య సూర్యాపేట జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే సమాజం మార్పు చెందుతుందని సావిత్రిబాయి పూలే నమ్మేవారన్నారు. ఆమె బాటలో ప్రయాణించడంతోనే మహిళల సాధికారిక సాధ్యమవుతుందని తెలిపారు. మహిళ సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు పశ్య పిచ్చమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేవరం సుజాత, వీరమ్మ, సిగనం, అరుణ, వెంకటమ్మ, పశ్య సారిక, లక్ష్మి, విమలమ్మ, వెంకటమ్మ, రాధ, ఎస్‌కె జాన్‌బీ, పుల్లమ్మ, మీరాబీ, ఎస్‌కె పాతిమా, లక్ష్మమ్మ, మంగమ్మ, మాధవి పాల్గొన్నారు.

## మహిళల చదువు, అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి




**ప్రజాపక్షం/దేవరకొండ:** మహిళల చదువు, అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిబాయిపూలే ఆశయ సాధనకు నేటి విద్యార్థులు, యువత కృషి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ దేవరకొండ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, మహిళా సమాఖ్య డివిజన్ అధ్యక్షురాలు లింగం పల్లి అనితలు అన్నారు. సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సావిత్రిబాయిపూలే జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్స వంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్, మహాళా సమాఖ్య నాయకులు మణికన్న, సంతోష్, అనసూయ, ధనలక్ష్మి , బొజ్జమ్మ, వంశీ, వెంకటయ్య పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ అన్నారు. శనివారం ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా ఇమ్రాన్ ఇంటి వద్ద ఉదయం పోలీసులు ఆరు గంటలకు వచ్చి ప్రివెంటివ్ అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలలో ప్రయాణికులు ఎవ్వరు ఎక్కడం లేదని దీనివల్ల ఆటో డ్రైవర్లు తమ పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి కిరాయిలు, ఆటో ఇన్సూరెన్స్, ఇన్‌స్టాల్మెంట్ కట్టలేక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12000, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు పూర్తి అయినా నేటికీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు గనబోయిన వెంకటేష్ (రాణా), ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్ పాల్గొన్నారు.





## బాల్య వివాహాల చట్టాలపై అవగాహన




**ప్రజాపక్షం/చివ్వెంల :** బాల్ వివాహ ముక్త్ భారత్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి తెలిపారు. శనివారం బాల్య వివాహాల నివారణ, బాల్య వివాహ నిషేధ చట్టం 2006 అమలు కోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో సూర్యాపేట జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఒక మనిషికి తినడానికి తిండి, వేసుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు అదేవిధంగా మంచి విద్య, ఉద్యోగం తర్వాత వివాహం అనేది ముఖ్యమన్నారు. దానికి ఒక నిర్దేశిత వయస్సు అనేది నిర్ధారించబడిందని అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు అంతకు ముందు పెళ్ళి చేసుకుంటే అది బాల్య వివాహం కిందికి వస్తుందని అలాంటప్పుడు వాళ్ళు శిక్ష అర్హులు అవుతారని హెచ్చరించారు. చిన్న వయస్సులో పెండ్లి చేసుకోవడం ద్వారా చాలా రకాల సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కొంపల్లి లింగయ్య, సుంకరబోయిన రాజు, గుంటూరు మధు, గూడేటి వెంకన్న, కృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా, సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని, మహిళలు విద్యా వంతులు అయితే ఆ కుటుంబం అన్ని విధాలుగా మంచిగా ఉంటుందని అన్నారు. మహిళలు సావిత్రి భాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉత్తమ విద్యా బోధనలు అందించిన మహిళా ఉపాధ్యాయనియులకు సన్మానం చేశారు.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఉదయమే అయన నల్గొండ మున్సిపాలిటీలో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. వార్డ్ నెంబర్ 28 (శ్రీ కృష్ణ నగర్) లో శానిటేషన్ సిబ్బంది చేస్తున్న మురికి కాలువల శుభ్రం,పారిశుధ్య పనులను పరిశీలించారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని,వీధులలో,రోడ్లపై ఎవరు చెత్త వేయకుండా చూడాలని, ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధిస్తామని చెప్పాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు .వార్డు ప్రజలతో ఆయన ముఖాముఖి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ ఎలా ఉందని? మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా వస్తున్నాయా లేదా..అని వాకబు చేశారు.అనంతరం కమిషనర్ తో మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, అలాగే మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ యాదవ సంఘం భవనం వెనుక ఉన్న మోతికుంట బండ్ పునరుద్ధరణకు అమృత్2 పథకం కింద నిధులు మంజూరు కాగా బండ్‌ను పరిశీలించారు.మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.

**సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళా విద్యకు కృషి**


సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళా విద్యకు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.సావిత్రిబాయి పూలే 159వ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

**డిఎస్‌ఈ పై దృష్టి పెట్టాలి :** ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ ఐ ఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా రోజు వారీ ఎంట్రీల లక్ష్యాన్ని నిర్దేశించుకొని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు,ఆర్ డి ఓ లతో మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ప్రతి బిఎల్‌ఓ ప్రతి రోజు 40 ఎంట్రీలు చేయాలన్నారు. భూ భారతి పై వచ్చేవారం తహసీల్దార్ లతో సమావేశం నిర్వహిస్తానని చెప్పారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్,ఆర్‌డిఓ లు వై .అశోక్ రెడ్డి,రమణా రెడ్డి,శ్రీదేవి,తదితరులు ఉన్నారు.

# క్రీడ

## తొలి శతకంతో రెచ్చిపోయిన పాండ్యా!

### ఒకే ఓవర్లో 6, 6, 6, 6, 6, 4..




భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరోసారి రెచ్చిపోయాడు. ఈమధ్యే దక్షిణాఫ్రికాపై మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడిన పాండ్యా.. విజయ్ హజారే ట్రోఫీ లోనూ పూనకం వచ్చినట్టు చెలరేగాడు. లిస్ట్–ఏ క్రికెట్‌లో విధ్వంసక ఆటతో మొట్టమొదటి సెంచరీ బాదేశాడీ హిట్టర్. బరోడా తరఫున బరిలోకి దిగిన ఈ చిచ్చరపిడుగు విదర్భ బౌలర్లకూ చుక్కలు చూపిస్తూ 68 బంతుల్లోనే శతక గర్జన చేశాడు. హిట్టర్గందు హార్దిక్ పాండ్యా వేరయా అనే మాట మనకు తెలిసిందే. ముఖ్యంగా టీ20లు అంటే చాలు తనలోని విధ్వంసక ఆటగాడిని బయటకు తీసుకొస్తాడీ క్రికెటర్. ఆసియా కప్ తర్వాత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పునరాగమనం చేసిన అతడు వస్తూ వస్తూనే అర్ధ శతకంతో రెచ్చిపోయాడు.

అనంతరం సఫారీలకు తన బ్యాట్ పవర్ చూపించిన పాండ్యా.. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీలోనూ ఊచకోత కోశాడు. విదర్భ బౌలర్లను హడలెత్తించిన బరోడా స్టార్.. స్పిన్నర్ రెఖాడే వేసిన 39వ ఓవర్లో మరింత రెచ్చిపోయాడు. వరుసగా 6, 6, 6, 6, 6, 4 బాది 34 రన్స్ పిండుకున్నాడు. బంతి గమ్యం బౌండరీయే అన్నట్టుగా విధ్వంసం సృష్టించిన పాండ్యా 68 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. లిస్ట్ – ఏ క్రికెట్‌లో అతడికిది తొలి శతకం కావడం విశేషం.

## ఐపిఎల్ నుంచి బంగ్లా పేసర్ ఔట్



బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక ఘటనల ప్రభావం ఐపిఎల్ ఫ్రాంచైజీపై పడింది. ఇటీవలే మినీ వేలంలో భారీ ధరకు పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కొనుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్‌కు బిసిసిఐ కీలక ఆదేశాలిచ్చింది. బంగ్లాలో హిందువుల హత్యల నేపథ్యంలో ముస్తాఫిజుర్‌ను ఐపిఎల్ 19వ సీజన్‌లో ఆడించవద్దని కోల్‌కతాకు స్పష్టం చేసింది. వెంటనే ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌ను స్క్వాడ్ నుంచి తప్పించాలని షారుక్ ఖాన్ సహ యజమానిగా ఉన్న కేకేఆర్‌కు బిసిసిఐ అల్టిమేటం జారీ చేసింది. ఐపిఎల్ 19వ సీజన్‌లో బంగ్లాదేశ్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఆడడంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. బంగ్లాలో హిందువులపై దాడులు, హత్యలను నిరసిస్తూ.. ఐపిఎల్‌లో ముస్తాఫిజుర్‌పై వేటు వేసింది బిసిసిఐ. 'ఇటీవల బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులను గమనిస్తున్న బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌కు చెందిన ముస్తాఫిజుర్‌ను స్క్వాడ్ నుంచి తప్పించాలని కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఆదేశించింది. అతడి స్థానంలో మరొకరిని తీసుకునేందుకు అనుమతిస్తామని కోల్‌కతాకు చెప్పింది' అని బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించాడు. బంగ్లాదేశ్‌లో తాజాగా నెలకొన్న హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా ఆ దేశస్థుడైన ముస్తాఫిజుర్‌పై ఐపిఎల్‌లో వేటు వేయాలనే డిమాండ్లు వచ్చిన విషయం తెలిసిందే. ముస్తాఫిజుర్‌ను వేలంలో కొనడంపై ఈమధ్యే ఆధ్యాత్మిక గురువు దేవకీనందన్ థాకూర్ మండిపడ్డారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక ఘటనలు జరుగుతున్నందున.. ఐపిఎల్‌లో ఆ దేశస్థుడిని ఆడించాలనకుంటున్న కోల్‌కతా నైట్ రైడర్స్ సహ యజమాని షారుక్ ఖాన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. దాంతో.. అతడిని ఐపిఎల్ నుంచి తప్పిస్తూ బిసిసిఐ నిర్ణయం తీసుకుంది.

### రూ.9.20 కోట్లకు

డిసెంబర్ 19న అబుధాబీలో జరిగిన మినీ వేలంలో ముస్తాఫిజుర్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.9.20 కోట్లకు కొన్నది. గతంలో పలు ఐపిఎల్ జట్లకు ఆడిన ముస్తాఫిజుర్ 60 మ్యాచుల్లో 65 వికెట్లు తీశాడు. చెన్నై సూపర్ కింగ్స్(2024), ఢిల్లీ క్యాపిటల్స్(2022–23), రాజస్థాన్ రాయల్స్(2021), ముంబై ఇండియన్స్(2018) వంటి ఫ్రాంచైజీల జెర్సీతో ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ బరిలోకి దిగాడు.

## వన్డే సిరీస్‌కు ఎంపికైన పంత్, అయ్యర్.. సిరాజ్‌కు పిలుపు!

వచ్చే వన్డే ప్రపంచకప్ సన్నద్ధతలో భాగంగా న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. రెగ్యులర్ సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ప్లీహం గాయం నుంచి కోలుకున్న శ్రేయాస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. రెండో వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్‌కు చోటు దక్కింది. అయితే.. దేశవాళీలో వికెట్ల వేట కొనసాగిస్తున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమీని అజిత్ అగార్కర్ బృందం మరోసారి పక్కన పెట్టేసింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన టీమిండియా కొత్త ఏడాది తొలి సిరీస్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. కివీస్‌తో జనవరి 11 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. దాంతో.. ఈ సిరీస్ కోసం శనివారం సెలెక్టర్లు శుభ్‌మన్ గిల్ సారథిగా స్క్వాడ్‌ను ప్రకటించారు. ఆస్ట్రేలియా, సఫారీలపై



.. దేశవాళీలోనూ దంచేసిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను కొనసాగించిన సెలెక్టర్లు.. గాయం నుంచి కోలుకున్న శ్రేయస్ అయ్యర్‌ను తిరిగి తీసుకున్నారు. రెండో వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్‌ను ఎంపిక చేశారు.

**భారత స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రిషభ్ పంత్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, సిరాజ్, హర్షిత్ రానా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, నితీశ్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్.

విశాఖ వన్డేలో శతకం బాదిన యశస్వీ జైస్వాల్‌కు బ్యాకప్ ఓపెనర్‌గా చోటు దక్కింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో సెంచరీతో మెరిసిన ఇషాన్ కిషన్, వికెట్లతో చెలరేగిన మహ్మద్ షమీలను మాత్రం పక్కన పెట్టేశారు. కివీస్‌తో పొట్టి సిరీస్ కూడా ఉన్నందున సీనియర్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చారు. పేస్ బౌలింగ్ భారాన్ని ప్రసిధ్, హర్షిత్, అర్ష్‌దీప్ సింగ్‌లు మోయనుండగా.. స్పిన్నర్లుగా కుల్దీప్, సుందర్, జడేజాలు స్క్వాడ్‌లోకి వచ్చారు. భారత్, న్యూజిలాండ్ మధ్య జనవరి 11న వడోదరలో తొలి వన్డే, 14న రాజ్‌కోట్‌లో రెండో వన్డే, జనవరి 16న ఇండోర్‌లో మూడో వన్డే జరుగుతాయి. అనంతరం నాగ్‌పూర్ వేదికగా జనవరి 21 నుంచి టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది.

# ఫోకస్ బిజినెస్

## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 85,762.01 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,041.45 పాయింట్లు. లాభం 720.56 పాయింట్లు). జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్): నిఫ్టీ 26,328.55 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,042.30 పాయింట్లు. లాభం 287.10 పాయింట్లు).

**బులియన్ మార్కెట్**

(10 గ్రాముల బంగారం ధర)
24 క్యారెట్లు: రూ. 1,37,380
22 క్యారెట్లు: రూ. 1,25,932
18 క్యారెట్లు: రూ. 1,03,035

## యూరోజోన్‌లో బల్గేరియా

బల్గేరియా 2026 జనవరి 1 నుండి అధికారికంగా యూరో కరెన్సీని స్వీకరించి, యూరో జోన్‌లో 21వ సభ్యదేశంగా మారింది. దేశం యూరోపియన్ యూనియన్‌లో చేరిన 19 సంవత్సరాల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. జనవరి చివరి వరకు లేవ్, యూరోతో పాటు చట్టబద్ధ చెల్లింపు మాధ్యమంగా కొనసాగుతుంది. ఫిబ్రవరి 1 నుంచి యూరో మాత్రమే అధికారిక కరెన్సీగా ఉంటుంది. 2026 ఆగస్టు 8 వరకు ధరలు యూరోలు, లేవాలలో రెండింటిలోనూ పేర్కొంటారు. జనవరి నెల అంతటా,



రిటైల్ దుకాణాల్లో ప్రజలు లేవా లేదా యూరోలలో, ఏ రకంగానైనా నగదు చెల్లింపులు చేయవచ్చు. అయితే వ్యాపారులు చిల్లర మొత్తాన్ని పూర్తిగా ఒకే కరెన్సీలోనే ఇవ్వాలి. సాధారణంగా యూరోలలో,తాత్కాలికంగా అందుబాటు లేకపోతే లేవాలలో ఇవ్వవచ్చు. ఒకే లావాదేవీలో రెండు కరెన్సీల మిశ్రమ చెల్లింపులను స్వీకరించాలా వద్దా అన్నది రిటైలర్ల నిర్ణయానికి వదిలివేశారు. అయితే ఆ నిర్ణయాన్ని దుకాణంలో స్పష్టంగా కనిపించే చోట ప్రదర్శించాలి. సాంకేతిక సర్దుబాట్లు పూర్తయ్యాక, ఎటిఎంల నుంచి నగదు ఉపసంహరణలు యూరోలలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. 2026 మొత్తం సంవత్సరంలో, దేశవ్యాప్తంగా వాణిజ్య బ్యాంకుల్లో ప్రజలు లేవాలను యూరోలుగా మార్పిడి చేసుకోవచ్చు. మధ్య సంవత్సరం వరకు ఎటువంటి ఫీజులు లేదా కమిషన్ వసూలు చేయరు. ఆ తర్వాత బ్యాంకులు మార్పిడి ఫీజులు విధించే అవకాశం ఉంది. అలాగే 2026లో బల్గేరియన్ పోస్టుల శాఖల్లోనూ లేవాలను యూరోలుగా మార్పిడి చేసుకోవచ్చు. బల్గేరియన్ నేషనల్ బ్యాంక్‌లో అయితే లేవాలను యూరోలుగా ఉచితంగా మార్పిడి చేస్తారు.




## భారత బీమా రంగానికి పొంచి ఉన్న ప్రమాదం!

భారత దేశంలోని ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)ని అనుమతించడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. దీని వల్ల ఇన్సూరెన్స్ సంస్థలపై పూర్తిగా విదేశీ కంపెనీల ఆధిపత్యం పెరుగుతుంది. దీంతో పాలసీ నిర్ణయాలు భారత అవసరాలకన్నా విదేశీ కార్పొరేట్ ప్రయోజనాల ప్రకారమే తీసుకునే ప్రమాదం ఉంది. లాభాల విదేశీ ప్రవాహం భారత ప్రజలు చెల్లించే ప్రీమియంల ద్వారా వచ్చిన భారీ లాభాలు డివిడెండ్లు, రాయల్టీల రూపంలో విదేశాలకు తరలిపోతాయి. దీని వల్ల దేశీయ మూలధనం బయటకు వెళ్లి, భారత ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులుగా మళ్లీ వినియోగం తగ్గుతుంది. సామాజిక లక్ష్యాల నిర్లక్ష్యం ఇన్సూరెన్స్ రంగం కేవలం లాభాపేక్ష కాదు... రైతులు, పేదలు, అసంఘటిత రంగ కార్మికులకు రక్షణ కల్పించాల్సిన సామాజిక బాధ్యత కూడా ఉంది. విదేశీ కంపెనీలు అధిక లాభాలున్న పట్టణ ప్రాంతాలు, కార్పొరేట్ కస్టమర్లపైనే దృష్టి పెట్టి, గ్రామీణ–పేద వర్గాలను నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంది. ప్రీమియంల పెరుగుదల ప్రమాదం లాభాలు గరిష్ఠం చేయాలనే ఉద్దేశంతో విదేశీ ఆధిపత్య సంస్థలు ప్రీమియంలను పెంచే అవకాశం ఉంది. దీని వల్ల మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై ఆర్థిక భారం పెరుగుతుంది. దేశీయ సంస్థలకు పోటీ నష్టం భారీ మూలధనం, అంతర్జాతీయ నెట్‌వర్క్ ఉన్న విదేశీ కంపెనీలతో దేశీయ ఇన్సూరెన్స్ సంస్థలు పోటీ పడలేక బలహీనపడే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో దేశీయ కంపెనీలు మార్కెట్ నుంచి తప్పుకునే ప్రమాదం ఉంది. ఉద్యోగ భద్రతకు ముప్పు ఖర్చు తగ్గింపు విధానాల్లో భాగంగా విదేశీ కంపెనీలు కాంట్రాక్ట్ ఉద్యోగాలు, ఆటోమేషన్‌పై ఎక్కువగా ఆధారపడవచ్చు. దీని వల్ల ఉద్యోగ భద్రత తగ్గి, కార్మిక హక్కులకు భంగం కలగవచ్చు. డేటా భద్రత & గోప్యత సమస్యలు ఇన్సూరెన్స్ రంగంలో ప్రజల వ్యక్తిగత, ఆర్థిక, ఆరోగ్య డేటా ఉంటుంది. వంద శాతం ఎఫ్‌డిఐ వల్ల ఈ సున్నితమైన డేటా విదేశీ సర్వర్లకు చేరి, జాతీయ భద్రతకు, గోప్యతకు ముప్పుగా మారే అవకాశముంది. పబ్లిక్ సెక్టార్ పాత్ర తగ్గిపోవడం ఎల్ఐసి వంటి ప్రభుత్వ సంస్థలు దేశీయ పొదుపులను మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాల్లో పెట్టుబడి చేస్తాయి. విదేశీ ఆధిపత్యం పెరిగితే ఈ విధమైన జాతీయ అభివృద్ధి పెట్టుబడులు తగ్గే ప్రమాదం ఉంది. ఆర్థిక సంక్షోభాల ప్రభావం అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాలు వచ్చినప్పుడు, విదేశీ పేరెంట్ కంపెనీల సమస్యలు భారత అనుబంధ సంస్థలపై ప్రభావం చూపవచ్చు. దీని వల్ల భారత ఇన్సూరెన్స్ రంగంలో అస్థిరత ఏర్పడే అవకాశం ఉంది. ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులు మూలధనం, సాంకేతికత తీసుకురాగలిగినా, సరైన నియంత్రణలు లేకపోతే దేశీయ ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత, జాతీయ ప్రయోజనాలకు హానికరంగా మారే ప్రమాదం ఉంది. అందుకే ఈ విధానంపై జాగ్రత్తగా, సమతుల్య దృష్టితో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని విమర్శకులు అభిప్రాయ పడుతున్నారు.


'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.


## మంచిర్యాల వ్యాప్తంగా 9 వరకు ప్రచార జాతా


### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్



**ప్రజాపక్షం / తాండూర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతజయంతి ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని ఐబి పార్టీ కార్యాలయంలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి కామెర మల్లయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం కలవేన శంకర్ జెండా ఊపి జిల్లా వ్యాప్తంగా జరిగే ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ జాతా జనవరి 3 నుండి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాటం చేసిన ఘనత సిపిఐదేనని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుమారు 4500 మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేసి తెలంగాణను విముక్తి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జాతాకు నాయకత్వం వహిస్తున్న జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్, రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, ఇప్పకాయల లింగయ్య, కే వీరభద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ పేదలకు ఉపాధి పథకాన్ని దూరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

### ఖమ్మం బహిరంగ సభను జయప్రదం చేయండి : యానాల పిలుపు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ఎన్నో త్యాగాలు, బలిదానాలతో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వంద వసంతాలు పూర్తి చేసుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించబోవు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మండలం మల్లిగూడెంలో శనివారం మండల కార్యవర్గ సభ్యుడు గుండు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభను పెద్ద ఎత్తున మేధావులు, కార్మికులు, కర్షకులు, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, తెలంగాణలో నిజాం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. కేంద్రం పెట్టుబడిదారులకు దేశ సంపద దోచిపెడుతుందన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి పథకాన్ని దూరం చేసే కుట్ర చేస్తుందన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ ఖమ్మం సభ జయప్రదం కోసం గోడ రాతలు, హోర్డింగ్లు, ముగ్గుల పోటీల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలి మత రాజకీయాలు చేస్తుందన్నారు. స మావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, చెక్క వెంకటేష్, మండల కార్యదర్శి కలేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, నాయకులు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐది వందేళ్ల త్యాగాల చరిత్ర


❑ ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ళ ఉత్సవాలను జయప్రదం చేయాలి :తక్కళ్లపల్లి ❑ శత వార్షికోత్సవ ముగింపు ఉత్సవాల గోడ పత్రికల ఆవిష్కరణ



**ప్రజాపక్షం / వరంగల్ :** దేశంలో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించిన వందేళ్ల త్యాగాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో శనివారం ఈనెల 18న ఖమ్మంలో జరుగు సిపిఐ వార్షికోత్సవ ముగింపు జాతీయ ఉత్సవాల బహిరంగ సభ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జనవరి 18న సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదని అన్నారు. దున్నే వాడికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ, లౌకిక ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతున్నదన్నారు. దేశభక్తి ముసుగులో బిజెపి కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతున్నదన్నారు. కోట్ల సంవత్సరాలు చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను ఆదాని మైనింగ్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వం చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగి పోయారని, ప్రధాని మోడీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని అన్నారు. గత 50 సంవత్సరాలుగా దేశంలో జరిగిన ప్రజా ఉద్యమాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్రాలలో డిజిపిలకు ఆదేశించడం ప్రజాఉద్యమాల అణచివేతకు సమగ్ర కార్యాచరణ రూపొందించడంలో భాగమే అని స్పష్టమవుతున్నదని, ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమాలపై అణచివేత చర్యలు తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, జిల్లా నాయకులు పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, గుండె బద్రి, తాళ్లపల్లి రాహేలా, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, ఎఐఎస్ఎఫ్ నాయకులు లాదెల శరత్, దిడ్డి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు కదలిరండి

- సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి పిలుపు
- 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది సభ పోస్టర్ల ఆవిష్కరణ




**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18న 5లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభకు మానుకోట ప్రాంతం నుంచి వేలాదిగా కదలి రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ్‌సారథి పిలుపునిచ్చారు. శనివారం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నాడు స్వాతంత్రోద్యమం నుండి నేటి వరకు ప్రజల కోసం ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణమని, ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా ఈ ప్రాంతం నుంచి కదలి రావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఫాసిస్టు బిజెపి పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని, భారతదేశంలో విభజించి పాలించే బిజెపిని భవిష్యత్ ఎన్నికల్లో ఓడించాలని, కమ్యూనిస్టులు ఎక్కడున్నారు అనే వారికి ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ ద్వారా పాలకులుకు బుద్ధి చెప్పాలన్నారు. ఈ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని, దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి సిపిఐ ప్రతినిధులు, శ్రేణులు వేలాదిగా తరలివస్తున్న ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి ఖమ్మంలో కదం తొక్క బోతున్నామని హలో కామ్రేడ్ ఛలో ఖమ్మం పేరుతో వేలాదిగా కదలి వచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని విజయసారథి పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, తండ సందీప్, వీరవెల్లి రవి, జలగం ప్రవీణ్, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, బల్లెం శ్రీకాంత్, మెతుకు కుమార్, మిరియాల మల్లికార్జున్, రమేష్ , అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐ

### సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి : మంద పవన్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** దేశంలో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించిన వందేళ్ల త్యాగాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శనివా రం సిద్దిపేట రోజున సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశానికి మంద పవన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యం గా, సోషలిజం ధ్యేయంగా సామాజిక న్యాయం. లౌకిక వాదం ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం లో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఏంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదన్నారు. దున్నేవాడికి భూమిదక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షాలాది ఎకరాలను భూముల ను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటా న్ని చేపట్టి వేలాది గ్రామాలు విముక్తి చేసిన ఘనచరిత్ర సిపిఐకి మాత్రమే దక్కిందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర దేశ ప్రజానికానికి తెలియ చేయటానికి వందేళ్ల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఈనెల 18న తలపెట్టిన చలో ఖమ్మం బహిరంగ సభకు ప్రపంచ దేశాల నుండి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు పాల్గొంటారని, దేశంలోని వామపక్ష నాయకులు,కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా నలుమూలల నుండి లక్షలాది మంది కార్యకర్తలతో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు సిద్దిపేట జిల్లా నుండి వేలాది మందిని తరలించటానికి ప్రయత్నాలు జరుపుతున్నామని, ఆదిశగా పార్టీ నాయకత్వాన్ని సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గడిపే మల్లేశం. కనుకుంట్ల శంకర్, కొమ్ముల భాస్కర్. జాగిర్ సత్యనారాయణ,బట్టు దయానంద్‌రెడ్డి, ఎడల వనేష్,అందేల క్ష్మ ణ్. కిష్టపురం లక్ష్మ ణ్, జెర్రిపోతుల జనార్దన్, పిల్లి రజని, జిల్లా కౌన్సిల్ సభ్యులు బన్సిలాల్. ఎస్కె హరీఫ్, మిట్టపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## 'ఉపాధి హామీ' పాత పద్ధతిలోనే కొనసాగించాలి : సదానందం

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం సెంటనరీ కాలనీ కెఎల్ మహేంద్ర భవన్‌లో జూపాక రామచందర్ రామగిరి మండల సెక్రటరీ అధ్యక్షతన నిర్వహించిన ప్రెస్ మీట్ సమావేశంలో పెద్దపల్లి జిల్లా సిపిఐ సెక్రెటరీ సదానం దం , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్ మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో ఈ నెల 18న విజయోత్సవ సభ, అదేవిధంగా ఈనెల 10వ తేదీన పెద్దపల్లిలో జరుగు ముగింపు సభను రైతులు, అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభలను విజయవంతం చేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బిజెపి ప్రభుత్వం వందరోజుల పథకాన్ని గాంధీతో ఉన్నటువంటి పేరును మార్చి సెంట్రల్ నుండి 90 శాతం నిధులు, 10% స్టేట్ గవర్నమెంట్ నిధులను గతంలో వెచ్చించేది, ఇప్పుడు 60 శాతం నిధులను రాష్ట్ర గవర్నమెంటు, 40% సెంట్రల్ గవర్నమెంట్‌గా మార్చడం జరిగింది, వీటిని పాత పద్ధతిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, రాజరత్నం, మొండయ్య, కనకయ్య, సాంబశివరెడ్డి అడ్డురి రాజయ్య, కొమురయ్య, జగదీష్, ధర్మయ్య, రాజ లింగయ్య, నవీన్, మొదలగువారు పాల్గొన్నారు.



# మహానగరి
## గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అంబేద్కర్ మనవడు ఆనంద్‌రాజ్‌ను సత్కరించిన శ్రీనివాస్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనవడు ఆనంద్ రాజ్‌ని శనివారం శుభం హోటల్ షాపూర్ నందు పంబీ శ్రీనివాస్ నాయి కలిశారు. ఈ సందర్భంగా ఆనంద్ రాజ్‌ని శ్రీనివాస్ శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.





## బస్ సర్వీస్ కొనసాగించండి
### డిపో మేనేజర్‌ని కలిసిన సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నిత్యం వందలాదిమంది చదువుకునే విద్యార్థులకు బస్ సౌకర్యం లేక చదువుకు దూరమౌతున్నారని బస్సులను పునరుద్ధరించాలని గంగ్యాడ, పూలపల్లి, నారేగూడ, పులుసుమామిడి సర్పంచ్‌లు వికారాబాద్ డిపో మేనేజర్‌ను కోరారు. శనివారం వికారాబాద్ బస్ డిపో మేనేజర్ నమ్రతను కలిసిన సిద్ధులూర్ వయా గంగ్యాడ బస్సు సర్వీసులను గతంలో మాదిరిగా ఉదయం 5 గంటల నుండి రాత్రి 9:30 గంటల వరకు బస్సు సౌకర్యం ఉండేదని అలాగే ఇప్పుడు కూడా సర్వీస్‌ను అదేవిధంగా కొనసాగించాలని కోరడం జరిగిందని అన్నారు. బస్సు సౌకర్యం లేక ఈ రూట్‌లో ప్రయాణీకులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిస్తు తొందర్లోనే బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రయాణీకులు బస్సు సౌకర్యం ఉపయోగించుకోవాలని బస్సులో ప్రయాణించాలని కోరారు. ప్రయాణీకుల సౌకర్యార్థం బస్ ప్రయాణం చేయా... ప్రైవేట్ వాహనాలు వలన ఆర్టీసీకి నష్టం జరుగకుండా చూడాలని గ్రామ సర్పంచ్‌లను డిపో మేనేజర్ కోరారు. డిపో మేనేజర్‌ని గంగ్యాడ సర్పంచ్ దోసాడ మల్లేశం, నారెగుడా సర్పంచ్ ఎల్వర్తి దీపికా దశరథ్, పూలపల్లి సర్పంచ్ ఎలిమెల భాగ్యలక్ష్మి మహేందర్ రెడ్డి, సిద్ధలూరు సర్పంచ్ మాల శ్రీనివాస్, పులుసుమామిడి సర్పంచ్ నారెగుడా ఇందిరా మహిపాల్ రెడ్డి, నాయకులు భానూరి ఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి అంజిరెడ్డి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సచివాలయంలో మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కొంతం అంజిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## 103 ఏళ్ల వృద్ధురాలుకు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నాగారం ఓల్డ్ విలేజ్‌కి చెందిన మాజీ పోలీస్ పటేల్ కీర్తిశేషులు బీకం ప్రసాద్ భార్య అయిన వృద్ధురాలు హాజరీ సుభద్రమ్మ 103 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆమెను పరామర్శించి శాలువాతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆమెకు 5 వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. కుమారుని పేద పరిస్థితిని చూసి 5 వేల రూపాయల నిత్యావసర సరుకులను అందించిన బిజెపి నాయకులు కిషోర్‌గౌడ్‌తో కలసి చంద్రారెడ్డి అందజేశారు. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నక్క కిషోర్‌గౌడ్, మెరుగు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణాచారి, రాజు, జలీల్, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హ్యాష్ ఆయిల్ తయారీ స్థావరంపై దాడి : ముగ్గురు అరెస్టు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** గుట్టు చప్పుడు కాకుండా గంజాయి హ్యాష్ ఆయిల్ తయారీ చేస్తున్న స్థావరంపై ఎస్ఓటి పోలీసులు దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొన్న ఉదంతం మేడ్చల్ జిల్లా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నిందితుల నుండి రూ. 8లక్షల విలువైన కిలో హ్యాష్ ఆయిల్ స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్‌లోని చింతల్ ప్రాంతానికి చెందిన సునీల్ కుమార్ (34) కొద్ది నెలల క్రితం గండిమైసమ్మ చౌరాస్తాలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొన్నాడు. ఒడిస్సా రాష్ట్రం నుండి హ్యాష్ ఆయిల్‌ను తెప్పించి స్నేహితులు చింటూ(27), సూర్యకాంత్(26)లతో కల్సి చిన్నచిన్న బాటిల్స్‌లో నింపి ఒక్కో బాటిల్‌ను రూ.500 చొప్పున విక్రయించసాగాడు. ఈ విషయంపై అందిన విశ్వసనీయ సమాచారంతో ఎస్ఓటి పోలీసులు అతడి స్థావరంపై శనివారం దాడిచేసి రెడ్ హ్యాండెడ్‌గా ముగ్గురిని అదుపులోకి తీసుకొని తదుపరి దర్యాప్తు నిమిత్తం దుండిగల్ పోలీసులకు అప్పగించారు.

## నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు... చోద్యం చూస్తున్న అధికారులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** నిబంధనలు పాటించకుండా అనుమతి లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు.పేదవాళ్ళ ఇల్లు నిర్మించాలంటే ఎన్నో అనుమతులు ఉండాలి అదే బడా బాబులు ఇల్లు నిర్మించాలి అంటే రూల్స్ పాటించనక్కర్లేదు. సంబంధిత అధికారులు భవన యజమానులతో కుమ్మక్కై అనుమతిలేని నిర్మాణాలు చేపడుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శనివారం డిప్యూటీ కమిషనర్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఘట్‌కేసర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 238, 240, 241బఫ్ఫర్ జోన్‌లో ఎలాంటి అనుమతి లేకుండా ఇండ్లు నిర్మిస్తున్నారని అలాగే సర్వేనెంబర్ 244,245,288 దత్తాత్రేయ నగర్ ఏదులాబాద్ మెయిన్ రోడ్డులో అనుమతులకు విరుద్ధంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. వాటిపట్ల టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నట్లు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణ దారులపై చర్యలు తీసుకోవాలని కొమ్మిడి మహిపాల్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

# అనేక త్యాగాలతో ప్రజాస్వామ్య హక్కులు సాధించిన పార్టీ సిపిఐ

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ పిలుపు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మంలో ఈనెల 18న జరగనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయడానికి హైదరాబాద్ నగరం నుంచి వేల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభకు వెళ్లేలా వాహనాలు సమకూర్చుకోవాలని, అన్ని శాఖల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం హిమాయత్‌నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మహమూద్ అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ మాట్లాడుతూ, 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సిపిఐ అనేక త్యాగాల ద్వారా ప్రజాస్వామ్య హక్కులను సాధించిందన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించే హక్కు కూడా లేని కాలంలో రాచరిక, భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్మించి ప్రజల హక్కుల కోసం సిపిఐ పోరాడిందని ఆయన గుర్తుచేశారు. సిపిఐ శతాబ్ది ఉత్సవా ల సందర్భంగా పార్టీ ఉద్యమ చరిత్రను ప్రజలకు వివరించడంతో పాటు, భవిష్యత్ పోరాటాల దిశ గా దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో సభలు, సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజల పక్షాన నిరంతరం పనిచేస్తున్న సిపిఐ పార్టీ జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజాస్వామ్యవాదులు, వ్యాపారవేత్తలు, మేధావు లు, ప్రజలు ఆర్థికంగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా 40దేశాల నుంచి సౌహార్ద ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి వారి హక్కులను కాలరాస్తోందని ఈ.టి. నరసింహ విమర్శించారు. వామపక్ష ఉద్యమాల ఫలితంగా యూపిఏ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, జి రామ్ జి పథకాన్ని తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు నిరసన గళం వినిపించాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, పడాల నళిని, కాంపల్లి శ్రీనివాస్, మామిడిచెట్ల వెంకటస్వామి, కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, సక్రి బాయి, మహమూద్, ఇమ్రాన్, నరేష్ గ్యార పాల్గొన్నారు.

## బిసి మహిళలకు రిజర్వేషన్లలో 50శాతం కోటా ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** మహిళా రిజర్వేషన్లలో బిసి మహిళలకు 50శాతం కోటా ఇవ్వాలని మాజీ ఎంపి వి.హెచ్.హనుమంతరావు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ హైదర్‌గూడ ఎంఎల్‌ఏ క్వార్టర్స్ చౌరస్తా వద్ద తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు వి.హెచ్.,హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, ఒబిసి మేధావుల ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ తదితర బిసి నేతలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.హెచ్.మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సావిత్రిబాయి పూలే జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ రానున్న మున్సిపల్, పరిషత్తు ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు తేవాలన్నారు. ఆనాడే స్త్రీ విద్య ప్రాధాన్యాన్ని సావిత్రిబాయి పూలే గుర్తించిన మహనీయురాలని కొనియాడారు. కార్యక్రమంలో బిసి సంఘం నేతలు పి.వి.రామరాఆవు, సాంబశివ గౌడ్, ఎర్ర శ్రీహరి, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు వారి వాహనాలు స్వాధీనం చేసుకొన్నారు. శనివారం సైనిక్‌పురి చౌరాస్తాలో కుషాయిగూడ, నేరేడ్‌మెట్ పోలీసులు సంయుక్తంగా 25 మందికి పైగా పోలీసు బృందాలు మోహరించి విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక్కో వాహనాన్ని ఆపి వాహనపత్రాలతో పాటు వాహన డిక్కీలను క్షుణ్ణంగా తనిఖీలు చేసారు. అవసరమైన ఆర్‌సి, లైసెన్సు, పర్మిట్లు, పొల్యూషన్ వంటి పత్రాలను అడిగి ఏ ఒక్కటి లేనప్పటికి వాహనదారులపై అతిక్రమణ కేసుల కింద వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ఆర్‌టిఎ పత్రాలు కల్గి ఉంటూ ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడిపించాలని, ఉల్లంఘనలను సహించేది లేదని, నిరంతరం తమ తనిఖీలు కొనసాగుతాయని ఈ సందర్భంగా నేరేడ్‌మెట్ ఇనస్పెక్టర్ సందీప్‌కుమార్ సూచించారు.



## సైబర్ నేరస్తులతో అప్రమత్తం
### 37 మంది బాధితులకు రిఫండ్ : సందీప్‌కుమార్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సైబర్ నేరస్తుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ సూచించారు. సైబర్ బాధితులు ఎలాంటి జాప్యం లేకుండా సమీప పోలీసులను కానీ 1930 ద్వారా కానీ www.cybercrime.gov.in సంప్రదించి ఫిర్యాదు చేయటం ద్వారా నేరస్తులను అదుపులోకి తీసుకోవటం సులభతరమవుతుందన్నారు. శనివారం నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరస్తుల బారినపడి నగదు పోగొట్టుకొన్న 37 మంది బాధితులకు రూ.7లక్షల 36వేలకు సంబంధించి న్యాయస్థానం ద్వారా లభించిన రిఫండ్ ఆర్డర్ పత్రాలను అందించారు. బాధితులకు రిఫండ్ చేయటంలో విశేష కృషి చేసిన సైబర్ స్టాఫ్ కానిస్టేబుల్ కాంతయ్య, ఉమెన్ మహిళా కానిస్టేబుల్ సుష్మారెడ్డిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అపరిచితుల నుండి ఉద్యోగాలు, రుణాలు, కెవైసి, బ్యాంకు ఖాతాలు వంటి పలు రకరకాలుగా వచ్చే ఫోన్‌కాల్స్, వాట్సప్, ఈ – మెయిల్‌ల విషయంలో నమ్మి మోసపోవద్దని సూచించారు.



## ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు చేయూత

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించకపోవడంతో మూడుచింతలపల్లి మాజీ ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను కలిసి కారణాలను తెలుసుకున్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్‌లో బూరుగు కవితరాములు, మహంకాళీ ఆంజనేయులు, పరుషరాములు, చాకలి సుక్కవ్వ, కుమ్మరి సత్తయ్యలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. దీంతో మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ లబ్దిదారుల వద్దకు వెళ్లి ప్రభుత్వం మంజూరుచేసిన ఇందిరమ్మ ఇండ్ల పనులను ఎందుకు ప్రారంభించడం లేదని అడిగారు. దీంతో లబ్దిదారులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పనులు చేయుటకు తమవద్ద డబ్బులు లేవని పాత ఇండ్లను కూల్చివేయడానికి సరిపోను పైసలు లేవని చెప్పారు. మంజూరు పత్రాలు ఇచ్చి ఆరు నెలలు గడుస్తుందని లబ్దిదారులు వాపోయారు. అనంతరం మాజీ ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని అయినా వారి వద్ద పనులు ప్రారంభించుటకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తాను స్వయంగా ముందుకు వచ్చి ఇందిరమ్మ ఇండ్లకు మంజూరైన నిధులతోపాటు తన సొంత నిధులు వెచ్చించి ఇండ్లు కట్టుకోవడానికి లబ్దిదారులకు ఆర్థికంగా చేయూతనిస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే ఐదుగురు లబ్దిదారుల ఇండ్లు నిర్మాణం పనులు ప్రారంభించుటకు ఆర్థిక సహాయం చేస్తానని అన్నారు. ఇంకా గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులను తన స్వంత నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాలకు విద్య... సావిత్రిబాయి ఫూలే ఘనత

### వివిధ ప్రాంతాలలో 195వ జయంతి వేడుకలు







**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మహిళల చదువు, అభ్యున్నతి కోసం జీవితాంతం కృషిచేసిన సావిత్రి బాయి పూలే ఆశయ సాధనకు నేటి విద్యార్థులు, యువత కృషి చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌లు అన్నారు. సావిత్రి బాయి 195వ జయంతి సందర్భంగా ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఇసిఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె 19వ శతాబ్దపు చీకట్లను చీల్చుతూ బానిస సంకెళ్లను తెంచి సమాజంలో వితంతువులు, బాలికలు, అణగారిన వర్గాలకు విద్యతో పాటు గౌరవాన్ని అందించిన మహనీయురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నేతలు మహేష్, అజీమ్, రవళి, ఏఐవైఎఫ్ కు చెందిన సతీష్‌కుమార్, సాయి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


**గౌతంనగర్‌లో...** గౌతంనగర్ చౌరాస్తాలో బహుజన కులాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో వగ్గు చంద్రశేఖర్ రావు, పూలపల్లి సుందర్‌యాదవ్, జిడి నవీన్ గౌడ్, తదితరులు సావిత్రి బాయి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. గౌతంనగర్ 141 డివిజన్‌లో జరిగిన మరో కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నేత మేకల రాము యాదవ్, జనరల్ సెక్రటరి బైరు అనిల్, తదితరులు పూలేబాయి జయంతి వేడుకలు నిర్వహించారు.

**కలెక్టరేట్‌లో....** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శనివారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాళ్లుగా గుర్తించిన 13 మందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి, జిల్లా స్థాయి ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు పాల్గొని సావిత్రిబాయి మహిళా ఉపాధ్యాయురాలిగా అందించిన సేవలను కొనియాడారు.

**దుండిగల్‌లో :** సావిత్రి బాయి పూలే 195వ జయంతి సందర్భంగా నిజాంపేట్ లో సిపిఐ ఆధ్వర్యంలో సావిత్రి బాయి చిత్రపటానికి పువ్వులమాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. సిపిఐ సీనియర్ నాయకులు కె.యేసు రత్నం, సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అనంతరం మాట్లాడుతూ, సావిత్రి బాయి పూలే 1831 జనవరి 3వ తేదీన మహారాష్ట్ర లో జన్మించారు అని అన్నారు.







**కుత్బుల్లాపూర్‌లో :** ఇంటిని చక్కదిద్దినట్టే సమాజాన్ని చక్కదిద్దడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, దేశం గర్వించదగిన గొప్ప మహిళ సావిత్రిభాయి పూలే అని, ఆమె దేశంలోని ఎందరో మహిళలకు ఆదర్శంగా నిలిచారని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి అన్నారు. శనివారం సంఘ సంస్కర్త, మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయ్ పూలే 192 జయంతి వేడుకలు ముక్దుమ్‌నగర్ సిపిఐ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

**శామీర్‌పేటలో:** ఆధునిక భారతదేశ తోలి మహిళా ఉపాధ్యాయురాలు మహిళల విద్యకు ఆద్యురాలైన మహనీయ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని జిల్లా ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా శాలువాతో సత్కరించారు. అలాగే తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల (జగద్గిరిగుట్ట)లో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపల్ గీత, ధనవేణి, అనిత, ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

**చర్లపల్లిలో :** కాప్రా ఎంపియూపిఎస్ పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంజుల, రమా,సాయిలక్ష్మి లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, రాఘవేందర్‌గౌడ్, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో:** ఘటకేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమంలో మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి పాల్గొని ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డి, స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షులు కుంటోళ్ళ యాదయ్య ఉపాధ్యాయులతో కలిసి సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాలకు శాలువాతో సత్కరించి భారత రాజ్యాంగం పుస్తకం బహుకరించారు.







**మర్పల్లిలో :** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామా పంచాయతీలో సావిత్రి బాయ్ పూలె జయంతి సందర్భంగా సర్పంచు పరశురాం ఆమె ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సురష్ ,వార్డు సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సావిత్రిబాయి పూలే సేవలు మరువలేవి



ప్రజాపక్షం/షాబాద్: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలసి మండలంలోని వివిధ శాఖల్లో ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న మహిళలకు శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా షాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలను గౌరవించి సన్మానం చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అపర్ణ, విద్య అధికారి లక్ష్మణ్, టిఎస్ పిఆర్‌టియు, టిఎస్ యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులోనే యూరియా

మండల వ్యవసాయాధికారి రవినాథ్

ప్రజాపక్షం/యాచారం: యాచారం మండలంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి ఆర్ రవినాథ్ అన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. కొందరు రైతులను తప్పు దారి పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. యూరియాను యాచారం మండలంలో ఉన్న డీలర్ల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ఫెర్టిలైజర్ బుక్కింగ్ యాప్ రంగారెడ్డి జిల్లాలో అమలులో లేదని అన్నారు. డీలర్ల వద్ద రైతులు నేరుగా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అవాస్తవాలను రైతులు నమ్మవద్దని తెలిపారు. ఎలాంటి సమాచారం కావాలన్నా తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించండి :ఎంవిఐ



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడిపించడంతో పాటు విలువైన ప్రాణాలను రక్షించుకునేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎంవిఐ వాసు సూచించారు. శనివారం పట్టణంలోని కుంట బడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎంఇఓ మనోహర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవిఐ వాసు మాట్లాడుతూ వాహనాల్లో ప్రయాణించే సమయంలో విధిగా సీట్‌బెల్టు పెట్టుకోవాలని, వాహనాలకు విధిగా ఇన్సూరెన్స్ చేయించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే డ్రైవింగ్ చేసేందుకు కృషి చేయాలని, వాహన చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. వాహనంలో ప్రయాణించే సమయంలో మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడటం చేయరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపించాలని పేర్కొన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలు తల్లిదండ్రులకు సూచించాలని తెలిపారు. మైనర్ విద్యార్థులకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పశువులకు గర్భకోశ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: పశువులను గర్భకోశ వ్యాధులు రాకుండా అన్నదాతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గోపాలమిత్ర కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ సూచించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో గోపాలమిత్ర కేంద్రంలో డాక్టర్ జి.విజయకుమార్, డాక్టర్ కె.సునీత, డాక్టర్ ముక్తుంటి రాజేష్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజన్ వ్యాధులు వచ్చే సమయంలో అన్నదాతలు తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 5న రంగారెడ్డి జిల్లా సబ్-జూనియర్, అండర్ 20 అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాపక్షం/సరూర్‌నగర్: రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీ ఎల్‌బినగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ అండర్ 20 ఇయర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ ఇ.గోపి తెలిపారు. ఈ పోటీలలో 6 నుంచి 20 సంవత్సరాల బాలబాలికలకు అండర్8, అండర్10, అండర్12, అండర్14, అండర్20 ఇయర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పాన సాయిరెడ్డిని సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9703838987కు సంప్రదించాలని కోరారు.

## చిన్నారులు, మహిళల భద్రతకు పెద్ద పీట

సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డిసిపి సృజన కరణం

ప్రజాపక్షం/రంగారెడ్డి : చిన్నారులు, మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డిసిపి సృజన కరణం అన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 27.12.2025 నుండి 02.01.2026 వరకు పలు విస్తృత చర్యలు చేపట్టమని డిసిపి సృజన కరణం తెలిపారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో మొత్తం ఆరుగురు ట్రాన్స్ జెండర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ దాడులలో మూడు పిటా కేసులు నమోదు కాగా, ముగ్గురు బాధితులను రక్షించడంతో పాటు 8 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నామన్నారు. సైబరాబాద్ షీ టీం బృందాలు ఈ వారంలో మొత్తం 147 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 45 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 52 పెటీ కేసులు నమోదు కాగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ చేశారు. అదేవిధంగా, మహిళల నుండి అందిన 26 ఫిర్యాదులను షీ టీం బృందాలు స్వీకరించాయన్నారు. భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలును పరిష్కరించే దిశగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు /సిడిఈ డబ్ల్యూ కేంద్రాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా 22 కుటుంబాలను తిరిగి కలిపి, వారి కుటుంబాల్లో వెలుగులను నింపారు. అదే విధంగా మహిళల హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100,నేరాల నివారణ కోసం 1930 వంటి సేవ ల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ అండ్ సి ఎస్ డబ్ల్యూ ఎసిపి ఎస్ కృష్ణ ప్రసాద్,రంగారెడ్డి జిల్లా,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,సభ్యుడు,కె.నరేందర్ రెడ్డి,మేడ్చల్ జిల్లా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, సభ్యుడు,రాజా రెడ్డి,రంగారెడ్డి జిల్లా, బాల రక్షా భవన్,కోఆర్డినేటర్, తిరుమలదేవి,అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్, స్టేట్ కోఆర్డినేటర్,వెంకటేశ్వరుతదితరులు పాల్గొన్నారు.



# సమాజం బాగుండాలంటే.. ఆలోచనా విధానం బాగుండాలి

సిఆర్ ఫౌండేషన్ కార్యక్రమంలో రాష్ట్ర సెర్ఫ్, మెప్మా సిఇఒ దివ్యదేవరాజన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : సమాజం బాగుండాలంటే ప్రజల ఆలోచన విధానం బాగుండాలని తెలంగాణ రాష్ట్ర సెర్ఫ్, మెప్మా సిఇఒ దివ్యదేవరాజన్ అన్నారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రపంచం అయిపోయిందని, వాట్సాప్ యూనివర్సిటీ అయిపోయిందని, ఎవరూ పుస్తకాలు కూడా చదవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలకు స్వతంత్ర సమరయోధుల చరిత్రలు, వారు చేసిన సహసాలు, పోరాటాల గురించి బోధించాలని సూచించారు. కొండాపూర్‌లోని సిఆర్ (చంద్ర రాజేశ్వర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం భారత దేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళా సంక్షేమ కేంద్రంలో వివిధ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దివ్యదేవరాజన్ మాట్లాడుతూ.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సిఆర్ ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు ఆశ్రయం కల్పించడం, మహిళలకు వృత్తివిద్య కోర్సుల ట్రైనింగ్ క్లాసులు నిర్వహించడం, హాస్పిటల్ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించడం, అత్యాధునిక లైబ్రరీ ఏర్పాటు చేయడం, రీసెర్చ్ సెంటర్ వంటి సదుపాయాలు కల్పించడం గర్వకారణమన్నారు. సెర్ఫ్ తరపున ఏ సహాయమైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మాజీ ఎంఎల్ఎ, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సుమారు 500 మంది మహిళలకు సిఆర్ ఫౌండేషన్ తరపున శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్స్ అందిస్తున్నామని తెలిపారు. ట్రైనింగ్ పూర్తయిన వారు శ్రమ, నేర్పుతో స్వయంగా ఎదిగి, భవిష్యత్తు నిర్మాణం కోసం తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు. స్వతంత్ర్య సమరయోధులు, సిపిఐ జనరల్ సెక్రటరీగా 25 సంవత్సరాలు పనిచేసిన చంద్ర రాజేశ్వర్ పేరుతో 30 సంవత్సరాల క్రితం సిఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ఫౌండేషన్‌లో వృద్ధాశ్రమంతో పాటు నీలం రాజశేఖర్‌రెడ్డి పేరుతో రీసెర్చ్ సెంటర్, సురవరం సుధాకర్ రెడ్డి పేరుతో లైబ్రరీ, సిపిఐ ఫార్మర్ జనరల్ సెక్రటరీ పేరు మీద ఇంద్రజిత్ హాల్ నిర్మాణం, వీటితో పాటు హాస్పిటల్ నిర్మించి పేదవారికి ఉచితంగా వైద్యం అందించడం జరుగుతుందన్నారు. అలాగే మహిళా సంక్షేమ కేంద్రం తరపున మహిళల అభివృద్ధి కోసం పలు కోర్సులు అందిస్తున్నారని తెలిపారు. 'ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం పొందకుండా, స్వతంత్రంగా నడిపే సంస్థ సిఆర్ ఫౌండేషన్. భవిష్యత్తులో దీనిని మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచనతో మందుకెళ్తున్నాం' అని పేర్కొన్నారు. సిఆర్ ఫౌండేషన్ మాదిరిగా ప్రభుత్వం తరపున ప్రతి జిల్లాకు 2ఎకరాల చొప్పున భూమిని కేటాయించి మహిళ సంక్షేమ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డా.ప్రతిభ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి నంద తీర్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ డాక్టర్ ఎన్.కిషోర్‌రెడ్డి, డైరెక్టర్ ఎన్.విహారికృష్ణ, ప్రముఖ కార్డియాలజిస్ట్ డా.డిఎన్.కుమార్, జిఎంహెచ్ ఉస్మానియా మెడికల్ కాలేజీ మాజీ సూపరిండెంట్ డా.ప్రతిభ, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్ర కమిటీ సభ్యులు ఉషారాణి, కృష్ణకుమారి, ప్రేమ్‌పావని, లక్ష్మి, ఆహ్వానితులు డా.బివి. విజయలక్ష్మి, డా.కూనంనేని రజిని తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాలకు ఊపిరిపోసిన చరిత్ర సిపిఐది

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు






ప్రజాపక్షం/కొత్తూరు/షాద్‌నగర్ : దేశంలో అనేక ఉద్యమాలకు ఊపిరి పోసిన చరిత్ర కలిగిన ఏకైన పార్టీ సిపిఐ అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు సూచించారు. శనివారం కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో జీపుజాత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ విశిష్టను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఎర్ర జెండా ఆనాటి రాజరిక వ్యవస్థలకు వ్యతిరేకంగా భూస్వాముల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడి ప్రజలకు అండగా పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటానికి బాటలు వేసిన ఏకైన పార్టీ సిపిఐ అని, ఆ పోరాటాలతోనే లక్షలాది ఎకరాల భూములను పంచి వేల గ్రామాలకు విముక్తి కల్పించినట్లు పేర్కొన్నారు. ఆ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టులు ప్రాణాలను పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. జనవరి18వ తేదిన ఖమ్మం జిల్లాలో నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున సిపిఐ కార్యకర్తలు తరలి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జంగయ్యతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిపిఐ వందేళ్ల చరిత్ర ప్రజలకు తెలియజేసేందుకే జీపుజాత :శ్రీనునాయక్

సిపిఐ వందేళ్ల చరిత్రను గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేసేందుకే జీపుజాత కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీనునాయక్ తెలిపారు. శనివారం షాద్‌నగర్‌కు వచ్చిన జీపుజాతకు ఘనంగా స్వాగతం ఫలికారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనునాయక్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. శత జయంతి ఉత్సవాలను భారత గడ్డపై ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయ వంతం చేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. షాద్‌నగర్ డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో సిపిఐ జీపుజాత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, 18న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు సిపిఐ కార్యకర్తలు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఫరూఖ్‌నగర్ మండల కార్యదర్శి లింగం నాయక్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్‌చౌహాన్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్యాగాలు, బలిదానాలు చేసింది కమ్యూనిస్టులే

పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/రంగారెడ్డి: భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం పట్టణంలో ఈ నెల 18వ తేదీన జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. 3,4 తేదీలలో నియోజకవర్గంలోని సిపిఐ ఆధ్వర్యంలో శనివారం చేవెళ్ల కేందంలోని శంకర్పల్లి చౌరస్తాలో జీపు జాతను సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో భారత గడ్డపై సిపిఐ పార్టీకి 100 సంవత్సరాలు పూర్తి అయినాయని కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల సుదీర్ఘకాలం అనేక పోరాటాలు ఎన్నో ఉద్యమాలు ఎన్నో త్యాగాలు ఎంతోమంది బలిదానాలు చేసిన పార్టీ ఎర్రజెండా అని అన్నారు. జీపు జాత చేవెళ్ల నియోజవర్గం అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఈనెల 18న జరిగే ఖమ్మంలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు గ్రామ గ్రామాల నుంచి కమ్యూనిస్టు శాఖల నుంచి కార్యకర్తలు కార్మికులు కర్షకులు రైతులు శ్రేయోభిలాషులు వామపక్ష భావాల గల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభు లింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట వడ్ల మంజుల, అంతారం వార్డ్ నెంబర్ జయమ్మ, ఎఐకెఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏం.సుధాకర్ గౌడ్, ఒగ్గు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తాం


రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి





ప్రజాపక్షం/రంగారెడ్డి: ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా,నిర్ణీత గడువు లోగా పూర్తి చేస్తామని తెలిపారు. బిఎల్ఒలు , సూపర్‌వైజర్లతో క్షేత్ర స్థాయిలో ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం బిఎల్ఒలు, సూపర్వైజర్‌లు, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలని, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషన్ నిర్ణీత గడువులోగా పూర్తి ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్ఒలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బిఎల్ఒకి ప్రతి రోజు 30,40 ఎంట్రీల లక్ష్యాన్ని కేటాయించి, ప్రతి ఇంటి వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో ఫీల్డ్ సందర్శనలు నిర్వహించి, టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. ఎఇఆర్ఒలు, ఇఆర్ఓలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమగ్రంగా పర్యవేక్షించి, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. డెస్క్ వర్క్‌ను సమాంతరంగా నిర్వహిస్తూ డేటా సరిగా ఎంటర్ అయ్యేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువు లోగా పూర్తి చేస్తామని తెలిపారు .బిఎల్ఒలు, సూపర్‌వైజర్లతో క్షేత్ర స్థాయిలో ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఒ సంగీత, ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి,ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక రుగ్మతలు తొలగించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

విద్యార్థులకు విద్యా బోధనతో పాటు సామాజిక రుగ్మతలను తొలగించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతినీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ మహిళ ఉపాధ్యాయుల దినోత్సవ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుసిందర్ రావుతో కలిసి జిల్లా,కలెక్ట ర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి,సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సావిత్రి బా యి జయంతిని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని, దేశంలోనే తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా,సంఘ సంస్కర్తగా సావిత్రిబాయి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. బాలికలు ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు.ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధనను అందించి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, అందుకు మీరంతా కృషి చేయాలని,నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా ఎంపికైన మీరంత ఇంకా బాధ్యతతో విద్యను అందించాలని అన్నారు. ఈసందర్భంగా ఎంపిక చేసిన 13 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను కలెక్టర్ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిద శాఖల అధికారులు,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.





## ప్రజల గొంతుకగా 'ప్రజాపక్షం'



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా గొంతుకగా 'ప్రజాపక్షం' దినపత్రిక పని చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ ప్రజాపక్షం 2026క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని వివరించారు. సమాజంలో మీడియా అనేది నాల్గవ స్థానంలో ఉందని, ప్రజలకు, ప్రజాప్రతినిధులకు వారధిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజాపక్షం దినపత్రిక ప్రజలకు వారదిగా పని చేయడంతోపాటు నిజాన్ని నిర్భయంగా రాసే ప్రజాపక్షం దినపత్రిక ఎల్లప్పుడు ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మీడియాకు పూర్తి స్వేచ్ఛ ఉందని, నిజాన్ని నిర్భయంగా రాసేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని గుర్తు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు ఏమి ఉన్నా కథనాల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. మీడియా పరంగా ఏ సమస్య ఉన్నా తమ తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం దినపత్రిక షాద్‌నగర్ పిసి ఇన్‌చార్జి డి.రమేష్, కొత్తూరు మండల విలేకరి ఎం.అనిల్‌కుమార్, ఫరూఖ్‌నగర్ మండల విలేకరి వెంకటేష్ గౌడ్‌తోపాటు లింగారెడ్డిగూడ ఉప సర్పంచ్ అశోక్, కాంగ్రెస్ సీనియర్ నేత తిరుపతిరెడ్డి, నర్సింహులు, సీతారాములు, దర్శన్‌లు ఉన్నారు.

# విద్యతోనే వనితకు విముక్తి సాధ్యమని నినదించిన సావిత్రి బాయి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్ : విద్యతోనే వనితకు విముక్తి సాధ్యమన్న సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఫరూక్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ముందు ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరిపించడం సంతోషకరమని, సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం గర్వకంగా ఉందని పేర్కొన్నారు. దేశ సామాజిక రంగంలో సంస్కరణల దిశగా వారందించిన సేవలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని సూచించారు. మహిళా సాధికారత కోసం ఆడబిడ్డల విద్య కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. సకల రంగాల్లో బహుజనులను కట్టడిచేసే సామాజిక సంప్రదాయ నిర్భందాలను బద్దలుకొట్టి బడుగుల అభ్యున్నతికై, స్త్రీ విద్యకై తన జీవితాన్ని దారపోసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని అన్నారు. అదే స్ఫూర్తి కొనసాగిస్తూ సబ్బండ వర్గాలలో నిత్య చైతన్యాన్ని నింపడం ద్వారా మాత్రమే పూలే వంటి మహనీయులకు మనమందించే ఘన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, మాజీ జెడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నేతలు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

### మండల విద్యావనరుల కేంద్రంలో..

ఫరూఖ్‌నగర్ మండల విద్యావనరుల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి మనోహర్ ఆధ్వర్యంలో పూలే 195వ జయంతి వేడుకలకు మహిళా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ నళిని, బివి ఎం రాజు, వెంకటయ్య, నర్సింలు గౌడ్, లక్ష్మీ దేవమ్మ, మేఘబాయి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం... ఉపేక్షించం



ప్రజాపక్షం/షాద్‌నగర్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ఎల్లప్పుడు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఫ్యూచర్ సిటి పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబు అన్నారు. శనివారం పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబును షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ రాష్ట్ర గిరిజన కోఆర్డినేటర్ రఘునాయక్, సీనియన్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అంధించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ కమీషరేట్ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షించడంతోపాటు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండటం జరుగుతుందని వివరించారు. డిసిపి కార్యాలయాన్ని షాద్‌నగర్ ప్రాంతానికే కేటాయించడం జరిగిందని, ఈ డివిజన్‌పై గతంలో పనిచేసిన అనుభవం సైతం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్ పరిధిలో ఉన్న ఆరు పోలీస్ స్టేషన్లలో పోలీసుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. స్థానికంగా డిసిపి కార్యాలయం ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయాలపై సైతం కమీషనర్‌తో చర్చించినట్లు వివరించారు. ఇందుకు కమీషనర్ స్పందిస్తూ ప్రభు త్వం నుండి ఉత్తర్వులు వచ్చిన వెంటనే ఏర్పాటు చేయడమే కాకుండా అన్ని పోలీస్ స్టేషన్లతో సంఖ్యను క్రమంగా పెంచుతామని తెలిపారు.

# రీల్




మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'.

## వరంగల్‌లో హీరోయిన్ల సందడి

ఈ చిత్రంలో రవితేజ సరసన డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలోని మూడవ పాట 'వామ్మో వాయ్యో'ను వరంగల్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో లాంచ్ చేశారు. హీరోయిన్లు అధికారంగనాథ్, డింపుల్ యయాతి వరంగల్‌లో సందడి చేశారు. భీమ్స్ సిసిరోలియో మరోసారి మాస్ ఆడియన్స్ కట్టిపడేసే సాంగ్ కంపోజ్ చేశారు. 'వామ్మో వాయ్యో' ఫుల్ జోష్‌తో సాగే ఫోక్ ట్రాక్‌ను స్వాతి రెడ్డి వాయిస్ ఈ పాటను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఆమె వాయిస్‌లో ఉన్న ఆ ప్రత్యేక టోన్ పాటకు అదిరిపోయే ఎట్రాక్షన్‌ని జోడించింది. దేవ్ పవార్ రాసిన సాహిత్యం అందించారు. శేఖర్ వీజే మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ప్రసాద్ మురెళ్ల సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సంక్రాంతికి జనవరి 13న వస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' విడుదల చేస్తున్నారు.

## గన్ పట్టుకున్న బ్యూటీ

కెజిఎఫ్ హీరో యాష్ నటిస్తున్న తాజా చిత్రం టాక్సిక్. ఈ సినిమా ప్రమోషన్ జోరుగా సాగుతోంది. మొదట హీరో పోస్టర్‌ను, ఆ తరువాత నాయన తార పోస్టర్‌ను ఇప్పుడు తార సుటారియా పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో ఈ సినిమాపై రోజు రోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమాను మార్చి 19న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ప్రమోషన్ యాక్టివిటీస్ పెంచారు. తార సుటారియా బ్లాక్ డ్రెస్‌లో గన్ పట్టుకుని ఎవరిని కాల్చడానికి ప్రయత్నిస్తున్నట్టు పోస్టర్‌లో స్పష్టమవుతోంది. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ కథను గీతూ మోహన్ దాస్‌తో పాటు హీరో యాష్ కలిసి రాసుకున్నారు. మాఫియా నేపథ్యంలో సాగే భారీ యాక్షన్ చిత్రంగా తెరకెక్కిస్తున్నారు.






## నేడే ట్రైలర్

'మన శంకర వర ప్రసాద్ గారు'

మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'మన శంకర వర ప్రసాద్ గారు', విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమాలోని 'మీసాల పిల్ల' పాట 100 మిలియన్లకు పైగా వ్యూస్ దాటగా, 'శశిరేఖ' పాట దాదాపు 40 మిలియన్ల వ్యూస్‌తో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్ర బృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను నేడు విడుదల చేయనున్నారు. ట్రైలర్ పోస్టర్‌లో చిరంజీవి తెల్లటి షొక్కా, ముదురు రంగు ప్యాంటు ధరించి, ఒక మెట్లపైకి కూర్చుని, చేతిలో షాట్‌గన్ పట్టుకుని, చుట్టూ యాక్షన్‌లో ఉన్న వ్యక్తుల మధ్య కనిపించడం అదిరిపోయింది. అనిల్ రావిపూడి ఇప్పటికే ఇది హై-వోల్టేజ్ మాస్ ఎలిమెంట్స్‌తో పాటు క్రైమ్ డ్రామా షేడ్స్ కలిగిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించారు.




## 'నిను కసిరిన సమయాన' పాట విడుదల

మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. 'స్కై' సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'నిను కసిరిన సమయాన...' అనే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటకు పృథ్వీ పెరిచెర్ల మంచి లిరిక్స్ రాయగా, వైష్ణవి ఆకట్టుకునేలా పాడారు. శివప్రసాద్ బ్యూటిఫుల్ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. నిను కసిరిన సమయాన, నను మరచిన నా హృదయం, అడుగడుగున నిను వెతికి, అణువణువున నిను తలచి, ఆలోచనంతా నీ వెనకే, ఆరాధనంతా నీ కొరకే..' అంటూ లవ్ ఫీల్‌తో ఆకట్టుకుంటోంది.'స్కై' సినిమా నుంచి ఇప్పటిదాకా రిలీజ్ చేసిన 'తపనే తెలుపగ..', 'పోయేకాలం నీకు..', 'నిన్ను చూసిన..' సాంగ్స్ ఛాట్ బస్టర్స్‌గా మారి మిలియన్ వ్యూస్ రీచ్ అయ్యాయి.

## 'గోదారి గట్టుపైన' టీజర్

మేమ్ ఫేమస్‌తో హీరోగా పరిచయమైన సుమంత్ ప్రభాస్ 'గోదారి గట్టుపైన' సినిమాతో అలరించబోతున్నారు. ఈ చిత్రం రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్‌కు ఫస్ట్ వెంచర్. ఎంఆర్ ప్రొడక్షన్స్ షార్ట్ ఫిలింతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిధి ప్రదీప్ కథానాయికగా అరంగేట్రం చేస్తుండగా, జగపతి బాబు, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. గోదారి గట్టుపైన ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ ఈరోజు లాంచ్ చేశారు. గోదావరి తీర ప్రాంతం నేపథ్యంగా రూపొందిన గ్రామీణ కథాచిత్రమిది. సుమంత్ ప్రభాస్ సహజంగా రాజు పాత్రలో ఒదిగిపోయాడు. అతని కామిక్ టైమింగ్ ఆకట్టుకుంటుంది. నిధి ప్రదీప్ అందంగా కనిపించింది. జగపతి బాబు, రాజీవ్ కనకాల పాత్రలు సినిమా డెప్త్‌ని పెంచుతాయి. సుదర్శన్, రాజ్ కుమార్ కాసిరెడ్డి, రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ తమ హ్యూమర్‌తో నవ్వులు పూయిస్తారు.






చైతన్యరావు మాదాడి కథానాయకుడిగా కె.క్రాంతి మాధవ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'దిల్

## 'దిల్ దియా' ఫస్ట్ లుక్

దియాఏ నేక్డ్ ట్రూత్' అనేది ట్యాగ్. లైన్. శ్రియాస్ చిత్రాస్, ఎ పూర్ణ నాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. చైతన్యరావు మాదాడి, ఇరా, సఖి, జెస్సీ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఈ చిత్రంలో మణి చందన, ప్రమోదిని, వీర శంకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సినిమా నేచురల్‌గా ఉండాలనే ఆలోచనతో డైరెక్టర్ అండ్ టీమ్ నటీనటులను ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీని వల్ల సినిమాలో ఓవర్ డ్రామా లేకుండా నేచురాలిటీ కనిపిస్తుంది. ఎమోషన్స్ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతాయి. బట్టలు లేకుండా సోఫాలో కూర్చున్న చైతన్య రావును చూడొచ్చు.




## 'ద్రౌపది 2'కు యు/ఎ సర్టిఫికెట్

మోహన్.జి దర్శకత్వంలో రూపొందుతోన్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'ద్రౌపది 2'. 14వ శతాబ్దంలో దక్షిణ భారతదేశపు నేపథ్యంలో సాగే కథతో ఈ సినిమాను భారీ బడ్జెట్తో బహుభాషా చిత్రంగా రూపొందించారు. సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికేట్ను పొందింది. ఇందులో చిరాగ్ జానీ విలన్గా నటిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మోహన్.జి మాట్లాడుతూ 'మహమ్మద్బిన్ తుగ్లక్ పాత్రలో చిరాగ్ నటించారు. ఈ పాత్రను విలన్‌గానే కాకుండా.. తను తీసుకునే నిర్ణయాల వల్ల సమస్యల్లో పడే పాలకుడిగా చూపించే క్రమంలో దాన్ని చిరాగ్ అద్భుతంగా పోషించారు. చరిత్రలో తుగ్లక్ను తెలివైన మూర్ఖుడు అని అంటుంటారు. ఇలాంటి పాత్రను చేయాలంటే లుక్ పరంగా గంభీరంగా కనిపిస్తూనే మేధస్సు, తెలివిని బ్యాలెన్స్ చేస్తూ నటించే యాక్టర్ కావాలి. ఇలాంటి వేరియేషన్ను చూపించటం చాలా కష్టంతో కూడుకున్నది. చిరాగ్ ఆ పాత్రలో పూర్తిగా లీనమై నటించి పాత్రలో అన్నీ రకాల ఎమోషన్స్‌ను అద్భుతంగా పలికించారు' అన్నారు. ద్రౌపది 2లో 'ద్రౌపతి 2' సినిమాలో రిచర్డ్ రిషి హీరోగా, రక్షణ ఇందుసుదన్ హీరోయిన్గా నటించారు. నట్టి నటరాజ్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇంకా ఈ వై.జి. మహేంద్రన్, నడోడిగల్ బరాణి, సరవణ సుబ్బయ్య, వెల్ రామమూర్తి, సిరాజ్ జానీ, దినేష్ లాంబా, గణేష్ గౌరాంగ్, దివి, దేవయానీ శర్మ, అరుణోదయన్ తదితరులు ఇతర పాత్రల్లో అలరించనున్నారు. ఈ సినిమాను చోళ చక్రవర్తి (నేతాజీ ప్రొడక్షన్స్), జి.ఎం. ఫిల్మ్ కార్పొరేషన్తో కలిసి నిర్మించారు. ఫిలిప్ ఆర్. సుందర్ సినిమాటోగ్రఫీ అందించగా, గిబ్రాన్ సంగీతాన్ని అందించారు. యాక్షన్ సంతోష్, నృత్యాలను తనిక టోనీ యాక్షన్ సన్నివేశాలను డిజైన్ చేశారు. అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు

## సెర్చ్ వారెంట్ల అధికారం పోలీసులకు ఎక్కడిది?

### హైకోర్టు ప్రశ్న

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సెర్చ్ వారెంట్ల జారీకి అనుసరించే చట్ట విధానం ఏమిటో తెలియజేయాలని రాష్ట్రాన్ని హైకోర్టు కోరింది. దీనిపై హోం శాఖ దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌లో వివరాలు అస్పష్టంగా ఉన్నాయంది. జ్యుడిషియల్ మేజిస్ట్రేట్లకు ఉండే అధికారాలను అసిస్టెంట్ కమిషనర్ హోదాలోని పోలీస్ అధికారి సెర్చ్ వారెంట్ జారీ చేస్తున్నారని, సెర్చ్ వారెంట్ల జారీ, తర్వాత ఆస్తుల స్వాధీనం, వ్యక్తుల అరెస్టు లాంటి న్యాయాధికారాలను కల్పించడం చెల్లదంటూ పిటిషన్ దాఖలైంది. హైదరాబాద్ నగర పోలీసు చట్టం 1348 ఫస్లీలోని సెక్షన్ 47 ప్రకారం పోలీస్ అధికారాలకు కల్పించడం చట్ట విరుద్ధమంటూ లా స్టూడెంట్ విజయ్ గోపాల్ పిటిషన్ వేశారు. దీనిని చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ విచారించింది. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## కొండగట్టు అంజన్న అందరి వాడు

### ఆంజనేయ స్వామి క్షేత్రంలో ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటన

### రూ.35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం, 96గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు

**ప్రజా పక్షం /మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పౌర్ణమి శనివారం దర్శించుకున్నారు. వీరితో పాటు టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్ నాయుడు, టిటిడి సభ్యులు పాల్గొన్నారు. మొదట హెలికాప్టర్ ద్వారా జేఎన్టీయూకు చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కొండగట్టు ఘాట్ రోడ్డు వై జంక్షన్ వద్ద టిటిడి సహకారంతో రూ.35.19కోట్ల వ్యయంతో నిర్మించనున్న దీక్ష విరమణ మండపం, 96గదుల వసతి సముదాయానికి వేద మంత్రోచ్చారణల మధ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి అందరి దేవుడు, విశ్వంతర్యామి మా ఇంటి ఇలవేల్పు అని ఆయన దయతోనే నాకు పునర్జన్మ లభించిందన్నారు. కొండగట్టులో మాలవిరమణ చేయడానికి భక్తులు బస చేయడానికి వసతి సదుపాయాలు లేవని తన దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే అభివృద్ధి పనులకు మాట ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టడం హర్షనీయమన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షణకు మార్గం సుగమం చేసేందుకు అవసరమైతే తానే స్వయంగా కరసేవకుడిని అవుతానని మాట ఇచ్చారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ పుణ్యక్షేత్రాల్లో ప్రధానమైన కొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు ఎపి ఉపముఖ్యమంత్రి వచ్చి దీక్ష విరమణ మండపం, 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధి చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మాట్లాడుతూ.. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంకు ఎపి డిప్యూటీ సిఎం సహకారంతో నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్, టిటిడి బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, బి.మహేందర్ రెడ్డి, టిటిడి ఎల్.ఎ.సీ. చైర్మన్ ఎన్.శంకర్ గౌడ్, ఎపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజా గౌడ్, జిల్లా అధికారులు, ముత్యంపేట సర్పంచ్ దారం ఆదిరెడ్డి, ఆలయ ఈ.వో, ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.








## కదలి రండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ మతోన్మాదం దేశానికి ప్రమాదకరంగా మారుతుందని మతోన్మాద శక్తులను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం, శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సిపిఐ ప్రచార జాతాను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ దేశ ప్రజలు కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారన్నారు. భవిష్యత్తు ఉద్యమాలకు ప్రేరణగా నిలవనున్న సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని, లక్షలాది మందితో జరిగే ఈ బహిరంగ సభ కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో ఓ మైలు రాయిగా నిలిచిపోనుందన్నారు. చర్ల నుంచి ప్రారంభమైన జాతా దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు మండలాల వరకు సాగగా సత్తుపల్లిలో ప్రారంభమైన జాతా వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వైరా, కొణిజర్ల మండలాల మీదుగా వి. వెంకటాయపాలెం వరకు సాగింది. సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కల్లూరు వెంకటేశ్వరరావు, ముత్యాల విశ్వనాథం, శింగు నర్సింహారావు తదితరులు నేతృత్వం వహించారు. కాగా, కమ్యూనిస్టుల ధ్యేయం ప్రజల సమస్యల పరిష్కారమేనని వందేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అనేక పోరాట విజయాలను సాధించామని సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ తెలిపారు. శత వసంత ఉత్సవాల్లో భాగంగా చర్ల మండల కేంద్రంలో జాతాను ప్రారంభించిన అనంతరం కల్లూరు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ ఈ దేశంలో అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడింది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని తెలిపిన నారాయణ కమ్యూనిజం అజరామరమని ప్రజా సమస్యలు ఉన్నంత కాలం ఎర్ర జెండా రెపరెపలాడుతూనే ఉంటుందన్నారు. ఆర్ఎస్ఎస్, జన్‌సంఘ్ లాంటి మతోన్మాద శక్తులు ఈ దేశ ప్రజలను విభజించే కుట్రకు పూనుకున్నాయని నారాయణ తెలిపారు. పేదలకు వ్యతిరేకమని బిజెపి మరోసారి చాటుకుందని జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు పథకం స్వరూపాన్ని మార్చడం వెనక కుట్ర దాగి ఉందని పేదలను ఇబ్బందులు పెట్టడమే బిజెపి లక్ష్యమన్నారు. గోదావరి జలాల కోసం కమ్యూనిస్టులు పోరాడారని కానీ గోదావరి మీద ప్రాజెక్టులను నిర్మించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని నారాయణ ఆరోపించారు. రాష్ట్ర విభజన సందర్భంగా పోలవరం ప్రాజెక్టు పేరుతో భద్రాచలంలోని పలు మండలాలను ఆంధ్రాలో విలీనం చేశారని భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తక్షణం తెలంగాణలో కలపాలని ఆయన డిమాండ్ చేశారు. చట్ట సభలకు వచ్చి ప్రజా సమస్యలపై స్పందించని నాయకులు శాసనసభకు రాజీనామా చేయడం మంచిదని నారాయణ సూచించారు. ప్రజా ధనంతో జీత భత్యాలు పొందుతూ చట్ట సభలకు రాకపోవడం శోచనీయమన్నారు. ఖమ్మంలో జరిగే సభ ద్వారా కమ్యూనిస్టుల శక్తిని చాటాలని ఆ సభ భవిష్యత్తు ఉద్యమాలకు దిక్సూచి కానుందన్నారు. జనవరి 18న ఖమ్మం నగరం లక్షలాది మందితో ఎరుపెక్కాలని ఆయన ఆకాంక్షించారు. సభకు ముందు కొమ్ము వాయిద్యాలు, డప్పు నృత్యాలు సందడి చేశాయి. నారాయణ స్వయంగా కొమ్ములు తగిలించుకుని డోలు వాయించాడు. రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, చలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, కందుల భాస్కర్, ఫయిన్, అడ్డగర్ల తాతాజీ, రూప తిరుపతి, పోతయ్య, పాల్వంచ రామారావు, ముత్యాలరావు, చల్లా లక్ష్మి నారాయణ, భద్రం, నాగేశ్వరరావు, సత్యనారాయణ, జాకీర్, అన్నపూర్ణ, వెంకటనర్సమ్మ, సర్పంచ్‌లు నూపా సునీత, శ్యామల తిరుపతిరావు తదిరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుంది : బాగం

పాలకుల వైఖరి మారుతున్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సత్తుపల్లిలో జాతాను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని మతం, కులం పేరిట ప్రజల మధ్య విభజన రేఖ గీస్తున్నారన్నారు. ప్రజలను మరిచి పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న నేపథ్యంలో కమ్యూనిస్టులు బలంగా ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని ప్రజల పక్షాన ప్రశ్నించేందుకు కమ్యూనిస్టులు అవసరమని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. భారతదేశంలో వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ప్రజల పక్షాన నికరంగా నిలబడి పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. ఇప్పుడు దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని 140 కోట్ల భారతీయుల కంటే మోడీ సన్నిహితులుగా ఉన్న 10 మంది కార్పోరేట్లే ఎక్కువయ్యారని వారి కోసం ఆపరేషన్ కగార్ పేరిట ప్రజలను పిట్టల్లా కాల్చి చంపుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ జాతా వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, వైరా, తల్లాడ, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లో సాగింది.
ఈ జాతాలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి, దండు ఆదినారాయణ, నాయకులు ఏబు, నిమ్మటూరి రామకృష్ణ, రెహమతుల్లా, రాజశేఖర్, లక్ష్మి, ఎస్‌కె షౌకత్, జ్యోతి, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వరరావు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ఎంజి నరేగా బచావో సంగ్రామ్'

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఇది కేవలం కాంగ్రెస్ కార్యక్రమం మాత్రమే కాదు... తాము ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలన్నింటితోనూ వివరంగా చర్చిస్తామని, కలిసి పోరాడతామని వేణుగోపాల్ అన్నారు. 10న జిల్లా స్థాయిలో విలేకరుల సమావేశాలు జరుగుతాయని, ఆ తర్వాత జనవరి 11న జిల్లా కేంద్రాల్లో ఒక రోజు నిరాహార దీక్ష, ప్రతీకాత్మక నిరసనలు జరుగుతాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. జనవరి 12 నుండి 29 వరకు, అన్ని గ్రామ పంచాయతీలలో పంచాయతీ స్థాయి చౌపాల్‌లు, సామూహిక సంప్రదింపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని, ఆ తర్వాత పని హక్కు కోసం ఒత్తిడి తీసుకురావడానికి జనవరి 30న వార్డు స్థాయిలో శాంతియుత నిరసనలు జరుగుతాయని వారు తెలిపారు. ఫిబ్రవరి 7 నుండి 15 వరకు, రాష్ట్ర స్థాయి శాసన సభల ముట్టడులు నిర్వహించబడతాయని, దేశవ్యాప్త ఉద్యమం ముగింపుకు ముందు ఫిబ్రవరి 16–25 మధ్య నాలుగు ప్రధాన ర్యాలీలు జరుగుతాయని వేణుగోపాల్ చెప్పారు. కాగా, కొత్త 'విబి– జిరామ్‌జి' చట్టం ద్వారా కేంద్రం పూర్తి కేంద్రీకరణకు పాల్పడిందని ఆరోపించారు. కొత్త చట్టం ప్రకారం ఉపాధి ఇకపై హక్కుగా ఉండదని, దీనిని కోర్టులో సవాలు చేస్తామని వారు తెలిపారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఈ కొత్త చట్టాన్ని అమలు చేయవా లేదా వ్యతిరేకిస్తాయా అని అడిగిన ప్రశ్నకు వేణుగోపాల్ సమాధానమిస్తూ తదుపరి కార్యాచరణపై కాంగ్రెస్ అన్ని మిత్రపక్షాలతో సంప్రదింపులు జరుపుతుందని చెప్పారు. ప్రతిపక్ష పాలిత ముఖ్యమంత్రుల మధ్య ఏకాభిప్రాయం కుదురుతుందని, దీనిపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై తాము అవకాశాలను అన్వేషిస్తామని వేణుగోపాల్ అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఏదీ కూడా జి రామ్ జి చట్టాన్ని అమలు చేసే స్థితిలో లేదని రమేష్ పేర్కొన్నారు. ఈ చట్టం దేశ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ చట్టం సమాఖ్య స్ఫూర్తిపైనే దాడి అని వేణుగోపాల్ అభివర్ణించారు. దీనిని అమలు చేయడానికి రాష్ట్రాలతో ఎలాంటి చర్చలు జరపలేదని అయినప్పటికీ వారి ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటాయని చెప్పారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో సంగ్రామ్' ద్వారా కాంగ్రెస్ పని హక్కును పరిరక్షించాలని, పంచాయతీరాజ్ సంస్థలను కాపాడాలని, ఈ సమస్యను దేశంలోని ప్రతి గ్రామానికి తీసుకువెళ్లి మహిళా కార్మికులు, దళితులు, ఆదివాసీలు, గ్రామీణ పేదలకు అండగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆయన అన్నారు.
విబి గ్రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఎంఇఎన్ఆర్ఇజిఎను దాని అసలైన, హక్కుల ఆధారిత రూపంలో పునరుద్ధరించాలని, ప్రజల పని హక్కును, పంచాయతీల అధికారాలను పునఃస్థాపించాలి అనేది తమ స్పష్టమైన డిమాండ్ అని వేణుగోపాల్ అన్నారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో సంగ్రామ్' కేవలం ఎంజి నరేగా పరిరక్షణ ప్రచారం కాదని, ఇది 'ఎంజిఎన్ఆర్ఇజిఎ పరిరక్షణ పోరాటం అని రమేష్ అన్నారు. ఈ పోరాట ప్రణాళికలను ఖరారు చేయడానికి అన్ని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయాలలో సన్నాహక సమావేశాలతో జనవరి 8న దీని మొదటి దశ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. విబి జి రామ్ జి చట్టానికి గొప్ప పేరు ఉన్నప్పటికీ, అందులో ఉన్న ఏకైక హామీ 'ప్రమాదకరమైన కేంద్రీకరణ' అని రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఉపాధికి లేదా ఆర్థిక సహాయానికి ఎలాంటి హామీ లేదని ఆయన పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం నిధుల కేటాయింపును కేంద్ర ప్రభుత్వం మాత్రమే నిర్ణయిస్తుందని పేర్కొంటూ ఇది కేంద్రీకృత కార్యక్రమంగా మారిందని, ఎంజి నరేగా వలె ఉపాధి హక్కు కాదని, ఎంజిఎన్ఆర్ఇజిఎలో ఉపాధి కల్పించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని రమేష్ అన్నారు. కొత్త చట్టం కేంద్రం, రాష్ట్రాల మధ్య 60:40 నిధుల విభజనను నిర్దేశిస్తుందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 258ని ఉల్లంఘించడమేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ నిధుల నిష్పత్తిని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం యొక్క సమ్మతి తర్వాత మాత్రమే నిర్ణయించాలని ఆర్టికల్ 258 చెబుతోందని, కానీ 'వారు (కేంద్రం) ఎవరి అనుమతి తీసుకోకుండానే దానిని (విభజనను) సొంతంగా నిర్ణయించారని' రమేష్ అన్నారు. తాము దీనిని (చట్టాన్ని) కోర్టులో సవాలు చేస్తామని రమేష్ చెప్పారు. తమ డిమాండ్ సవరణ కాదు, ఈ చట్టాన్ని పూర్తిగా ఉపసంహరించుకుని, ఎంజిఎన్ఆర్ఇజిఎను పునరుద్ధరించడమేనని ఆయన నొక్కి చెప్పారు. మూడు 'నల్ల' వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళన ఢిల్లీ కేంద్రంగా జరిగిందని, అయితే ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో సంగ్రామం పంచాయతీ, బ్లాక్, జిల్లా, రాష్ట్ర కేంద్రంగా జరుగుతుందని రమేష్ అన్నారు. వికసిత్ భారత్‌రోజ్‌గార్, ఆజీవికా మిషన్ బిల్లు, లేదా విబిజి రామ్ జి, లోక్‌సభ ఆమోదం పొందిన కొన్ని గంటల తర్వాత, డిసెంబర్ 18, 2025న రాజ్యసభలో నిరసనల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. డిసెంబర్ 21న, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ బిల్లుకు తన ఆమోదం తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com